ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 08.05.2026 | సంపుటి :12 సంచిక : 288 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv JANAMSAKSHI
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# సామాన్యుడి ప్రతి సెకనూ విలువైనదే..

## దారి మళ్లించే రోజులు పోయాయి.. దారిచ్చే రోజులు వచ్చాయి

'అధికార పీఠంలో కూర్చున్నా సామాన్యుడి బాధ మరవను. ఇది కేవలం కాన్వాయ్ నిర్వహణ కాదు ఇది పాలకుడు పౌరుడికి ఇచ్చే గౌరవం. ఈ సంప్రదాయం కొనసాగితే హైదరాబాద్ రోడ్లపై ప్రతి పౌరుడూ సమానుడే. సాధారణ ట్రాఫిక్‌లో కాన్వాయ్ వెళ్లడం పాలనాపరమైన గొప్పతనం కాదు అది కనీస బాధ్యత. కానీ ఆ కనీస బాధ్యతను నిర్వర్తించడమే ఈ వ్యవస్థలో విప్లవంగా కనిపిస్తోందంటే అది మన వీఐపీ సంస్కృతికి పట్టిన దుర్గతికి అద్దం పడుతోంది' ఇదీ సీఎం రేవంత్ ఓ నిర్ణయానికి ముందు వ్యక్తం చేసిన ఆవేదన.

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాన్వాయ్ కొత్త సాంప్రదాయం
- పౌరులను అడ్డుకోకుండా సాధారణ ట్రాఫిక్‌లోనే పయనించిన సీఎం
- ప్రజలకు రోడ్లపై ఇబ్బందులు కలగొద్దని ఇప్పటికే ఆదేశాలు
- వీఐపీ సంస్కృతికి చెక్.. నగరవాసుల్లో వ్యక్తమవుతున్న హర్షాతిరేకాలు

హైదరాబాద్ (జనంసాక్షి) : తన కాన్వాయ్ కోసం సాధారణ ప్రజలకు ఆటం కం కలిగించొద్దంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డీజీపీ సీవీ ఆనంద్‌ని బుధవారం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం ఆయన కాన్వాయ్ సాధారణ ట్రాఫిక్‌లోనే ప్రయాణం చేసింది. ఢిల్లీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ వచ్చిన రేవంత్ రెడ్డి శంషాబాద్ విమానాశ్రయం నుంచి తన నివాసానికి రెగ్యులర్ ట్రాఫిక్‌లోనే వెళ్లారు. బుధవారం ఢిల్లీ పర్యటన నేపథ్యంలో రేవంత్ రెడ్డి శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్తున్న క్రమంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో సీఎం వెంటనే స్పందించి మిగతా 2లో..



హైదరాబాద్‌లో నగరంలో సాధారణ వాహనాలతో పాటు వెళ్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాన్వాయ్.. (వృత్తంలో..)

## కౌశిక్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు..

# ఆగ్రహించిన బీజేపీ కార్యకర్తలు

## కరీంనగర్‌లో హైటెన్షన్



- కరీంనగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి.. కారు ధ్వంసం
- లాఠీఛార్జ్ చేసి చెదరగొట్టిన పోలీసులు

కరీంనగర్(జనంసాక్షి): కరీంనగర్ పట్టణంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేంద్రమంత్రి బండి సంజయ్‌పై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఉద్రిక్తతలకు కారణమయ్యాయి. బీజేపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై కర్రలు, రాళ్లతో దాడి చేశారు. కిటికీల అద్దాలు పగులగొట్టారు. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ ముగిసిన 10 నిమిషాలకే బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడి కౌశిక్ రెడ్డి వాహనం ధ్వంసం చేశారు. కౌశిక్ రెడ్డిపై సైతం దాడికి యత్నించారు. దీంతో హుజురాబాద్‌లో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కార్యాలయంలోకి బీజేపీ శ్రేణులు చొచ్చుకెళ్లారు. ఇరు పార్టీలకు చెందిన కార్యకర్తలు పరస్పరం దాడులు చేసుకున్నారు. బీజేపీ కార్యకర్తలపై బీఆర్ఎస్ శ్రేణులు కర్రలతో దాడి చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు పరిస్థితిని అదుపు చేసేందుకు కార్యకర్తలపై లాఠీ ఛార్జ్ చేశారు. బీజేపీ శ్రేణులను అరెస్ట్ చేసి.. పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ కార్యకర్తలను క్యాంప్ కార్యాలయానికి తరలించి, గేట్లు మూసేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై కౌశిక్ రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో బీజేపీ శ్రేణులు ఆగ్రహానికి గురయ్యారు. గురువారం ఉదయం కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంతో పాటు పాడి కౌశిక్‌రెడ్డి కారు అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు.. బీజేపీ శ్రేణులను చెదరగొట్టారు. భారీ బందోబస్తు నడుమ కౌశిక్ రెడ్డిని కరీంనగర్ నుంచి హుజురాబాద్‌కు తరలించారు. హుజురాబాద్ క్యాంప్ కార్యాలయంలో కార్యకర్తలతో ఎమ్మెల్యే మాట్లాడుతున్న సమయంలో బీజేపీ శ్రేణులు ఒక్కసారిగా లోపలికి దూసుకొచ్చే ప్రయత్నం చేశారు. మిగతా 2లో..

### బీజెపి కార్యకర్తలు గుండాల్లా వ్యవహరిస్తున్నారు

- సీఎం రేవంత్‌కు బీ-టీంగా మారిన బండి సంజయ్
- గంగుల కార్యాలయం, కౌశిక్ రెడ్డి కారుపై దాడి ఘటనపై మండిపడ్డ కేటీఆర్,హరీశ్

2లో..

### బండి సంజయ్,సీఎం రేవంత్‌ల మధ్య మ్యాచ్ ఫిక్సింగ్

- ముఖ్యమంత్రితో మిలాఖత్
- భార్య పుస్తెలు అమ్మి పోటీచేసిన కేంద్రమంత్రికి ఇప్పుడు రూ.కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి?
- మీడియా సమావేశంలో కౌశిక్ రెడ్డి ప్రశ్న

## మెజారిటీ తేలాల్సింది రాజ్‌భవన్‌లో కాదు..

# అసెంబ్లీ ఫ్లోర్‌లో..



- గరవ్నర్ తీరుపై మండిపడ్డ పలువురు ప్రముఖులు
- విజయ్‌కు ప్రజల అండ ఉందని వ్యాఖ్య
- ప్రజా తీర్పును అగౌరవపరచడమే: కమల్ హాసన్

చెన్నై(జనంసాక్షి):క్షణక్షణానికి మారుతోన్న తమిళ రాజకీయాలు అందరిలో ఉత్కంఠ రేపుతున్నాయి. ప్రస్తుతం అక్కడ చోటుచేసుకుం టోన్న పరిణామాలపై నటుడు ప్రకాశ్ రాజ్ పోస్ట్ పెట్టారు. విజయ్ ప్రభుత్వం ఏర్పాటుచేయకుండా జరుగుతోన్న జాప్యంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. విజయ్‌కు ప్రజల అండ ఉందని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. అసెంబ్లీ వేదికగా తన బలాన్ని నిరూపించుకునే హక్కు ఆయనకు ఉందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి గవర్నర్‌ను విజయ్ కలిసిన నేపథ్యంలో ప్రకాశ్ రాజ్ తన పోస్ట్‌తో మద్దతు తెలిపారు.ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడులో జరుగుతోన్న పరిణామాలపై కమల్‌హాసన్ స్పందించారు. టీవీకే పార్టీ 108 స్థానాల్లో గెలిచినప్పటికీ ఇప్పటి వరకూ ప్రభుత్వ ఏర్పాటు దిశగా అడుగులు పడకపోవడం ప్రజా తీర్పును అగౌరవపరచడమేనని అన్నారు. ఈ విషయంలో గవర్నర్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలిచిన 233 (విజయ్ రెండు స్థానాల్లో) మంది ఇప్పటి వరకూ ప్రమాణస్వీకారం చేయలేదని.. ఇది రాష్ట్రానికి జరిగిన అవమానమని అసహనం వ్యక్తం చేశారు. ఇలా చేయడం వల్ల ప్రజాస్వామ్యానికి నష్టం వాటిల్లుతుందని అభిప్రాయపడ్డారు. గతంలోనూ ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు 'మెజారిటీని నిరూపించుకోవాల్సింది మిగతా 2లో..

### విజయ్‌కు మరోసారి తిరస్కారం

- మెజారిటీ తేలాలన్న గవర్నర్
- తమిళనాట కొనసాగుతున్న ఉత్కంఠ
- టీవీకే పార్టీకి అధికారం దక్కడంపై తొలగని అనిశ్చితి

2లో..

### విజయ్‌ను అడ్డుకుంటున్న కేంద్రం

- గవర్నర్ తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం
- ఒక్క సీటున్న బీజేపీకి రాజకీయం తగదు
- నేడు లోక్‌భవన్ ముట్టడికి నిర్ణయం
- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు
- అతిపెద్ద పార్టీగా టివికెను ఆహ్వానించాలి
- గవర్నర్ తాత్సారం చేయడం తగదు
- తమిళనాడు లెఫ్ట్ పార్టీల డిమాండ్
- గవర్నర్ తీరుతో ప్రజాస్వామ్యం అపహాస్యం
- కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ ఆగ్రహం

2లో..

## పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ రద్దు

- గడువు పూర్తైన నేపథ్యంలో గవర్నర్ ఆర్.ఎన్.రవి నిర్ణయం
- కేరళలో ముఖ్యమంత్రి అభ్యర్థిపై కొనసాగుతున్న అనిశ్చితి
- రాష్ట్రానికి చేరుకున్న కాంగ్రెస్ పరిశీలకులు
- 12న అసోంలో ప్రభుత్వ ఏర్పాటు

కోల్‌కతా(జనంసాక్షి):పశ్చిమ బెంగాల్ అసెంబ్లీని గవర్నర్ ఆర్.ఎన్.రవి రద్దు చేశారు. మే 7వ తేదీతో అసెంబ్లీ గడువు పూర్తైన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ మమతా బెనర్జీ సీఎం పదవికి రాజీనామా చేయలేదు. ఈ క్రమంలోనే అసెంబ్లీ రద్దు అయినట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ నుంచి ప్రకటన వెలువడింది. మరోవైపు శనివారం బెంగాల్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. శుక్రవారం నాడు భాజపా శాసనసభాపక్ష నేతను ఎమ్మెల్యేలు ఎన్నుకోనున్నారు. కేరళంలో ముఖ్యమంత్రి అభ్యర్థిపై అనిశ్చితి కొనసాగుతోంది. ఫలితాలు వెలువడి మూడు రోజులు గడిచినప్పటికీ.. సిఎం అభ్యర్థి ఎవరన్న అంశంపై స్పష్టత వెలువడలేదు. 140 మంది సభ్యులున్న కేరళం అసెంబ్లీలో యుడిఎఫ్ 102 స్థానాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ కూటమిలో మిగతా 9లో..



## డ్రగ్స్ కట్టడికే తొలి ప్రాధాన్యం

### రిపీటెడ్‌గా పట్టుబడితే పీడీ యాక్ట్ పెట్టే ఆలోచన

- ఈగల్ ఫోర్స్ ద్వారా మంచి ఫలితాలు
- సమీక్షలో డీజీపీ సివి ఆనంద్

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడి చేయడమే తమ తొలి ప్రాధాన్యమని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రిపీటెడ్‌గా డ్రగ్స్ కేసులో పట్టుబడితే పీడీ యాక్ట్ తరహా చట్టాన్ని ఉపయోగిస్తామన్నారు. రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గురువారం తొలిసారిగా ఈగల్ ఫోర్స్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలోని 35 విభాగాలపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. నార్కోటిక్స్‌పై అలర్ట్‌గా ఉన్నామని.. డ్రగ్స్ కట్టడి చేయడంలో మొదటి ప్రాధాన్యతతో ఉన్నామన్నారు. రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా జరిగిన ఆపరేషన్‌పై ఈ సమీక్షలో చర్చించామని వివరించారు. ఈగల్ ఫోర్స్ ద్వారా మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో ఆపరేషన్‌లు నిర్వహించడం ద్వారా నిందితులను అరెస్ట్ చేసి.. వారి వద్ద నుంచి భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. డ్రగ్స్ విషయంలో సరఫరాతోపాటు డిమాండ్.. ఈ రెండింటిపై దృష్టి సారించామని పేర్కొన్నారు. ఈగల్‌లో సిబ్బంది కొరత ఉందన్నారు. సివిల్ ఫోర్స్ అవసరం కూడా ఉందని చెప్పారు. డ్రగ్స్ సప్లయర్స్ ఆస్తులను సీజ్ చేయడం వంటి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ ప్రకటించారు. జిల్లాలో కమిషనర్లు, ఎస్పీలు కూడా డ్రగ్స్ కట్టడిలో కీలక పాత్ర పోషించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. జిల్లా స్థాయిలో నిఘా లోపించిందని ఈ సమీక్షా ద్వారా బహిర్గతమైందని చెప్పారు. నార్కోటిక్ ఐదు పోలీస్ స్టేషన్‌లు మంచిగా పని చేసి, మిగతా 9లో..

## మహిళా సంఘాలకు తీపికబురు

- వడ్డీలేని రుణాలు 5 నుంచి రూ10 లక్షలకు పెంపు
- ఈ మొత్తానికి ప్రభుత్వమే వడ్డీ చెల్లింపు
- పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి): మహిళా స్వయం సహాయక బృందాలకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క గుడ్ న్యూస్ చెప్పారు. ప్రతి ఒక గ్రూపునకు వడ్డీ లేని రుణాలు రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచుతున్నట్లు మంత్రి సీతక్క ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో మహిళా స్వయం మిగతా 2లో..



## ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు

### అదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
### భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

- రెవెన్యూ సంస్కరణలతో నవశకానికి శ్రీకారం
- అదనపు ఎమ్మార్వోల నియామకం
- ఏ చిన్న పొరపాటు జరిగిన ఉపేక్షించేది లేదు
- ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష

హైదరాబాద్(జనంసాక్షి): ప్రతి పేదవాడికి సొంత ఇల్లును సమకూర్చడం, భూ యాజమానులకు తమ భూమిపై స్పష్టమైన హక్కులను కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. ఇల్లు, భూమి ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీకని పేదవాడికి భద్రమైన భవిష్యత్తు కల్పించడమే ప్రభుత్వ సంకల్పం అని మంత్రి పేర్కొన్నారు. పేదల జీవితాల్లో గౌరవప్రదమైన మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రజాప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అనే మహత్తర కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. పథకం కింద పేద కుటుంబాలకు వారి సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కోసం మిగతా 2లో..

జనంసాక్షి www.janamsakshi.org
శుక్రవారం 08.05.2026

# సామాన్యుడి ప్రతి సెకనూ విలువైనదే..!

తన కాన్వాయ్ రాకపోకల కోసం హైదరాబాద్ నగరవ్యాప్తంగా ప్రజల వాహనా లను నిలిపివేయొద్దంటూ సీనియర్ పోలీసు అధి కారులకు రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రహదారులపై ప్రజలకు అసౌకర్యం కలిగించే చర్యల్ని పూర్తిగా నివారించాలని తెలిపారు. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి కాన్వాయ్ కదలికల సమయంలో ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయ డానికి బదులుగా ట్రాఫిక్ పోలీసులు వాహనా లను ఒకే లేన్‌లో కదలడానికి అనుమతించారు.

**కొత్త సాంప్రదాయానికి శ్రీకారం**

అధికారం చేతిలో ఉన్నప్పుడు సామాన్యుడి సౌక ర్యాన్ని మరచిపోవడం పాలకుల పాత అలవాటు. కానీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ సంప్రదాయానికి ఒక్క దెబ్బతో తెరదించారు. శం షాబాద్ అంతర్జాతీయ

**నగరవాసుల్లో హర్షాతిరేకలు**

విమానాశ్రయం నుంచి తన అధికారిక నివాసానికి చేరుకునే దారిలో ఎక్కడా ట్రాఫిక్ నిలిపివేయలేదు, ఏ పౌరుడినీ ఆపలేదు. నగరం సాధారణంగా శ్వాసిస్తుండగా, సీఎం కాన్వాయ్ హుందాగా గమ్యం చేరింది. ఇది యాదృచ్ఛికంగా జరగలేదు. కాన్వాయ్ కదులకముందే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీస్ ఉన్నతాధికారులను పిలిచి స్పష్టంగా చెప్పారు. 'నా కోసం సిటీలో వాహనాలు నిలిపివేయొద్దు. పౌరులకు ఇబ్బంది కలిగించే చర్యలు పూర్తిగా నివారించండి' అన్న ఆదేశం అక్షరాలా అమలైంది. ట్రాఫిక్ పోలీసులు కాన్వాయ్ వెళ్లే వేళ ఒకే వరుసలో వాహనాలను అనుమతిస్తూ సాఫీగా నిర్వహించారు.

**వీఐపీ సంస్కృతికి చెక్ పెట్టిన ఓ నిర్ణయం**

దశాబ్దాలుగా భారత నగరాల్లో వీఐపీ కాన్వాయ్‌లు సాధారణ పౌరుల జీవనాన్ని అల్లకల్లోలం చేస్తున్నాయి. అంబులెన్సులు నిలిచిపోయిన సందర్భాలు, పరీక్షలకు వెళ్లే విద్యార్థులు గంటల తరబడి ఆగిన ఘటనలు అనేకం. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం చిన్నదిగా కనిపించినా పాలనా సంస్కృతిలో పెద్ద మార్పుకు సూచిక. అధికారం అనేది ప్రజలపై ప్రదర్శించేది కాదు, ప్రజల కోసం వినియోగించేది అని ఈ ఒక్క సంఘటన చెప్పింది. రోజువారీ ట్రాఫిక్‌లో ప్రయాణించే హైదరాబాద్ పౌరులు సీఎం నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ అంశం సోషల్ మీడియాలోనూ ట్రెండింగ్‌గా మారింది. 'సీఎం రోడ్డు మాదే కాదు, అందరిదీ అని చెప్పారు" అని నెటిజన్లు కొనియాడారు.

## కౌశిక్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు.. ఆగ్రహించిన బీజేపీ కార్యకర్తలు

కౌశిక్ రెడ్డి క్యాంప్ కార్యాలయంపై దాడికి యత్నించారు. దీంతో వారిని బీఆర్ఎస్ కార్యకర్తలు, కౌశిక్ రెడ్డి అనుచరులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు ఉండగానే బీజేపీ శ్రేణులు చొచ్చుకురావడంతో కౌశిక్ రెడ్డి అనుచరులు వారిపై కర్రలతో దాడి చేశారు. దీంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

## బీజెపి కార్యకర్తలు గుండాల్లా వ్యవహరిస్తున్నారు

హైదరాబాద్(జనంసాక్షి): కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారుపై బీజేపీ శ్రేణులు దాడి చేయడంపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఈ పిరికిపంద చర్యలకు ఉసిగొల్పుతున్నారంటూ బండి సంజయ్‌పై మాజీ మంత్రి ఫైర్ అయ్యారు. 'ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో పాటు కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ అనుచరుల హేయమైన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. దాడి జరిగిన వెంటనే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డితో మాట్లాడాం. పట్టపగలు గుండాల మాదిరిగా క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించి వాహనాలను, ఆఫీసును ధ్వంసం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య. కళ్లముందే ఇంత అరాచకం సృష్టిస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తూ చోద్యం చూడటం సిగ్గుచేటు. సీఎం రేవంత్‌కు బీ–టీంగా మారిన బండి సంజయ్.. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఈ పిరికిపంద చర్యలకు ఉసిగొలుపు తున్నారు. ప్రతిసారి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు కుప్పి గంతులు వేయడం తప్ప కరీంనగర్ ప్రజలకు బండి సంజయ్ చేసిందేమీ లేదు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉండి తన అనుచరులతోనే శాంతి భద్రతలను దెబ్బతీసేలా వ్యవహరించడం ప్రజాస్వామ్యాన్ని అప హాస్యం చేయడమే. జై తెలంగాణ' అంటూ కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బండి సంజయ్ అనుచరుల దాడిని హరీష్ తీవ్రంగా ఖండించారు.ఏకంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవ ర్గంలోనే, ఆయన అనుచరులు దాడి చేయడం అత్యంత దురదృష్టకరమని కేటీఆర్ అన్నారు. దాడులకు పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## బండి, సీఎం రేవంత్‌ల మధ్య మ్యాచ్ ఫిక్సింగ్

కరీంనగర్(జనంసాక్షి): కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. బండి సంజయ్, సీఎం రేవంత్ రెడ్డి మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని ఆరోపించారు. రేవంత్ ఏది మాట్లాడితే.. బండి సంజయ్ అదే మాట్లాడుతున్నారని తెలిపారు. బండి సంజయ్ తిట్టాల్సింది కేటీఆర్‌నా .. రేవంత్ రెడ్డినా అని ప్రశ్నించారు. బంగారం షాపులో దొంగతనం జరిగితే ప్రభుత్వానికి బాధ్యత లేదా అని నిలదీశారు. రేవంత్‌ను సంజయ్ ఒక్క మాట కూడా ఎందుకు అనడం లేదని అన్నారు. భార్య పుస్తెలు అమ్మి పోటీ చేసిన బండి సంజయ్‌కు కోట్ల రూపాయలు ఎక్కడివని ఎమ్మెల్యే ప్రశ్నించారు. బండి సంజయ్‌కు రేవంత్ రెడ్డి డబ్బులు పంపిస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్‌ను విమర్శించే స్థాయి కేంద్ర మంత్రికి లేదన్నారు. బండి సంజయ్‌కు దమ్ముంటే కేటీఆర్‌తో చర్చకు రావాలని సవాల్ విసిరారు. కేటీఆర్‌ను ఇష్టం వచ్చినట్టు తిడితే ఊరుకునేది లేదన్నారు. బండి సంజయ్‌ను కూడా తాము తిట్టగలమని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## పంజాబ్‌లో ఈడీ సోదాలు

- కిందకు విసిరేసిన రెండు నోట్ల కట్టల బ్యాగులు
- కారులో వచ్చిన డ్రైవర్ వాటితో పరార్

చండీఘడ్(జనంసాక్షి):పంజాబ్ లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు నిర్వహిస్తుండగా.. అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఈడీ దాడుల భయంతో.. రూ.500 నోట్ల కట్టలతో నిండిన రెండు బ్యాగులను కిందకు విసిరేశారు. ఆ తర్వాత ఓ వాహనంలో అక్కడికి వచ్చిన డ్రైవర్ ఆ బ్యాగులు తీసుకుని పరారయ్యాడు. ప్రస్తుతం ఈ విషయం చర్చనీయాంశం అయింది. గ్రేటర్ మొహాలీ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ లో భూవినియోగ అనుమతుల్లో అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నితిన్ గోహల్‌కు, పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌కు ఓఎస్డీగా ఉన్న రజబీర్ ఘుమాన్‌తో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా.. ఈ కేసుకు సంబంధించి పంజాబ్, చండీగఢ్ లలోని పలువురు బిల్డర్లు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు సంబంధించిన భవనాలు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు గురువారం సోదాలు చేశారు. ఈ క్రమంలోనే మొహాలీలోని ఖరార్‌లో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లోకి అధికారులు చేరుకోగానే.. అక్కడినుంచి రూ.500 నోట్ల కట్టలతో నిండిన రెండు బ్యాగులను ఎవరో కిందకి విసిరేశారు. అదే సమయంలో ఓ వాహనంపై వచ్చిన డ్రైవర్ వాటిని తీసుకొని అక్కడినుంచి పరారయ్యాడు. నోట్ల కట్టలతో ఉన్న బ్యాగు దృశ్యాలను ఎవరో సోషల్ మీడియాలో షేర్ చేయగా.. తాజాగా అది వైరల్ అవుతోంది.

# మెజారిటీ తేలాల్సింది రాజ్‌భవన్‌లో కాదు.. అసెంబ్లీ ఫ్లోర్‌లో..

శాసనసభలో కానీ, రాజ్యభవన్‌లో కాదని' సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన విషయాన్ని కమల్ హాసన్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ అంశంపై నటుడు విశాల్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. 'గతంలో గోవా, మణిపుర్, మేఘాలయ, ముఖ్యంగా కర్ణాటకలో ఇదే పరిస్థితి ఎదురైంది. వారంతా అసెంబ్లీలో బలపరీక్ష నిరూపించుకున్నారు. అదే పద్ధతిలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు విజయ్‌కు అవకాశం ఇవ్వడానికి తమిళనాడు గవర్నర్ ఎందుకు వెనుకాడుతున్నారు?. ప్రజలు ఇచ్చిన తీర్పుపై గౌరవం అంటే ఇదేనా?. 233 మంది ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది. ఎన్నికల్లో టీవీకేకు ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చిన తర్వాత కూడా ఇలా ఎందుకు జరుగుతోంది?. ప్రాథమిక హక్కులు రాజకీయ నాయకులకే కాదు.. తమిళనాడు ప్రజలకు కూడా తెలుసు" అని అన్నారు. 'విజయ్.. మీరు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి.. చేస్తారు కూడా' అంటూ ఆయనకు మద్దతు ఇచ్చారు. ఒక ఓటరుగా తాను ఇదే కోరుకుంటున్నట్లు విశాల్ చెప్పారు. మరోవైపు తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవలి ఫలితాల్లో టీవీకే అతి పెద్ద పార్టీగా అవతరించినప్పటికీ మెజార్టీ మార్క్ కోసం ప్రయత్నాలు చేస్తోంది. దీంతో విజయ్ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు మరికొంత కాలం పట్టనుంది. ఈలోపు ఏం జరుగుతుందా? అనేదానిపై సందిగ్ధత నెలకొంది.

**విజయ్‌కు మరోసారి తిరస్కారం**

చెన్నై(జనంసాక్షి): తమిళనాడులో రాజకీయ పరిణామాలు క్షణక్షణానికి మారుతున్నాయి. టీవీకే చీఫ్ విజయ్ గురువారం మరోసారి లోక్‌భవన్‌కు వెళ్లి, గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిశారు. తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడానికి, అసెంబ్లీలో మెజార్టీ నిరూపించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ భేటీపై లోక్‌భవన్ తాజాగా ప్రకటన విడుదల చేసింది. గవర్నర్ ఆర్లేకర్‌తో విజయ్ భేటీ అయ్యారు. మెజార్టీ కనిపించడం లేదని వివరించారు. మెజార్టీతోనే రావాలని గవర్నర్ సూచించారు అని లోక్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. అయితే, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మరే ఇతర పార్టీని ఆహ్వానించబోమని విజయ్‌కు గవర్నర్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. గవర్నర్ ఆహ్వానం మేరకే విజయ్ ఆయన్ను కలిసినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత రెండు రోజుల వ్యవధిలో రెండుసార్లు వీరి భేటీ జరిగింది. కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన నేపథ్యంలో బుధవారం గవర్నర్‌తో టీవీకే చీఫ్ భేటీ కాగా.. సంఖ్యాబలంపై గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేయలేదు. 118 మంది సభ్యులు సమకూరిన అనంతరం రావాలని సూచించినట్టు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం ఏర్పాటుచేయడానికి విజయ్‌కు అనుమతి ఇవ్వాలని వీసీకే గవర్నర్‌ను కోరింది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించే అవకాశంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఇద్దరేసి ఎమ్మెల్యేలున్న వీసీకే, సీపీఐ సానుకూలంగా స్పందించినా, ఇంకా అధికారికంగా చెప్పలేదు. టీవీకేకు తొలుత అవకాశం ఇవ్వాలనే అభిప్రాయాన్ని డీఎంకే కూడా వ్యక్తం చేసింది. ప్రొటోకాల్ ప్రకారం తమిళనాడు ముఖ్యమంత్రికి అందించే పోలీసు కాన్వాయ్‌ను విజయ్ నిరాకరించారు. ప్రమాణస్వీకారానికి ముందే ఆ ఏర్పాటు తనకు వద్దని విజయ్ చెప్పినట్లు టీవీకే వెల్లడించింది. తమిళనాడులో టీవీకే నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధం నెలకొనడంతో ఆయన కాన్వాయ్‌ను వెనక్కి తీసుకున్నారంటూ వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. గురువారం పార్టీ నుంచి వచ్చిన స్పందనను పోలీసు అధికారులు కూడా ధ్రువీకరించారు. తమిళనాడు ఎన్నికల ఫలితాల అనంతరం ప్రొటోకాల్ ప్రకారం అందించిన సీఎం కాన్వాయ్ వాహనాలను విజయ్ తిరిగి ఇచ్చేశారని, తాము ఉపసంహరించుకోలేదని పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. అలాగే ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. మే 4న ఫలితాల తర్వాత నాలుగు కాన్వాయ్ వాహనాలను పోలీసు శాఖ అందించింది. అలాగే ఆయన ఇంటి వద్ద కూడా భద్రతను పెంచింది. కాగా.. గవర్నర్ వద్దకు వెళ్లేటప్పుడు విజయ్ ప్రభుత్వ వాహనాన్ని వినియోగించలేదని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## విజయ్‌ను అడ్డుకుంటున్న కేంద్రం

చెన్నై(జనంసాక్షి):తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. నటుడు, రాజకీయ నాయకుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, ప్రభుత్వం ఏర్పాటు చేసే విషయంలో గవర్నర్ కార్యాలయం తీసుకున్న నిర్ణయం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన మెజారిటీ మద్దతు ప్రస్తుతం టీవీకే వద్ద లేదని గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ స్పష్టం చేశారు.గవర్నర్ వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం గవర్నర్ వ్యవస్థను వాడుకుంటోందని సీపీఎం తీవ్రంగా ఆరోపించింది. విజయ్‌కు కేవలం సీపీఎం మాత్రమే కాకుండా, ఇతర పార్టీల నుంచి కూడా మద్దతు లభిస్తోంది. సిపిఐ తదితర పార్టీలు కూడా ప్రజా తీర్పును గౌరవించి విజయ్‌కు అవకాశం ఇవ్వాలని కోరుతున్నాయి. కాంగ్రెస్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, తమిళనాడు ప్రజల తీర్పును గౌరవించాలని హితవు పలికింది. 118 సీట్ల మెజారిటీ మార్కును అందుకోవడానికి టీవీకేకు ఇంకా మరో 10 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ఒకవేళ కాంగ్రెస్ (5 సీట్లు), సీపీఎం, సీపీఐ, వీసీకే వంటి పార్టీలు అధికారికంగా మద్దతు లేఖలు అందజేస్తే విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు మార్గం సుగమం అవుతుంది. అప్పటి వరకు తమిళ రాజకీయాల్లో ఈ ఉత్కంఠ కొనసాగుతూనే ఉంటుంది.

**గవర్నర్ తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం**

తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటు అంశం ఇప్పుడు రాజ్యాంగ సంక్షోభానికి దారితీస్తోంది. అత్యధిక స్థానాలు సాధించిన టివికె అధినేత విజయ్‌ను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించడంలో గవర్నర్ ఆలస్యం చేస్తుండటాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ పోరుబాట పట్టబోతోంది. గవర్నర్ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నేడురాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ గవర్నర్ నిర్ణయాన్ని నిరసిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. నేడు చెన్నైలోని గవర్నర్ అధికారిక నివాసం లోక్ భవన్‌ను ముట్టడించాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చింది. కేవలం చెన్నైలోనే కాకుండా, రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో భారీ ఎత్తున ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించింది.

**గవర్నర్ తీరుతో ప్రజాస్వామ్యం అపహాస్యం**

తమిళనాడులో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉన్న 'తమిళగ వెట్రి కజగం' అధినేత విజయ్‌కు కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ పూర్తి మద్దతు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోసం ఎంతో ఆశగా ఓటు వేసినప్పటికీ, నటుడిగా రాజకీయాల్లోకి వచ్చిన విజయ్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. తమిళనాడులో వచ్చిన తీర్పు విజయ్ నాయకత్వానికి ప్రజల మద్దతును స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఠాగూర్ పేర్కొన్నారు. గవర్నర్ వెంటనే విజయ్‌ని ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఆహ్వానించాలని, సభలో తన మెజారిటీని నిరూపించుకోవడానికి అనుమతించాలని ఆయన డిమాండ్ చేశారు.

## దేశ భద్రతపై మన నిబద్ధతను 'ఆపరేషన్ సిందూర్' ప్రతిబింబించింది

ఉగ్రమూకలకు గుణపాఠం చెప్పాం: మోదీ పోస్ట్

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఉగ్రవాదంపై భారత్ కఠిన వైఖరిని, దేశ భద్రతను పరిరక్షించడంలో మన నిబద్ధతను 'ఆపరేషన్ సిందూర్' ప్రతిబింబించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 'ఆపరేషన్ సిందూర్‌కు ఏడాది పూర్తయిన వేళ ప్రధాని 'ఎక్స్' వేదికగా పోస్ట్ పెట్టారు. ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు దృఢంగా నిలబడతామని ఈ సందర్భంగా మోదీ పునరుద్ఘాటించారు. "సరిగ్గా ఏడాది క్రితం మన సాయుధ దళాలు అసమాన ధైర్యం, అంతులేని సంకల్పం, అత్యంత కచ్చితత్వంతో 'ఆపరేషన్ సిందూర్' చేపట్టాయి. పహల్గాంలో అమాయక భారతీయుల ప్రాణాలను బలితీసుకున్న ఉగ్రమూకలకు గట్టిగా గుణపాఠం చెప్పాయి. మన సైన్యం చూపిన శౌర్య పరాక్రమాలకు యావత్ భారతావని గర్విస్తోంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మన కఠిన వైఖరిని ఈ ఆపరేషన్ ప్రతిబింబించింది. దేశ భద్రతను పరిరక్షించుకోవడంలో మన దళాల నిబద్ధత, సంసిద్ధత, సమర్థత, సంకల్ప బలాన్ని చాటిచెప్పింది. రక్షణరంగంలో స్వావలంబన కోసం మనం చేపట్టిన ప్రయత్నాలు ఫలించి.. జాతి భద్రతకు అదనపు బలాన్ని చేకూర్చాయని 'సిందూర్'తో స్పష్టమైంది. ఉగ్రవాదులు, వారికి మద్దతిచ్చే వారిపై ఉక్కుపాదం మోపుతూనే ఉంటాం" అని మోదీ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.ఇదిలాఉండగా.. ఆపరేషన్ సిందూర్‌లో మన విజయానికి గుర్తుగా కేంద్రం కొత్త లోగోను రూపొందించింది. గతేడాది ఆపరేషన్ సమయంలో విడుదల చేసిన 'సిందూర్' లోగో పైన సగర్వంగా రెపరెపలాడుతున్న మన మువ్వన్నెల పతాకాన్ని జోడించింది. ఈ ఫొటోను ప్రధాని మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, రాజకీయ ప్రముఖులు తమ సోషల్ మీడియా ఖాతాలకు డీపీగా పెట్టుకున్నారు.

**పాక్‌లో ఏ ఉగ్ర స్థావరం సురక్షితం కాదు :భారత సైన్యం**

న్యూఢిల్లీ(జనంసాక్షి):పాకిస్థాన్‌లో ఏ ఉగ్ర స్థావరం సురక్షితం కాదని ఆపరేషన్ సిందూర్‌తో స్పష్టమైన సందేశం ఇచ్చామని భారత త్రివిధ దళాలు పేర్కొన్నాయి. దేశ ప్రజలను, సార్వభౌమత్వాన్ని భారత్ కాపాడుకోగలదని స్పష్టం చేశాయి. ఆపరేషన్ సిందూర్‌కు ఏడాదైన సందర్భంగా త్రివిధ దళాల ముఖ్య అధికారులు జైపూర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఆపరేషన్ ఇంకా ముగియలేదని, ఇది ఆరంభం మాత్రమేనని వెల్లడించారు.ఉగ్రవాదంపై భారత్ పోరు కొనసాగిస్తుందని లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ పేర్కొన్నారు. వివిధ విభాగాలతో కలిసి తక్కువ సమయంలో, కచ్చితత్వంతో ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా అమలు చేశామన్నారు. గతేడాది ఆర్మీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ స్థాయిలో ఉన్న ఆయన.. పాక్ ఉగ్రస్థావరాలపై చేపట్టిన ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించారు. వైమానిక వ్యవహారాల డైరెక్టర్ జనరల్ ఎయిర్ మార్షల్ ఏకే భారతీ మాట్లాడుతూ.. గతేడాది ఆపరేషన్ ద్వారా వాయుసేన సామర్థ్యాలను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పామన్నారు.

## మహిళా సంఘాలకు తీపికబురు

సహాయక బృందాలతో మంత్రి సీతక్క సమావేశమ య్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రతి మహిళా సంఘం తీసుకునే రూ. 10 లక్షలు బ్యాంకు రుణాలకు వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తోందని హామీ ఇచ్చారు. మహిళా సంఘాల రుణాలకు ఈ ఏడాది వడ్డీల కోసం రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తామని వివరించారు. అప్పటి వరకు అర్హత గల మహిళా సంఘాలకు రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు కల్పించామన్నారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచుతున్నామని వివరించారు. మహిళలపై భారాన్ని దించేందుకు వడ్డీ లేకుండా రెట్టింపు లోన్లు ఇస్తున్నామన్నారు. బ్యాంకులకు రీ పేమెంట్ బాగా చేస్తున్నారంటూ మహిళా సంఘాలపై ఈ సందర్భంగా మంత్రి సీతక్క ప్రశంసలు కురిపించారు.మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి అన్న నినాదంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం యజ్ఞంలా తామంతా పని చేస్తున్నామని వివరించారు. మహిళలు పేదరికం నుంచి బయటపడినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందుకే వడ్డీ లేని రుణాలు ఇప్పించి ఆర్థికంగా మహిళలను ఎదిగేలా చేస్తున్నామని చెప్పారు.

## భారత్‌తో ఒప్పందానికి చాలా దగ్గరగా ఉన్నాం

**చివరి అడ్డంకినే అధిగమించాలి: అమెరికా**

**వాషింగ్టన్(జనంసాక్షి):**

భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై అమెరికా కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం దాదాపు ఖరారైందని అమెరికా ఉప విదేశాంగ కార్యదర్శి క్రిస్టోఫర్ లాండౌ తెలిపారు. సంతకం చేయడానికి ఇరు దేశాలు చాలా దగ్గరగా ఉన్నాయని చెప్పారు. ఇప్పుడు మిగిలింది ఒక చివరి అడ్డంకి మాత్రమే అని పేర్కొన్నారు. మేరీల్యాండ్‌లోని నేషనల్ హార్బర్ వద్ద జరిగిన సెలెక్ట్ యూఎస్ఏ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ సందర్భంగా మీడియాతో మాట్లాడిన లాండౌ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.'ఇప్పటికే చాలా కాలంగా చర్చలు జరుగుతున్నాయి. ఈ ఒప్పందానికి తుది పరిష్కారం లభించడం చాలా ముఖ్యం అని నేను భావిస్తున్నా. మేం చాలా దగ్గరగా ఉన్నామని అనుకుంటున్నా. కానీ మనం చివరి అడ్డంకిని అధిగమించాలి. అంతేకాకుండా అజెండాలోని ఇతర ముఖ్య అంశాలపై ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. అయితే అది ఎప్పుడు జరుగుతుందనే దానిపై నా వద్ద పెద్దగా అంతర్గత సమాచారం ఏమీ లేదు. కానీ మనం చాలా దగ్గరగా ఉన్నామని నేను నమ్ముతున్నాన'ని లాండౌ పేర్కొన్నారు.ఇటీవల చేసిన భారత్ పర్యటన గురించి లాండౌ గుర్తు చేసుకున్నారు. 'భారత్ ప్రపంచంలో కీలక శక్తిగా ఎదుగుతోందని అనడంలో ఎటువంటి సందేహం లేదని భావిస్తున్నా. ప్రస్తుతం ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశం భారత్. అంతేకాకుండా భారత్‌కు ఆర్థికంగా అద్భుతమైన అపార అవకాశాలు ఉన్నాయి. గతంలో తీసుకున్న ఆర్థిక విధానాల కారణంగా పూర్తి స్థాయిలో అభివృద్ధి జరగలేదు. కానీ ఇప్పుడు భారీ ఆర్థిక వృద్ధికి భారత్ సిద్ధంగా ఉంది. తద్వారా కోట్లాది మంది ప్రజలను పేదరికం నుంచి బయటపడేయడానికి సిద్ధంగా ఉంద'ని లాండౌ వ్యాఖ్యానించారు.

# ప్రతీ పేద కుటుంబానికి సొంత ఇల్లు

ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. దాదాపు 4 లక్షల ఇళ్లను మంజూరు చేసి, రాష్ట్రవ్యాప్తంగా గృహ విప్లవానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. హౌసింగ్, రెవెన్యూ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో జరుపుతున్న సమీక్షలో భాగంగా గురువారం హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారాలతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నల్గొండ ఇన్ ఛార్జి మంత్రి ఎస్సీ ,ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్, వాకాటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ జి. చిన్నా రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు జితేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో క్షేత్ర స్థాయిలోని పరిస్థితులపై స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయంతో వ్యవహరిం చాలని, జిల్లా స్థాయిలో అధికారయంత్రాగమంతా సమన్వయంతో పనిచేస్తే అక్కడికక్కడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలని ఆదేశించారు. ఒదిరమ్మ ఇండ్ల పథకం అమలులో అత్యధిక శాతం అధికారాలను కలెక్టర్లకే దఖలు పరిచామన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఒకసారి ప్రొసీడింగ్స్ ఇచ్చి, మొదటి బిల్లు వారి ఖాతాల్లో జమ అయిన లబ్దిదారులందరికీ తదుపరి విడతల బిల్లులన్నిటిని సకాలంలోనే విడుదలయ్యేలా చూడాలని మంత్రిగారు కలెక్టర్లను ఆదేశించారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎటువంటి అక్రమాలకు తావివ్వకుండా, పూర్తి పారదర్శకంగా జవాబుదారీ తనంతో పనిచేస్తూ అర్హులైన వారికే ఫలాలు దక్కేలా చూడాలని ఈ విషయంలో ఎక్కడ పొరపాటు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం సేకరించి పూర్తి స్థాయిలో వినియోగించకుండా మిగిలి ఉన్న భూముల్లో అర్హులైన వారికి ఇండ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇల్లు మంజురైనా వివిధ కారాణలతో నిర్మాణాలను పూర్తి చేయని వారికి కూడా వెసులుబాటు కల్పించే యోచనలో ఉన్నామని తెలిపారు. ముఖ్యంగా జిల్లాల్లో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరక్టర్లు పూర్తి బాధ్యతాయుతంగా విధులను నిర్వహించాలని, లబ్దిదారులు, ఉన్నతాధికారుల మధ్య సమన్వయకర్త లుగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని , ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అలాగే డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణపు పనులు ఏ స్థాయిలో ఉన్నా, ఈ నెల 20 వ తేదీలోగా లబ్దిదారుల ఎంపికను పూర్తి చేయాలని, ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపాలని మంత్రి పొంగులేటి సూచించారు. అర్హులైన పేదలనే లబ్దిదారులగా ఎంపిక చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ కార్యాలయాలన్నింటిని ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశాల్లో నెలకొల్పేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అలాగే లక్షకు పైగా జనాభా ఉన్న మండలాల్లో, అవసరానికి అనుగుణంగా, అదనంగా మరో తహశీల్దార్‌ను నియమించనున్నా మని మంత్రి తెలిపారు. ఇందుకు సంబంధించిన జిల్లా కలెక్టర్లు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ, అటవీ తదితర శాఖల మధ్య ఉన్నభూ వివాదాల సమస్య కు శాశ్వత పరిష్కారం కోసం ఆయా విభాగాలు ఉమ్మడిగా సర్వే చేయడమే మార్గమన్నారు. ఈ దిశలో మరింత వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అటవీ, రెవెన్యూ అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా రెవెన్యూ విభాగంలో అనేక సంస్కరణలు తీసుకుని వచ్చి ఆర్డీవోలకు విస్తృతమైన అధికారాలు కల్పించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాకుండా, ఇతర ప్రయోజనాలకు వీటిని వినియోగిస్తే అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ పరిపాలనను బలోపేతం చేయడంలో భాగంగా సర్వే, సెటిల్మెంట్స్ మరియు భూ రికార్డుల శాఖ ద్వారా సమగ్ర సంస్కరణలు అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. భూ రికార్డుల్లో పారదర్శకత, ఖచ్చితత్వం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు.



## నిజాయితీ, సేవాభావంతో పనిచేయండి

**భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలి**

**ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు మంత్రి పొంగులేటి పిలుపు**

హైదరాబాద్(జనంసాక్షి):ఎంతో మంది మధ్య పోటీపడి, నిబద్ధతతో కష్టపడి సాధించిన గ్రూప్–1 డిప్యూటీ కలెక్టర్ల ఉద్యోగాన్ని ప్రజాసేవకు అంకితం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు సూచించారు.వ్యక్తిగతంగానే కాకుండా ప్రభుత్వానికి కూడా మంచి పేరు తీసుకురావాలని, ముఖ్యంగా సమాజంలోని 'పూరెస్ట్ ఆఫ్ ది పూర్' కు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటూ ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలవాలని ఉద్బోధించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన 44 మంది గ్రూప్–1 ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు గురువారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ, ప్రజల సమస్యలకు వెంటనే స్పందించాల్సిన కీలక బాధ్యత రెవెన్యూ శాఖ అధికారులపై ఉంటుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ఛాలెంజ్‌గా స్వీకరించి ముందుకు సాగితే కలిగే సంతృప్తి అమూల్యమని అన్నారు.దర్పవంతమైన సేవలతో భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలని యువ అధికారులకు మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పొన్నంకు మంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):తెలంగాణ రవాణా శాఖ పనితీరును కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసించారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కేంద్రమంత్రి అభినందనలు తెలిపారు. మంత్రి పొన్న ప్రభాకర్‌ని ప్రశంసిస్తూ నితిన్ గడ్గరీ గురువారం లేఖ రాశారు. చెక్‌పోస్టుల రద్దు నిర్ణయంపై ప్రశంసలు కురిపించారు. వాహన్ సమీకరణపై కేంద్రమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌లను ప్రశంసించారు. రోడ్డు భద్రత చర్యల్లో తెలంగాణ ముందంజలో ఉందని కొనియాడారు. డిజిటల్ గవర్నెన్స్‌లో తెలంగాణపై ప్రశంసలు కురిపించారు. ప్రజా అవగాహన కార్యక్రమాలు అభినందనీయమని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.



# 8న జరిగే మెగా జాబ్ మేళా

- యువత సద్వినియోగం చేసుకోవాలి
- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



**హనుమకొండ ప్రతినిధి మే 7 (జనం సాక్షి) :** హనుమకొండలో మే 8వ తేదీన శుక్రవారం నిర్వహించనున్న ఉమ్మడి వరంగల్ జిల్లా మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కోరారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలతో కలిసి మంత్రి మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. చదువుకు తగిన ఉద్యోగ అవకాశాలు యువతకు అందేలా ఇలాంటి మెగా జాబ్ మేళాలు దోహదపడతాయని పేర్కొన్నారు. హనుమకొం డలోని కాళోజి కళాక్షేత్రంలో నిర్వహించనున్న ఈ మెగా జాబ్ మేళాలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నా యని తెలిపారు. ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువత ఈ అవకాశాన్ని వినియోగిం చుకోవాలని సూచించారు. మ్యానుఫ్యాక్చరింగ్, డిజిటల్ మీడియా, హెల్త్ కేర్, బిజినెస్ సర్వీసెస్, లాజిస్టిక్స్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ, కస్టమర్ కేర్, హాస్పిటాలిటీ తదితర రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతలు, ఇతర ధ్రువపత్రాలతో నేరుగా మెగా జాబ్ మేళాకు హాజరుకావాలని మంత్రి కోరారు.

# రైతు భవిష్యత్తుకు కొత్త దిశ - మెగా రైతు మేళా..

- రైతు సంక్షేమం నుండి ఆదాయ పెరుగుదల దిశగా ప్రభుత్వం అడుగు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హన్మకొండ ప్రతినిధి మే 7 (జనం సాక్షి) :** రైతు భవిష్యత్తుకు కొత్త దిశ మెగా రైతు మేళా అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా ఈ నెల 5వ తేదీ నుండి 7వ తేదీ వరకు హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించబడుతోంది. మూడు రోజుల రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా చివరి రోజు గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావురాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్య అతిథులుగా హాజరై వివిధ స్టాళ్లను సందర్శించారు. వారి వెంట వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్, రాష్ట్ర హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, హనుమకొండ మరియు వరంగల్ జిల్లా కలెక్టర్లు చాహాత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద,కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, సం బంధిత శాఖల జిల్లా అధికా రులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతు ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మెగా రైతు మేళాలు నిర్వహిస్తున్నా మని తెలిపారు. తెలంగాణ వ్యవసాయానికి కొత్త దిశ చూపిన రైతు మేళా అని అన్నారు. మారుతున్న వ్యవసాయ విధానాలకు అనుగుణంగా యాంత్రీకరణ, పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు, మార్కెటింగ్ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్లు, అధికారులు సమన్వయంతో ఈ మేళాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ రైతులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకునే విధంగా స్ఫూర్తిదాయక ప్రసంగాలు విన్నామని తెలిపారు. వివిధ పంటలను సాగు చేస్తున్న అనుభవజ్ఞులైన రైతులు తమ అనుభవాలను పంచుకోవడం ఎంతో ప్రేరణనిచ్చిందన్నారు. ప్రస్తుతం ఆహార పదార్థాలు, పానీయాలలో కల్తీ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో సహజ, సేంద్రియ వ్యవసాయానికి మారాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక విధాలుగా తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. ప్రజా పాలనలో రైతు సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా అంతర పంటల సాగు చేయాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి సారించి ఆరోగ్యకరమైన పంటలను ఉత్పత్తి చేయాలని కోరారు. ఆయిల్ పామ్ పంట లాభసాటిగా ఉన్నందున రైతులు దీని సాగును విస్తృతంగా చేపట్టాలని మంత్రి సూచించారు. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. రైతులకు చెందాల్సిన అన్ని సంక్షేమ పథకాలను ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందిస్తున్నదని తెలిపారు. ప్రాంతాలవారీగా జరుగుతున్న మార్పులను గమనించి పంటల మార్పిడి ద్వారా వ్యవసాయాన్ని సాగు చేయాలని రైతులకు సూచించారు. ఆలేరు రైతు గోపిరెడ్డి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుతో స్థిరమైన ఆదాయం లభిస్తోందని తెలిపారు. మహిళా రైతు లావణ్య రెడ్డి ప్రకృతి వ్యవసాయం, అంతర పంటల సాగు ద్వారా లాభాలు సాధిస్తున్నామని తెలిపారు. మహిళా రైతు భాగ్యలక్ష్మి మిర్చి పంట సాగు, విలువ ఆధారిత ఉత్పత్తుల విక్రయాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఆఫీస్‌పై దాడి హేయం

- మాజీ బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీగా ప్రశ్నించడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని అలా ప్రశ్నిస్తే భౌతిక దాడులు చేస్తాం బెదిరిస్తామనే ధోరణిలో నేడు కాంగ్రెస్, బిజెపి విధానాలను చూస్తుంటే సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని మాజీ బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర అన్నారు. గతంలో ఇలాంటి సంఘటనలు బీహార్, ఉత్తరప్రదేశ్‌లో జరిగిన సందర్భాలు చూసామని, అలాంటి పెడధోరణులు తెలంగాణలో బిజెపి పరిచయం చేయాలని చూస్తున్నదని, ఇది సమాజానికి నష్టం కలిగించే విధంగా ఒక రాజకీయ పార్టీ ప్రవర్తించడం దుర్మార్గమని అన్నారు. తెలంగాణ ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రెండు జాతీయ పార్టీలు గతంలో కాంగ్రెస్ పార్టీ టిఆర్ఎస్ నాయకుల ఆఫీస్ పై ఇళ్లపై దాడులు చేసిందని దాని కొనసాగింపుగా నేడు పాడి కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యే క్వార్టర్స్ పై బిజెపి దాడి చేయడం.. రెండు పార్టీలు కుమ్మక్కై టిఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేయడం ఒక కుట్ర అని ఆయన అన్నారు. రాబోయే కాలంలో రెండు పార్టీలకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గర్లోనే ఉన్నదని, ఇలాంటి దాడులకు బెదిరింపులకు తెలంగాణ సమాజం ముఖ్యంగా బీఆర్ఎస్ కార్యకర్తలు వెనుకకు దగ్గరని ఆయన అన్నారు.

# కేటీఆర్‌కు బీఆర్ఎస్ మలేషియా ప్రతినిధుల ఆహ్వానం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీఆర్ఎస్ మలేషియా ఆధ్వర్యంలో జూన్ 6న కౌలాలంపూర్ లోని మాట్రేడ్ ఎగ్జిబిషన్ అండ్ కన్వెన్షన్ సెంటర్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించ నున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేష్ బిగాల ఆధ్వర్యంలో మారుతి కుర్మా, చిట్టిబాబు, శ్రీధర్, ప్రియా తదితరులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ను కలిసి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ ఆహ్వానాన్ని కేటీఆర్ స్వీకరించి, జూన్ 6న మలేషియాలో జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు హాజరవుతున్నట్లు ధృవీకరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎల్. రమణ , మాజీ ఎమ్మెల్యే జి. కిషోర్ కూడా పాల్గొన్నారు. తెలంగాణ, తెలుగు ప్రజలను ఒక వేదికపైకి తీసుకువచ్చి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ మలేషియా విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.

# మహానాడు కన్వీనర్‌గా లోకేశ్

**అమరావతి, మే 7 (జనంసాక్షి) :** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఇఫ్కో కిసాన్ సెజ్ వేదికగా టీడీపీ మహానాడు- 2026 ను నిర్వహించనున్నారు. ఈ మహానాడు నిర్వహణకు వివిధ కమిటీలను పార్టీ హైకమాండ్ నియమించింది. మొత్తం 21 కమిటీలను నియమించింది. సమన్వయ కమిటీ కన్వీనర్‌గా పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ నియమించింది. ఈ మహానాడు మే 27న ప్రారంభమై.. 29వ తేదీతో ముగియనుంది. ఈ మహానాడు నిర్వహణ కోసం మే 6వ తేదీన ఇఫ్కో కిసాన్ సెజ్‌లో భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు, మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతోపాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మొదటి రెండు రోజులు 20 వేల మంది డెలిగేట్స్ ఈ మహానాడుకు వస్తారని.. మూడో రోజు బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ ముగింపు సభకు దాదాపు ఏడు లక్షలకు పైగా కార్యకర్తలు తరలి వస్తారని అంచనా వేస్తున్నారు.

# వ్యవసాయ భూమిలో గంజాయి సాగు



**కుబీర్, మే 07 (జనంసాక్షి) :** కుబీర్ మండల పరిధిలోని వీరేగాం గ్రామ శివార్లలోని వ్యవసాయ భూమిలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్నారని నమ్మదగిన సమాచారం రావడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గంజాయి మొక్కలను పెంచుతున్న ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడిపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడం జరుగుతుందని పోలీసులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని, గంజాయి, ఇతర మత్తు పదార్థాల సాగు, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుం టామని పోలీసులు హెచ్చరించారు. అనుమా నాస్పద సమాచారముంటే ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి శర్మిల ఆదేశాల మేరకు భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ పర్యవేక్షణ లో సీఐ ప్రవీణ్ కుమార్, కుబీర్ ఎస్ఐ శ్రీనివాస్, ఇతర పోలీసు సిబ్బంది ఈ కేసులో పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షం

## మొక్కజొన్నకు అపార నష్టం



**ఆదిలాబాద్ (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లాలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఆదిలాబాద్, జైనథ్ మార్కెట్లో రైతులు ఆరబెట్టిన మొక్కజొన్న పంటకు తీరని నష్టం జరిగింది. జిల్లాలో గత 15 రోజులుగా మక్క కొనుగోలు జరుగుతుండగా రైతులు తమ పంటను విక్రయించడానికి మార్కెట్ యార్డుకు భారీగా మొక్కజొన్నను తీసుకువచ్చారు. తేమ శాతంతో తోపాటు గన్ని సంచుల కొరత కారణంగా మక్క కొనుగోలులో జాప్యం జరుగుతుంది. ఆదివారం ఆదిలాబాద్ జైనథ్ మార్కెట్ యార్డుల్లో స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం నుంచి అలాట్‌మెంట్ రాకపోవడంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. నాలుగు రోజులుగా పంట కొనుగోళ్ల కోసం పడిగాపులు కాస్తున్న రైతులకు గురువారం ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో మార్కెట్ యార్డ్ లో పంట పూర్తిగా తడిసిపోయింది. ప్రభుత్వం కొనుగోళ్లు చేపట్టకపోవడంతోనే తాము నష్టపోయామని, తడిసిన పంటను కొనుగోలు చేయాలని రైతులు కోరారు.

# సవతి తల్లి గర్భవతిని చేసిన విద్యార్థి

**ముంబై (జనంసాక్షి) :** యువకుడైన విద్యార్థి తన సవతి తల్లిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమెను గర్భవతిని చేశాడు. బాధిత మహిళ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ యువకుడిని అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. 55 ఏళ్ల వికాస్ శ్రీవాస్తవ ఒక ప్రైవేట్ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. 2024లో ఉద్యోగం పేరుతో 26 ఏళ్ల మహిళ అతడికి పరిచయమైంది. వారిద్దరి మధ్య సంబంధం ఏర్పడటంతో ఆమెను రెండో పెళ్లి చేసుకున్నాడు. కాగా, వికాస్ కుమారుడైన 21 ఏళ్ల అక్షత్ శ్రీవాస్తవ ఈ పెళ్లిని వ్యతిరేకించాడు. దీంతో సవతి తల్లి అయిన ఆ మహిళతో అతడు గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 10న అక్షత్ తన గదిలోకి ప్రవేశించి అత్యాచారం చేశాడని ఆ మహిళ ఆరోపించింది. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పవద్దని అతడు బెదిరించాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. తాను గర్భం దాల్చినట్లు ఆమె పేర్కొంది. మరోవైపు ఈ విషయం గురించి తన భర్తకు చెప్పినప్పటికీ పట్టించుకోలేదని ఆ మహిళ ఆరోపించింది. కుటుంబ పరువు, కొడుకు చదువు, అతడి భవిష్యత్తు కోసం మౌనంగా ఉండమని తనను కోరినట్లు ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సవతి తల్లిపై అత్యాచారానికి పాల్పడి ఆమెను గర్భవతిని చేసిన నిందితుడు అక్షత్‌ను అరెస్ట్ చేశారు.

# టెంట్ హౌస్ లో పనిచేస్తూ ఇద్దరు బాల కార్మికులు మృతి

**బల్మూరు (జనంసాక్షి) :** టెంట్ హౌస్ సామానులు ఆటోలో సరఫరా చేస్తూ ఇద్దరు బాల కార్మికులలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రం బల్మూరులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బల్మూరు మండల కేంద్రంలోని ఓ టెంట్ హౌస్ లో గడెల కార్తీక్ (15 ), మందుల ధనుష్ కుమార్ (16) ఇద్దరు బాల కార్మికులు పనిచేస్తున్నారు. పనిలో భాగంగా గురువారం ఉదయం టెంట్ హౌస్ సామాన్లు తీసుకొని తిరిగి వస్తుండగా మండల పరిధిలోని నర్సాయపల్లి గేటు సమీపాన ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో కార్తీక్, ధనుష్ కుమార్ తీవ్ర గాయలతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి తల్లి పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. ఈ విషయమై ఆయా రాజకీయ పార్టీల నాయకులు స్పందిస్తూ బాల కార్మికులను పనిలో పెట్టుకోకూడదని, తెలిసి తెలియని వయసులో ఇలాంటి సంఘటనలు జరగడం బాధాకరమన్నారు.

# దాడిని ఖండించిన ఎమ్మెల్సీ దాసోజు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై బీజేపీ గూండాల దాడిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్రంగా ఖండించారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై వచ్చిన విమర్శలను ప్రజాస్వామ్య పద్ధతిలో తిప్పికొట్టాల్సింది పోయి విజ్ఞత లేకుండా, ఇష్టమొచ్చినట్లు మాట్లాడడమే కాకుండా బీఆర్ఎస్ కార్యాలయంపై దాడులకు దిగడం గూండా రాజ్యంగానే చూడవలసి వస్తుందని పేర్కొన్నారు. బీజేపీ గూండాలు దాడిచేస్తుంటే పోలీసులు లాఠీచార్జీ చేసి దాడిని ఆపకపోగా సహకరించినట్లుగా వీడియోలు కనబడుతున్నాయని విమర్శించారు. బండి సంజయ్ కేంద్ర హోంశాఖా సహాయ మంత్రి అనే సోయి తప్పి మాట్లాడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యాలయంపై దాడులు చేస్తుంటే కరీంనగర్‌లో ఉన్న ఇంటిలిజెన్స్, పోలీసులు ఏం చేస్తున్నారని పేర్కొన్నారు.

# ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్త

- కూలీ దుర్మరణం



**చిట్యాల, మే 07(జనం సాక్షి) :** వ్యవసాయ పనులకు వెళ్లి ఎండ వేడి నుంచి ఉపశమనం కోసం చెట్టు నీడన కూర్చున్న ఒక కూలీని, అజాగ్రత్తగా వచ్చిన ట్రాక్టర్ రూపంలో మృత్యువు కబళించింది. ఈ విషాదకర సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని జడల్ పేట గ్రామ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. జడల్ పేట గ్రామానికి చెందిన జినుకల శ్రీనివాసరావు (55) రోజువారీ కూలి పనుల నిమిత్తం పొలానికి వెళ్లారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో, కాసేపు సేదతీరడం కోసం పొలంలోని ఓ చెట్టు నీడకు వెళ్లారు. అదే సమయంలో పక్కనే ఉన్న భిక్కనూరి మొగిలికి చెందిన వ్యవసాయ భూమిలో పత్తి పొరకలను ఏరువేసేందుకు కొమురె శ్రీనుకు చెందిన ట్రాక్టర్ పనిచేస్తోంది. ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో నియంత్రణ కోల్పోయి చెట్టు కింద కూర్చున్న వారిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన పక్కనే ఉన్న భిక్కనూరి కుమారస్వామి ప్రమాదాన్ని గమనించి పక్కకు తప్పుకోవడంతో ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకున్నారు. మృతుడు శ్రీనివాసరావుకు భార్య ఇంద్ర, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. జడల్ పేట గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను నడిపిన ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# అధికార మదంతో మాట్లాడితే గుణపాఠం తప్పదు

## మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి



**నకిరేకల్ (జనంసాక్షి) :** అధికార మదం, అహంకారంతో మాట్లాడితే ఏమాత్రం ఊరుకునేది లేదని, తగిన గుణపాఠం చెబుతామని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులను హెచ్చరించారు. గురువారం నకిరేకల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ సీనియర్ నాయకుడు హరీశ్ రావుపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నకిలీ నక్సలైట్‌గా ఉండి దొంగ ఉద్యమాలు చేసిన ఎమ్మెల్యే వీరేశంకు తనకు రాజకీయ భిక్ష పెట్టిన కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుని విమర్శించే స్థాయి లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల భాష చాలా దారుణంగా ఉందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన నాయకులపై పోలీసు యంత్రాంగంతో అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుండి దోచుకోవడం దాచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. మోసపూరిత మాటలు, అమలు కానీ హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కి కాంగ్రెస్ పార్టీ వరంగల్లో రైతు డిక్లరేషన్ పేరిట తెలంగాణ రైతులను మోసం చేశారని విమర్శించారు. తెలంగాణ వార్తలు

## అసమర్థ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వచ్చిన నిధులే తప్పా ఈ ప్రభుత్వంలో పైసా నిధులు రాలేదన్నారు. ఆనాటి పథకాలను మార్చి తాను మంజూరు చేసిన పనులకు శిలాఫలకాలు మార్చి చేస్తున్నారు తప్ప కొత్తగా తెచ్చిన రుపాయి లేదని విమర్శించారు. బ్రాహ్మణ వెల్లంల రిజర్వాయర్ కు నేటికీ ఒక్క రూపాయి కూడా తీసుకు రాలేదని అసమర్థ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే విధులు తెచ్చి పనులు చేయించానని నేటికీ అదే పనులు పూర్తి చేసి నీరు విడుదల చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు నకిరేకల్ నియోజకవర్గంలో ఎన్ని గ్రామాలకు బ్రాహ్మణ వెల్లంల ద్వారా నీరు ఇచ్చారో శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. పక్క నియోజకవర్గాలకు నీరు తీసుకెళ్తుంటే తన నియోజవర్గంలో ప్రాజెక్టు ఉండి కూడా ఏమి చేయలేని అసమర్థ ఎమ్మెల్యే అని విమర్శించారు. నకిరేకల్ నుండి హైదరాబాద్ వరకు ఎక్కడ పడితే అక్కడ దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. చెరువుపెల్లిలో మట్టి తరలించేందుకు అధికారులపై ఒత్తిడి చేసి అనుమతులు తీసుకున్నాడని, వాస్తవాలు మాట్లాడకుండా స్థాయిని మించి మాట్లాడుతున్నట్లు విమర్శించారు. నల్లగొండ జిల్లా పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న బెదిరింపులు, భూ కబ్జాలలో నకిరేకల్ ఎమ్మెల్యే హస్తం ఉందని, దీనిపైన పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలన్నారు.

## అపోహాలో బీర్ల అయిలయ్య

ఇక ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నోరుకు అడ్డూ అదుపు లేకుంగా పోయిందన్నారు. ఉద్యమ నాయకుడు హరీశ్ రావును విమర్శించే స్థాయి ఆయనకు లేదన్నారు. హరీష్ రావు లాంటి వ్యక్తుల గురించి మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. హరీశ్‌రావును విమర్శిస్తే మంత్రి పదవి ఇస్తారన్న అపోహాలో బీర్ల అయిలయ్య ఉన్నట్లు కనిపిస్తుందన్నారు. ఆయన భూ దందాల గురించి యాదగిరిగుట్ట ప్రాంత ప్రజలకు బాగా తెలుసన్నారు. రియల్ ఎస్టేట్ కంపెనీల పేరిట యాదాద్రి భువనగిరి జిల్లాలో వందల కుటుంబాలను రోడ్డున పడేసిన చరిత్ర బీర్ల అయిలయ్యది అన్నారు. సామాన్య ప్రజలను ఆసరాగా చేసుకుని నేడు వేల కోట్లకు పడగలెత్తిన అయిలయ్య బాగోతం ఆలేరు నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
8 మే 2026

సంపాదకీయం

# గవర్నర్ వివేచన - రాజ్యాంగ ధర్మం

**తమిళనాడులో 59 సంవత్సరాల ద్రవిడ పాలనాపర్వానికి తెర దించి, తారుమారు ఫలితాలు నమోదు చేసిన 2026 శాసనసభ ఎన్నికలు రాజ్యాంగ సంక్షోభానికి కూడా నాంది పలికాయి. నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) 234 స్థానాల అసెంబ్లీలో 108 స్థానాలు గెల్చుకుని అతిపెద్ద ఏకైక పార్టీగా అవతరించింది. అయినప్పటికీ మ్యాజిక్ ఫిగర్ 118 కంటే 10 స్థానాలు వెనుకబడింది. ఈ సందర్భంలో తమిళనాడు గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ వ్యవహరించిన ఆశ్చర్యకితుల జేసింది. అతిపెద్ద పార్టీ నాయకుడిని ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారానికి ఆహ్వానించడానికి తొలుత విముఖత చూపడం దేశవ్యాప్తంగా రాజ్యపాల వ్యవస్థపై తీవ్ర చర్చను రేకెత్తించింది.**

గవర్నర్ తమిళనాడు లోక్‌భవన్‌లో విజయ్‌తో సమావేశమై, "అసెంబ్లీలో ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ మద్దతు నిరూపించబడలేదు" అని పేర్కొన్నారు. అంటే, ప్రమాణస్వీకారం ముందే 118 మంది ఎమ్మెల్యేల లేఖలు తీసుకు రమ్మని పరోక్షంగా కోరడం. ఇది రాజ్యాంగ నిపుణులు తీవ్రంగా ప్రశ్నించిన అంశం. సర్వోన్నత న్యాయస్థానం గోవా 2017, కర్ణాటక 2018 తీర్పులలో స్పష్టం చేసిన అంశాలు గుర్తుకొస్తున్నాయి. అతిపెద్ద ఏకైక పార్టీని ఆహ్వానించి, ప్రమాణస్వీకారం తర్వాత వీలైనంత త్వరగా ఫ్లోర్ టెస్ట్ నిర్వహించడమే రాజ్యాంగ సమ్మతమైన మార్గం. మెజారిటీని నిరూపించే వేదిక అసెంబ్లీ సభాభవనం మాత్రమే. రాజ్ భవన్ కాదు. అయినా గవర్నర్ ఆహ్వానం పంపడంలో చేసిన ఆలస్యం "మెజారిటీని రాజ్‌భవన్‌లో నిర్ధారించా లని" అనే విలోమ వైఖరిగా రాజ్యాంగ పరిశీలకులు అభివర్ణించారు.

భారత రాజకీయ చరిత్రలో హంగ్ అసెంబ్లీ ఏర్పడినప్పుడు గవర్నర్లు ఎలా వ్యవహరించారో చూస్తే పాఠాలు స్పష్టంగా కనిపిస్తాయి. గోవా 2017 ఎన్నికలలో కాంగ్రెస్ 40 స్థానాల అసెంబ్లీలో 17 స్థానాలు నెగ్గి అతిపెద్ద పార్టీగా నిలిచింది. బీజేపీ 13 స్థానాలకే పరిమితమైంది. అయినా కాంగ్రెస్ క్లెయిమ్ దాఖలు చేయకముందే బీజేపీ 21 మందితో పోస్ట్-పోల్ కూటమి నిర్మించి గవర్నర్‌ను కలిసింది. గవర్నర్ మృదులా సిన్హా మనోహర్ పారికర్‌కు ప్రభుత్వ ఏర్పాటు ఆహ్వానం పంపారు. సుప్రీంకోర్టు ప్రమాణస్వీకారాన్ని నిలిపివేయడానికి నిరాకరించి వెంటనే ఫ్లోర్ టెస్ట్ నిర్వహించాలని ఆదేశించింది. కర్ణాటక (2018)లో బీజేపీ 104 స్థానాలు నెగ్గి అతిపెద్ద పార్టీగా నిలిచి.. గవర్నర్ యడ్యూరప్పను ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించారు. ఆయన ఫ్లోర్ టెస్ట్‌లో మెజారిటీ నిరూపించలేక రాజీనామా చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్-జేడీ(ఎస్) సంకీర్ణం అధికారంలోకి వచ్చింది. బీహార్ 2005లో గవర్నర్ బూటా సింగ్ ఏ నేతనూ ఆహ్వానించకుండానే అసెంబ్లీని రద్దు చేయించారు. అసెంబ్లీ సమావేశమవ్వకముందే రద్దు చేయడం సుప్రీంకోర్టు 2006లో రాజ్యాంగవిరుద్ధమని ప్రకటించింది. మహారాష్ట్ర (2019)లో ఫడ్నవీస్-అజిత్ పవార్ ప్రభుత్వం తెల్లవారుజామున ప్రమాణస్వీకారం చేసింది. సుప్రీంకోర్టు జోక్యంతో రెండు రోజులకే ఫ్లోర్ టెస్ట్ నిర్వహించాల్సి వచ్చింది. ప్రభుత్వం కూలిపోయింది.

**ఇప్పుడు టీవీకే 108 స్థానాలు, కాంగ్రెస్ మద్దతు 5 స్థానాలు కలుపితే విజయ్ కూటమి 112కి చేరుకుంటుంది. మ్యాజిక్ ఫిగర్ 118కి ఇంకా 6 స్థానాలు దూరంగా ఉంది. డీఎంకే 59, ఏఐఏడీఎంకే 47 ఈ రెండు పార్టీలు ఒక్కతాటిపై వస్తే 106 స్థానాలు అవుతాయి. పీఎంకే (4), వామపక్షాలు (4), ఐయూఎంఎల్ (2), వీసీకే (2) జోడిస్తే 118 దాటి విజయ్‌కు అడ్డుపడే అవకాశముంది. అంటే తమిళనాడు రాజకీయ చరిత్రలో మొదటిసారి సొంత శత్రువులైన డీఎంకే-ఏఐఏడీఎంకే ఒకే వేదికపై నిలవాల్సిన అసాధారణ స్థితి. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థపై టీవీకే సృష్టించిన అసాధారణ ప్రకంపనకు నిదర్శనం.**

కమల్ హాసన్ వంటి ప్రముఖులు "ప్రజాదేశాన్ని అవమానించడం" అని బాహాటంగా విమర్శించారు. సర్కారియా కమిషన్, పుంఛి కమిషన్ నివేదికలు అన్నీ ఒకే సూత్రాన్ని చెప్పాయి. గవర్నర్ రాజ్యాంగ నిష్పాక్షిక పాలకుడిగా వ్యవహరించాలి, రాజకీ య సంరక్షకుడిగా కాదు. ప్రమాణస్వీకారం తర్వాత ఫ్లోర్ టెస్ట్.. ఇదే ప్రజాస్వామ్య ధర్మం. రాజ్‌భవన్‌ను "రాజకీయ అడ్డంకి" గా వినియో గించే ధోరణి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. తమిళనాడు ఇప్పుడు రాజకీయ సంక్షోభంలో ఉంది. కానీ ఇది కేవలం ఒక రాష్ట్ర సమస్య కాదు. గవర్నర్ వ్యవస్థ పాత్రను, రాజ్యాంగ పరిధులను దేశం మొత్తం ఒకసారి నిజాయితీగా చర్చించుకోవాల్సిన అవసరాన్ని ఈ సందర్భం స్పష్టంగా చాటుతోంది. బాలెట్ పేపర్ పలికిన తీర్పుకు నిలువెత్తు నిదర్శనంగా విజయ్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోగలి గారో లేదో, అసెంబ్లీ నేల నిర్ణయిస్తుంది, రాజ్ భవన్ కాదు..!

# గవర్నర్ రాజ్యాంగ ధర్మసంకటం



మాడభూషి శ్రీధర్
కేంద్ర సమాచార శాఖ మాజీ కమిషనర్
సామాజిక, రాజకీయ విశ్లేషకులు

**త్రిశంకు తమిళనాడు లో గందరగోళం, సంక్షోభం. తమిళనాడు రాజకీయ చరిత్రలో హంగ్ అసెంబ్లీలు దాదాపు అరుదైనవే. ద్రావిడ రాజకీయాల ఆధిపత్యం ప్రారంభమైన తరువాత తమిళనాడులో సాధారణంగా స్పష్టమైన మెజారిటీ ప్రభుత్వాలే ఏర్పడుతూ వచ్చాయి. 2026 తమిళనాడు శాసనసభ ఎన్నికల ఫలితాలు రాజ్యాంగపరంగా క్లిష్టమైన పరిస్థితిని సృష్టించాయి. 234 సభ్యుల అసెంబ్లీలో ఏ ఒక్క పార్టీ గానీ, కూటమి గానీ 118 స్థానాల మెజారిటీని అందుకోలేకపోవడం రాష్ట్రాన్ని అరాచకానికి (అంటే సరైన రాజులేని రాజకీయాలా అని) దారి తీస్తున్నదా? ఈ పరిస్థితిలో మూడు శక్తులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఒకవైపు గవర్నర్, మరోవైపు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్న రాజకీయ పార్టీలు, మూడోవైపు సుప్రీంకోర్టు తీర్పులు, సర్కారియా కమిషన్, పుంఛి కమిషన్ సూచనల ద్వారా ఏర్పడిన రాజ్యాంగ సంప్రదాయాలు. ఇవన్నీ కలిసి ఇప్పుడు తమిళనాడు రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే స్థితికి వచ్చాయి.**




ఇదే సమయంలో నటుడు, రాజకీయ నాయకుడు విజయ్ నేతృత్వం లోని తమిళగ వెట్రి కజగం (టీవీకే) అతిపెద్ద పార్టీగా అవతరించ డం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసింది. అయితే ఆ పార్టీకి సంపూర్ణ మెజారిటీ రాకపోవడంతో ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటు కోసం మిత్రపక్షాల అన్వేషణ, చిన్న పార్టీల ప్రాముఖ్యత, స్వతంత్ర ఎమ్మెల్యేల "కింగ్‌మేకర్" పాత్ర, ఎంఎల్యేలతో లావాదేవాలనే వ్యాపారం (హార్స్ ట్రేడింగ్) భయాలు చర్చనీయాంశాలయ్యాయి.

తమిళనాడు అసెంబ్లీలో మొత్తం 234 స్థానాలు ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే కనీసం 118 మంది సభ్యుల మద్దతు అవసరం. అయితే రాజకీయ గణితం ఇక్కడ ఒక ప్రత్యేకమైన మలుపు తీసుకుంది. విజయ్ రెండు నియోజకవర్గాలైన పెరంబూర్, తిరుచిరాపల్లి (ఈస్ట్) నుంచి గెలిచాడు. ఒక వ్యక్తి రెండు స్థానాలను కొనసాగించలేడు కాబట్టి ఒక స్థానాన్ని ఖాళీ చేయాల్సి ఉంటుంది. అందువల్ల టీవీకే అసలు బలం 107 అయినప్పటికీ, కార్యరూపంలో అది 106కు తగ్గుతుంది. పైగా వారిలో ఒకరు స్పీకర్‌గా ఎన్నికైతే, స్పీకర్ సాధారణ పరిస్థితుల్లో ఓటు వేయరు; సమాన ఓట్లు వచ్చినప్పుడు మాత్రమే నిర్ణయాత్మక ఓటు వేస్తారు. ఈ పరిస్థితిలో విశ్వాస పరీక్ష సమయంలో సభలో క్రియాశీల ఓట్ల సంఖ్య 232కి తగ్గే అవకాశం ఉంది. అప్పుడు మెజారిటీ సంఖ్య 117 అవుతుంది. అంటే టీవీకే ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే మరో 11 మంది ఎమ్మెల్యేల మద్దతు తప్పనిసరి అవుతుంది. ఇక్కడి నుంచే రాజకీయ చర్చలు, సంకీర్ణ సమీకరణాలు, రాజ్యాంగ ధర్మం అన్నీ కీలక పాత్ర పోషించబోతున్నాయి.

భారత రాజ్యాంగం హంగ్ అసెంబ్లీ పరిస్థితిలో గవర్నర్ ఏ విధమైన విధానం అనుసరించాలనే విషయాన్ని స్పష్టంగా చెప్పలేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 164 ప్రకారం ముఖ్యమంత్రిని గవర్నర్ నియమిస్తారని మాత్రమే ఉంది. అందువల్ల స్పష్టమైన మెజారిటీ లేని సందర్భాల్లో గవర్నర్ రాజ్యాంగ సంప్రదాయాలు, సుప్రీంకోర్టు తీర్పులు, సర్కారియా కమిషన్ సూచనలు, పుంఛి కమిషన్ మార్గదర్శకాలు, "రాజ్యాంగ నైతికత" అనే భావనల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది.

ఇదే అంశం భారత రాజకీయ చరిత్రలో అనేక వివాదాలకు దారితీసింది. కాంగ్రెస్ పాలనలో నియమితులైన గవర్నర్లు అయినా, బీజేపీ పాలనలో నియమితులైన గవర్నర్లు అయినా చాలాసార్లు రాజకీయ పక్షపాతం ప్రదర్శించారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఏ పార్టీకి మొదటి అవకాశం ఇవ్వాలి? ఎవరికి ఎంత సమయం ఇవ్వాలి? ఎవరిని పిలవకుండా వదిలేయాలి? వంటి అంశాలు పదే పదే రాజ్యాంగ సంక్షోభాలకు కారణమయ్యాయి. అందువల్ల తమిళ నాడు పరిస్థితి కేవలం రాజకీయ సమస్య మాత్రమే కాదు; ఇది ఒక తేల్చలేని రాజ్యాంగ పరీక్ష.

గవర్నర్ ముందు ఒక సవాల్ ఇది. అత్యంత క్లిష్టమైన పరీక్ష. ఆయన వ్యక్తిగత రాజకీయ అభిరుచుల ఆధారంగా ముఖ్యమంత్రిని ఎన్నుకు నే అధికారం లేదు. గవర్నర్ రాజ్యాంగపరంగా తటస్థంగా వ్యవహ రించాలి. సుప్రీంకోర్టు పునరుద్ఘాటించిన ప్రధాన సూత్రం ఏమిటంటే ప్రభుత్వ మెజారిటీని గవర్నర్ అంచనా వేయకూడదు; అది శాసనసభా వేదిక మీదే అసెంబ్లీ ఫ్లోర్‌పైనే నిరూపించాలి. అంటే విజయ్ గానీ, ఇతర కూటములు గానీ చేసిన మెజారిటీ వాదన చివరకు శాసనసభలో విశ్వాస పరీక్ష ద్వారానే నిర్ణయించాలి.

1983లో ఏర్పడిన సర్కారియా కమిషన్ హంగ్ అసెంబ్లీ పరిస్థితుల్లో గవర్నర్ అనుసరించాల్సిన ఒక ప్రాధాన్యత క్రమాన్ని సూచించింది. ముందుగా స్పష్టమైన మెజారిటీ గల ఎన్నికల ముందు కూటమికి అవకాశం ఇవ్వాలి. అది లేకపోతే ఇతరుల మద్దతుతో అతిపెద్ద పార్టీకి అవకాశం ఇవ్వాలి. తరువాత ప్రభుత్వంలో భాగస్వామ్యమ య్యే ఎన్నికల తర్వాత కూటమిని పరిగణించాలి. చివరిగా బయట మద్దతుతో ఏర్పడే కూటమిని ఆలోచించాలి. తమిళనాడులో ప్రస్తుతం స్పష్టమైన ప్రీ-పోల్ కూటమి లేకపోవడంతో, ఇప్పుడు దృష్టి టీవీకేకు మొదటి అవకాశం ఇవ్వాలా? లేక ఎన్నికల తర్వాత ఏర్పడే మరో కూటమిని పరిగణించాలా? అనే అంశంపై కేంద్రీకృతమైంది.

2010లో వచ్చిన పూంచ్ కమిషన్ సర్కారియా కమిషన్ సిఫారసు లను స్థూలంగా సమర్థిస్తూ మరో రెండు ముఖ్య అంశాలను జోడించింది. గవర్నర్ పూర్తిగా రాజ్యాంగ తటస్థతతో వ్యవహరించా లి. అదేవిధంగా మెజారిటీ పరీక్షను వీలైనంత త్వరగా నిర్వహించా లి. ఆలస్యం జరిగితే ఎమ్మెల్యేల కొనుగోలు, రాజకీయ ఒత్తిళ్లు, పార్టీ మార్పులు పెరిగే ప్రమాదం ఉంటుందని కమిషన్ హెచ్చరించింది.

### మూడు రాష్ట్రాలలో కఠినమైన అనుభవం

ఈ నేపథ్యంలో మణిపూర్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల అనుభవా లు తమిళనాడుకు ముఖ్యమైన హెచ్చరికలుగా నిలుస్తున్నాయి. 2017 మణిపూర్‌లో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా వచ్చినప్పటికీ, గవర్నర్ బీజేపీ నేతృత్వంలోని ఎన్నికల తర్వాత కూటమిని అధికారంలోకి ఆహ్వానించారు. దీనిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. "అతిపెద్ద పార్టీకి మొదటి అవకాశం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్య నైతికతకు విరుద్ధం" అని అనేక న్యాయ నిపుణులు వ్యాఖ్యానించారు. అసమంజసం.

2018 కర్ణాటకలో మరో సమస్య తలెత్తింది. గవర్నర్ బీజేపీకి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు 15 రోజుల సమయం ఇచ్చారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఆ గడువును 24 గంటలకు కుదిం చింది. ఎందుకంటే ఎక్కువ సమయం ఇస్తే ఎమ్మెల్యేల కొనుగోలు జరిగే ప్రమాదం ఉందని కోర్టు భావించింది. సమంజసమే చివరకు విశ్వాస పరీక్షలో ప్రభుత్వం కూలిపోయింది. ఈ ఘటన గవర్నర్‌లు ఎక్కువ గడువు ఇవ్వకూడదనే సూత్రాన్ని బలపరిచింది.

2019 మహారాష్ట్రలో అయితే తెల్లవారుజా మునే రాష్ట్రపతి పాలన ఎత్తివేసి, గోప్యంగా ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయించడం భారత రాజకీయ చరిత్రలోనే అత్యంత వివాదాస్పద ఘటనగా నిలిచింది. రాజకీయంగా దారుణం కాకుండా పోతుందా. సుప్రీం కోర్టు వెంటనే ఫ్లోర్ టెస్ట్ ఆదేశించింది. ఈ సంఘటన ఒక స్పష్టమైన సూత్రాన్ని గుర్తుచేసింది - మెజారిటీని (ఇంతకుముందు రాజ్) లోక్ భవన్‌లో కాదు, శాసన సభలోనే నిరూపించాలి. ఎన్టీఆర్ ను పదవిని దింపిన నాదెండ్ల భాస్కరరావు సంఘటన గుర్తుంచుకోవాలి.

ఎస్ఆర్ బొమ్మై వి యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పు భారత సమాఖ్య వ్యవస్థకు మూలస్థంభంగా నిలిచింది. ప్రభుత్వం మెజారిటీ అసెంబ్లీ ఫ్లోర్‌పైనే పరీక్షించాలనీ, గవర్నర్ వ్యక్తిగత అంచనాలు రాజ్యాంగపరంగా సరిపోవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలాగే ఆర్టికల్ 356ను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించరా దని హెచ్చరించింది.

అదేవిధంగా రామేశ్వర్ ప్రసాద్ వి యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో బీహార్ అసెంబ్లీ రద్దుపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు మరో ముఖ్యమైన అంశాన్ని చెప్పింది. ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశాన్ని రాజకీయ పార్టీలకు పూర్తిగా ఇవ్వకముందే అసెంబ్లీని రద్దు చేయరాదని పేర్కొంది. అందువల్ల తమిళనాడులో రాష్ట్రపతి పాలన చివరి మార్గంగా మాత్రమే పరిగణించాలి.

ఇక పార్టీ మార్పిడి నిరోధక చట్టం కూడా ఈ సంక్షోభంలో కీలక పాత్ర పోషిస్తుంది. పదో షెడ్యూల్‌లోని ఈ చట్టం ఎమ్మెల్యేలు స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మారకుండా నిరోధిస్తుంది. అయితే ఒక మినహాయింపు ఉంది. ఒక పార్టీకి చెందిన కనీసం మూడింట రెండొంతుల మంది సభ్యులు మరో పార్టీలో విలీనమైతే అనర్హత వర్తించకపోవచ్చు. ఉదాహరణకు ఏఐఏడీఎంకేకి 47 మంది ఎమ్మెల్యేలు ఉంటే, కనీసం 32 మంది కలిసి వెళ్లాలి. ఇది రాజకీయంగా అంత సులభం కాదు. అందువల్ల చిన్న పార్టీలు, స్వతంత్ర సభ్యులు, అంశాల ఆధారిత మద్దతు మరింత ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉంది.

తమిళనాడుకు ముందున్న అసలు ప్రశ్న "ముఖ్యమంత్రి ఎవరు?" అన్నది మాత్రమే కాదు. ప్రజాస్వామ్య నైతికత గెలుస్తుందా? లేక రాజకీయ అవకాశవాదం గెలుస్తుందా? అన్నది మరింత పెద్ద ప్రశ్న. హంగ్ అసెంబ్లీ పరిస్థితి గవర్నర్ నిష్పాక్షకత, తటస్థతను, ఎమ్మెల్యేల నైతికతను, పార్టీ మార్పిడి నిరోధక చట్టం బలాన్ని, సంకీర్ణ రాజకీయాల పరిపక్వతను, రాజ్యాంగ సంప్రదాయాల స్థైర్యాన్ని పరీక్షిస్తుంది.

ఇప్పుడు గవర్నర్ ముందున్న ఎంపికలు కూడా పరిమితమే. టీవీకే తగిన మద్దతు చూపగలిగితే అతిపెద్ద పార్టీగా ఆహ్వానించవచ్చు. ఇతర పార్టీల మద్దతు లేఖలు కోరవచ్చు. ప్రమాణ స్వీకారం అనంతరం 24 నుంచి 48 గంటల్లో విశ్వాస పరీక్ష నిర్వహించమని ఆదేశించవచ్చు. లేదా మరింత స్థిరమైన మెజారిటీని చూపగల మరో కూటమిని పరిశీలించవచ్చు. ఇవన్నీ విఫలమైన తరువాత మాత్రమే ఆర్టికల్ 356 కింద రాష్ట్రపతి పాలనను సిఫారసు చేయడం రాజ్యాంగపరంగా సముచితం అవుతుంది.

తమిళనాడు ఇప్పుడు కేవలం రాజకీయ మార్పు దశలో లేదు. ఇది భారత సమాఖ్య రాజ్యాంగ వ్యవస్థకు ఒక గంభీరమైన పరీక్షా సమయం. ఈ సంక్షోభానికి తుది సమాధానం రాజ్‌భవన్‌లో కాదు; అసెంబ్లీ ఫ్లోర్‌పైనే తేలాలి. అదే ప్రజాస్వామ్యానికి అసలు గౌరవం.

## ఇష్టారాజ్యం!



ఎవరోవస్తారని
ఏదో చేస్తారని
ఎదురుచూసి
మోసపోకుమా!

మహాకవి సందేశం!
మనం విన్నాం
ఎదురుచూస్తూనే ఉన్నాం
మోసపోతూనే ఉన్నాం!

ఇప్పుడేం చెయ్యాలి?
మనకోసం మనమే
ఏదో ఒకటి చెయ్యాలి!
న్యాయం జరిగేదప్పుడే!

ఇంతకీమనల్ని
మోసం చేసేది ఎవరు?
నాయకులా?తప్పుతప్పు
మనంఓట్లేసిగెలిపించాం!

అధికారులాతప్పుతప్పు
మనమేతీసుకెళ్లి
లంచాలిస్తున్నాం!
వాళ్లు ఏం చేస్తారు!

దేవుళ్ళా? తప్పుతప్పు
విగ్రహ పుష్టి
నైవేద్యం నష్టి
అలా అనుకోవద్దు!

మనల్నిమనమేమోసం
చేసుకుంటున్నాం!
ఐకమత్యం లోపం
కులాలుగా విడిపోయాం!

విడదీసింది ఎవరు?
రోజూ పాడే పాటే!
రోజూ చెప్పే పాఠమే!
మ(ను)త విషప్రయోగం!
మనం బానిసలం!
గానుగలం, పీనుగులం!
'హిందూ' అంటూనే
దూరంగా నెట్టేసారు!
పాము తనపిల్లల్ని
తానేతినేస్తుంది!
మనవాళ్లే మనల్ని
అస్పృశ్యుల్నిచేసారు!

ఎవరినో అనుకోవద్దు
మోసంచేసింది ఎవరో
బయటివారు కాదు!
"మనల్ని మనమే"!

'ఓటు'అమ్ముకుంటాం!
'మందు'కులొంగిపోతాం!
మనల్నిమనమే
చంపుకుంటాం కూడా!

అన్యాయంకాదంటే
న్యాయంకూడాకాదు!
దిక్కులేనిపక్షుల్లా
అలా గాలికి వదిలేసారు!

సూద్రులం కదా!
పాదాలనుండి పుట్టాం!
మనల్ని ఫుట్-బాల్
ఆడుకుంటారు!

ఈ'ఆట'కొనసాగుతోంది!
ఆపేవాళ్లెవరు?
అంబేద్కర్ లేడు!
ఇష్టారాజ్యం ఐపోయింది!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# మూసీ పునరుజ్జీవనం

## నిర్వాసితుల కళ్లలో వెలుగులు నింపాలి

**నిర్వాసితులను 'నిర్మాతలు'గా మార్చే భాగస్వామ్య నమూనా**

హైదరాబాద్ నగరం నడిబొడ్డున ప్రవహించే మూసీ నదికి పూర్వ వైభవం తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన "మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్ మెంట్" ప్రాజెక్టును చేపట్టింది. సుమారు 55 కిలోమీటర్ల మేర సాగే ఈ ప్రాజెక్టు నగరాన్ని ఆర్థిక మరియు పర్యాటక కేంద్రంగా మార్చనుంది. అయితే, ఈ అభివృద్ధి ప్రక్రియలో నది తీరంలోని వేలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు తమ గూడును కోల్పోతున్నారు. వీరికి కేవలం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చి పంపివేయడం కాకుండా, పూణే మరియు అమరావతి తరహాలో అభివృద్ధిలో 'భాగస్వాములను' చేయడమే అసలైన సామాజిక న్యాయం.

**1. మూసీ ప్రాజెక్టు: గణాంకాలు మరియు నిర్వాసితుల వ్యథ ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ ప్రాజెక్టు భారీ వ్యయంతో కూడుకున్నది:**

మొత్తం వ్యయం: ఐదేళ్ల కాలంలో సుమారు రూ.1.5 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

**తొలి దశ:** ఉస్మాన్ సాగర్ నుండి గౌరెల్లి వరకు 21 కి.మీ. మేర అభివృద్ధి పనుల కోసం రూ.6,500 నుండి రూ.7,000 కోట్లుకేటాయించారు.

**నిర్వాసితులు:** సర్వేల ప్రకారం నదీ పరివాహక ప్రాంతంలో సుమారు 10,000 నుండి 15,000 కుటుంబాలు ప్రభావిత మవుతున్నాయి. ఇప్పటికే 15,000 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వీరికి కేటాయించినట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**2. పూణే - మగర్పట్టా నమూనా: ఒక స్ఫూర్తి మహారాష్ట్రలోని పూణేలో మగర్పట్టా సిటీ కోసం 120 మంది రైతులు తమ భూములను ప్రభుత్వానికి అప్పగించకుండా, ఒక 'కంపెనీ'గా ఏర్పడి భాగస్వాములయ్యారు.**

**ప్రయోజనం:** అక్కడ భూమిని ఇచ్చిన వారు నేడు ఆ కంపెనీ డైరెక్టర్లుగా, వాటాదారులుగా కోట్లాది రూపాయల లాభాలను పొందుతున్నారు.

**మూసీలో అన్వయం:** మూసీ తీరంలో దశాబ్దాలుగా నివసిస్తు న్న ప్రజలకు కేవలం ఇళ్లు ఇచ్చి నగర శివారులకు పంపే బదులు, రివర్‌ఫ్రంట్ వెంట నిర్మించే షాపింగ్ మాల్స్, ఐటీ టవర్లు, మరియు పర్యాటక కేంద్రాలలో వారికి నిర్దిష్టమైన వాటాను (Commercial Stakes) కల్పించాలి.

**3. అమరావతి - భూ సమీకరణ (Land Pooling) నమూనా**

అమరావతి రాజధాని కోసం రైతులు తమ భూములను ప్రభుత్వానికి ఇచ్చి, అభివృద్ధి చెందిన రాజధానిలో వాటాను పొందారు.

**వార్షిక కౌలు:** ప్లాట్లు అభివృద్ధి అయ్యే వరకు ప్రభుత్వం ఏటా కౌలు చెల్లించింది.



**మూసీ ప్రతిపాదన:** మూసీ నిర్వాసితులకు కూడా వారు కోల్పోయిన స్థలానికి బదులుగా, అభివృద్ధి చెందిన రివర్ ఫ్రంట్ జోన్‌లో వాణిజ్య స్థలాన్ని (Commercial Plot) తిరిగి కేటాయించాలి. దీనివల్ల నది అందంగా మారిన తర్వాత పెరిగే భూమి విలువలో లబ్ధి నేరుగా పేద ప్రజలకు చేరుతుంది.

**4. అభివృద్ధిలో భాగస్వామ్యం - బలమైన కారణాలు ఆర్థిక భద్రత: ఒక్కసారి నగదు లేదా ఇల్లు ఇస్తే అది ఒక తరంతో ముగిసిపోతుంది. అదే ప్రాజెక్టు లాభాల్లో భాగస్వామ్యం ఉంటే వారి పిల్లల భవిష్యత్తుకు భరోసా లభిస్తుంది.**

**వలసల నివారణ:** నగర నడిబొడ్డున ఉన్న తమ ఉపాధిని వదులుకొని దూరంగా వెళ్లడం వల్ల పేదలు మరింత పేదలుగా మారుతున్నారు. అదే ప్రాంతంలో భాగస్వామ్యం ఉంటే వారి జీవనోపాధికి ఆటంకం కలగదు.

**నిర్మాణ వ్యయం - పరిహారం:** ప్రాజెక్టు కోసం చేస్తున్న రూ.1.5 లక్షల కోట్లలో కేవలం కొంత శాతం నిధులను "కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ" (CSR) కింద కాకుండా, నేరుగా బాధితుల వ్యాపార పెట్టుబడిగా మలచాలి.

మూసీ నది ప్రక్షాళన హైదరాబాద్‌కు అత్యంత అవసరం. కానీ ఈ అభివృద్ధి ప్రజల కన్నీళ్లపై కాకుండా వారి చిరునవ్వులపై నిర్మించబడాలి. అమరావతి మరియు పూణే నమూనాలు అభివృద్ధిలో ప్రజలను ఎలా భాగస్వాములను చేయవచ్చో నిరూపించాయి. మూసీ ప్రాజెక్టులోనూ ఇదే విధానాన్ని అనుసరించి, నది పక్కన ఉన్న బస్తీల ప్రజలను 'నయా హైదరాబాద్' యజమానులుగా మార్చినప్పుడే అది నిజమైన ప్రగతి అనిపించుకుంటుంది.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# తరాల్ని కలిపిన స్వరం..!



ఆకాశవాణి భారతదేశపు ప్రముఖ ప్రజా రేడియో ప్రసార సంస్థ. ఇది దేశంలోని కోట్లాది ప్రజలకు వార్తలు, విద్య, వినోదం మరియు సాంస్కృతిక కార్యక్రమాలను అందిస్తూ విశిష్ట సేవలు అందిస్తోంది.గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాల వరకు ప్రజలను సమాచారంతో అనుసంధానించే ప్రధాన మాధ్యమంగా ఆకాశవాణి నిలిచింది. భారత ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించిన ఆకాశవాణి తన ప్రసార ప్రయాణంలో 90 సంవత్సరాల మైలురాయిని చేరుకుంది. 1936లో "ఆల్ ఇండియా రేడియో"గా ప్రారంభమైన ఈ సంస్థ తరువాత "ఆకాశవాణి"గా ప్రజల్లో ప్రసిద్ధి చెందింది. తొమ్మిది దశాబ్దాలుగా వార్తలు, విద్య, సంస్కృతి, సంగీతం, వినోదం వంటి అనేక రంగాల్లో ప్రజలకు సేవలందిస్తోంది.ఆకాశవాణి ప్రారంభం భారతదేశంలో రేడియో ప్రసారాల ఆవిర్భావంతో జరిగింది."ఆల్ ఇండియా రేడియో" పేరుతో ప్రారంభమైన ఈ సంస్థకు తరువాత "ఆకాశవాణి" అనే తెలుగు-సంస్కృత పదాన్ని అధికారికంగా ఉపయోగించారు. "ఆకాశం ద్వారా వినిపించే వాణి" అనే అర్థాన్ని ఈ పేరు సూచిస్తుంది.ఆకాశవాణి ద్వారా ప్రతిరోజూ జాతీయ, ప్రాంతీయ వార్తలు ప్రసారం చేయబడతాయి.రైతుల కోసం వ్యవసాయ సలహాలు,విద్యార్థుల కోసం విద్యా కార్యక్రమాలు,మహిళలు మరియు యువత కోసం ప్రత్యేక ప్రసారాలు నిర్వహించబడ తాయి. సంగీతం, నాటకాలు, జానపద కళలు, భక్తి కార్యక్రమాలు వంటి అనేక సాంస్కృతిక అంశాలను ప్రజలకు చేరవేస్తుంది.స్వాతంత్ర్య సమర కాలంలో దేశభక్తిని పెంపొందించడంలో ఆకాశవాణి ముఖ్య పాత్ర పోషించింది. ప్రకృతి విపత్తులు, అత్యవసర పరిస్థితుల సమయంలో ప్రజలకు సరైన సమాచారాన్ని వేగంగా అందించడంలో కూడా ఇది ఎంతో ఉపయోగపడుతోంది.నేటి డిజిటల్ యుగంలో కూడా ఆకాశవాణి తన ప్రాధాన్యతను కోల్పోలేదు. ఎఫ్.ఎం. ప్రసారాలు, మొబైల్ యాప్‌లు మరియు ఆన్‌లైన్ సేవల ద్వారా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ప్రజలకు చేరువవుతోంది.భారతదేశంలో ప్రస్తుతం ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాల్లో అనేక రేడియో స్టేషన్లు పనిచేస్తున్నాయి.ప్రభుత్వ రేడియో స్టేషన్లు ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రధానంగా ఆకాశవాణి పనిచేస్తోంది.దీనిలో ఆకాశవాణి మధ్య తరంగం ,ఎఫ్.ఎం.రెయిన్‌బో,ఎఫ్.ఎం. గోల్డ్,వివిధ ప్రాంతీయ కేంద్రాలు దేశవ్యాప్తంగా వందలాది ప్రసార కేంద్రాలు ఉన్నాయి. వార్తలు, విద్య, వ్యవసాయం, సంగీతం, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రసారం చేస్తుంటాయి.ప్రైవేట్ రేడియో స్టేషన్లు భారతదేశంలో అనేక ప్రైవేట్ ఎఫ్.ఎం. ఛానెల్లు కూడా ఉన్నాయి. వాటిలో కొన్ని ప్రముఖమైనవి రేడియో మిర్చి, రెడ్ ఎఫ్ ఎం,ఈ ఎఫ్ ఎం,బిగ్ ఎఫ్ ఎం,రేడియో సిటీ,ఫీవర్ ఎఫ్ ఎం.ఇవి ప్రధానంగా వినోద కార్యక్రమాలు,పాటలు,యువతకు సంబంధించిన షోలు, ట్రాఫిక్ మరియు స్థానిక సమాచారాన్ని అందిస్తాయి.ఇవే కాక కమ్యూనిటీ రేడియోలు, పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే కమ్యూనిటీ రేడియో స్టేషన్లు కూడా ఉన్నాయి.ఇవి స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహిస్తాయి.అలాగే ప్రస్తుత పరిస్థితులలో ఆకాశవాణి యూట్యూబ్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్‌లో సైతం తన కార్యక్రమాలను ప్రచారం చేస్తూ,న్యూస్ ఆన్ ఎయిర్ యాప్ ల ద్వారా కార్యక్రమంలను అందిస్తుంది.ప్రైవేటు ఎఫ్ ఎం లు సైతం వివిధ యాప్ ద్వారా ప్రచారం చేస్తున్నాయి.మొత్తానికి, రేడియో రంగం నేటికీ ప్రజలకు సమాచారం, వినోదం, విద్య అందించే శక్తివంతమైన మాధ్యమంగా కొనసాగుతోంది. మొత్తానికి, ఆకాశవాణి భారతీయ సంస్కృతి, భాషలు మరియు సంప్రదాయాలను కాపాడుతూ ప్రజలకు జ్ఞానం మరియు వినోదాన్ని అందిస్తున్న గొప్ప ప్రసార మాధ్యమం.దేశ అభివృద్ధిలో దీని పాత్ర చిరస్మరణీయమైనది.



డాక్టర్ మోటె చిరంజీవి,
క్యాజువల్ అనౌన్సర్,
ఆకాశవాణి వరంగల్ కేంద్రం.
సెల్ : 9949194327.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే వేతనాలు నిలిపివేస్తాం

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్ అర్బన్, మే 7 (జనం సాక్షి) :** ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) సన్నాహక ప్రక్రియను ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో పక్కాగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఎస్.ఐ.ఆర్ మ్యాపింగ్ అమలు తీరు,పై కలెక్టర్ గురువారం నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో ఏ.ఈ.ఆర్.ఓలు, బీ.ఎల్.ఓ సూపర్వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఒక్కో పోలింగ్ కేంద్రం వారీగా ఎస్.ఐ.ఆర్ మ్యాపింగ్ అమలును పరిశీలిస్తూ, పనితీరులో వెనుకంజలో ఉన్న ఏ.ఈ.ఆర్.ఓలు, బీ.ఎల్.ఓ సూపర్వైజర్లను కారణాలు అడిగి తెలుసుకున్నారు. అర్బన్ లో మ్యాపింగ్ ప్రక్రియ మందకొడిగా సాగడం వల్ల నిజామాబాద్ జిల్లా సగటుపై ఇది ప్రభావం చూపుతోందని అన్నారు. ఎస్.ఐ.ఆర్ అమలులో స్పష్టమైన ప్రగతి సాధించాల్సిందేనని స్పష్టం చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రం వారీగా బీఎల్ఓలతో మ్యాపింగ్ ను పక్కాగా జరిపించాలని, రోజువారీగా నిశిత పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు.



ఎస్.ఐ.ఆర్ సన్నాహక ప్రక్రియ అమలులో పురోగతిపై తాను వారం రోజుల తర్వాత మళ్ళీ సమీక్ష నిర్వహిస్తానని అన్నారు. స్పష్టమైన పురోగతి కనిపించాలని, ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, వారి వేతనాలు నిలిపివేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పనితీరు సక్రమంగా లేని ఇద్దరు ఆర్.పీలకు షోకాజ్ నోటీసులు అందించి విధుల నుండి తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తన అనుమతి లేకుండా బీఎల్ఓల మార్పులు, చేర్పులు చేయకూడదని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో బోగస్ ఓటర్లు, చనిపోయిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు ఉండరాదని, అదే సమయంలో అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుండి తప్పిపోకూడదని అన్నారు.ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతోనే ప్రత్యేక సమగ్ర సవరణను ఎన్నికల సంఘం చేపట్టిందని అన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకునేలా చూడాలని, మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి కోసం వారి సహకారం తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక సమరణ ప్రక్రియ చేపట్టడం వల్ల ఓటరు జాబితాలో నిజమైన ఓటరు ఖచ్చితంగా ఉంటారని తెలిపారు. డూప్లికేట్ ఓటర్లతో పాటు మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిపోయిన, రెండు ఓట్లు ఉన్నవాళ్ల ఓట్లు మాత్రమే తొలగిస్తారని తెలిపారు. ఎవరూ అపోహకు గురి కావద్దని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ తరువాత ఎవరైనా ఓటు హక్కు రాని వారు ఉంటే ఆక్షేపణ చేయవచ్చని అన్నారు. సమీక్షలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్, నిజామాబాద్ సౌత్ తహసీల్దార్ శ్రీధర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## క్షణికావేశాలతో నేరాలకు పాల్పడితే కఠినమైన జైలు శిక్షలు తప్పవు

● సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్



**కోదాడ టౌన్, మే 7 (జనంసాక్షి) :** కోదాడ పట్టణంలో బస్టాండ్ ఎదురుగా జరిగిన మహిళ హత్యకు సంబంధించి ఘటన స్థలాన్ని గురువారం డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి స్థానిక ఇన్స్పెక్టర్ శివశంకర్ పోలీస్ అధికారులతో కలిసి ఎస్పీ నరసింహ ఐపీఎస్ పరిశీలించారు.సంఘటన జరిగిన చోట దుకాణదారులను ఆరా తీసి సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, రిమాండ్ కు తరలించాలని తెలిపారు.జైలు శిక్ష పడేలా దర్యాప్తు చేసి సాక్షులను బాధితులను విచారించి నేరాభియోగ పత్రాలను కోర్టుకు దాఖలు చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమస్యలు ఉంటే సమరయస్యంగా పరిష్కరించు కోవాలని క్షణికావేశంతో తప్పులు చేసిన వివాదాలకు పాల్పడిన నేరాలు చేసిన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. చట్టాలు బలోపేతం చేయబడ్డాయని, కేసుల్లో సాంకేతికతతో వేగవంతమైన దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.ఈ సంఘటనకు సంబంధించి వేగంగా దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.ఇలాంటి సంఘటనలకు పాల్పడేవారు ఎంతటి వారైనా పోలీస్ శాఖ ఉపేక్షించమని చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డిఎస్పి శ్రీనివాసరెడ్డి, పట్టణ ఇన్స్పెక్టర్ శివశంకర్,ఎస్సై సుధీర్ మరియు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఆధునిక వ్యవసాయ పద్ధతులకు అలవాటు పడాలి

● జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి ప్రతినిధి, మే 7 (జనం సాక్షి) :** ప్రస్తుత మారుతున్న వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులకు అలవాటు పడాలని అలాగే రైతులు డిమాండ్ ఉన్న లాభదాయకమైన పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ రైతులకు సూచించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 4 నుంచి నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రం సమీపంలోని పోతిరెడ్డిపల్లి రైతు వేదికలో వ్యవసాయ, విద్యుత్, రెడ్‌కో శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రైతులు తమ భూములకు అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకుని సాగు చేస్తే అధిక దిగుబడులతో పాటు మెరుగైన లాభాలు పొందవచ్చన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మార్కెట్ అవసరాలు, కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై రైతులు అవగాహన పెంపొందించుకుని పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయం చేయాలని సూచించారు. వ్యవసాయంలో పంటల సాగుతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తులపై కూడా రైతులు దృష్టి పెట్టాలని చెప్పారు. వ్యవసాయంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా పీఎం కుసుమ్ కాంపోనెంట్ పథకం కింద సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని రైతులు నిరంతర ఆదాయం పొందేలా ముందుకు రావాలని సూచించారు. సహజ వనరులను సమర్థంగా వినియోగించుకునే దిశగా రైతులు అడుగులు వేయాలన్నారు.అదేవిధంగా ఆయిల్ పామ్ సాగు మంచి లాభదాయకమైన పంట అని, భూమి, బోరు సౌకర్యం ఉంటే సరిపోతుందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం 90 శాతం వరకు సబ్సిడీ అందిస్తున్నందున రైతులు ఈ పంట సాగుపై దృష్టి సారించాలని కోరారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా పలు వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. వ్యవసాయానికి సంబంధించి రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్, రెడ్‌కో, వ్యవసాయ శాఖ అధికారులు, ఏవోలు, ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

**నిజామాబాద్ అర్బన్, మే 7 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా టాస్క్ సౌజన్యంతో జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీరామ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. నిజామాబాద్, కామారెడ్డి లతో కూడిన ఉమ్మడి జిల్లా నుండి పెద్ద సంఖ్యలో యువత జాబ్ మేళాకు తరలివచ్చారు. 71 కంపెనీల ద్వారా సుమారు 2000 మందికి ఉద్యోగాలు కల్పించబడ్డాయని నిర్వాహకులు ప్రకటించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి తదితరులు విచ్చేసి, జాబ్ మేళాను లాంఛనంగా ప్రారంభించారు. వివిధ కంపెనీలలో ఉద్యోగాల కోసం ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందని అన్నారు. సుమారు రెండు వేల మందికి నేరుగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని, మరికొందరికి అప్రెంటిస్ షిప్ ద్వారా శిక్షణ కోసం ఎంపిక చేశారని అన్నారు. ఈ తరహా అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ, దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్రంలో నిరుద్యోగ అభ్యర్థులకు



ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని అన్నారు. అందుకు గాను స్కిల్ యూనివర్సిటీని సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిజామాబాద్ లో ఇంత పెద్ద స్థాయిలో జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇందులో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డివైఎస్ఓ పవన్ కుమార్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సురేష్ కుమార్, ఎన్ఐసీ అధికారి మధు, ఈ-డీఎం కార్తీక్, వంశీధర్ రెడ్డి, టాస్క్ అధికారులు, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఈ నెల 10 వరకు స్వీయగణనకు అవకాశం

● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, మే 7 (జనంసాక్షి) :** స్వీయ గణన చేసుకునేందుకు ఇంకా కేవలం 3 రోజులు మాత్రమే గడువు ఉందని,జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, యువత, మహిళా సంఘాలు, ఐటీ రంగ నిపుణులు, అన్ని వర్గాల వారు స్వీయగణన పాల్గొని వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రకటనలో గురువారం ఒక ప్రకటనలో కోరారు.తమ వివరాలను నమోదు చేసుకోని వారు వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు.జనగణన సంబంధించి స్వీయ గణన మే 10 వరకు అవకాశం ఉందని తెలిపారు.మొదటి దశలో భాగంగా నిర్వహించే గృహ లెక్కింపు, గృహ పరిస్థితుల లెక్కింపు కోసం ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సౌకర్యం ప్రస్తుతం అందుబాటులో ఉందన్నారు.జిల్లా ప్రజలు తమ ఇంటి, కుటుంబ వివరాలను ప్రభుత్వ అధికారిక వెబ్ పోర్టల్ ద్వారా స్వయంగా నమోదు చేసుకోవచ్చని అన్నారు. మొబైల్ ఫోన్, కంప్యూటర్, ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న ఏ పరికరం ద్వారానైనా ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చని తెలిపారు.

# అంతరాష్ట్ర సరిహద్దులో క్షుణ్ణంగా పోలీస్ తనిఖీలు



**కోదాడ, మే 7 (జనం సాక్షి) :** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్య వారధిగా ఉన్న జాతీయ రహదారి 65 పై కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రామాపురం వద్ద ఏర్పాటుచేసిన అంతరాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ గురువారం జిల్లా ఎస్పీ నరసింహ పరిశీలించారు. వరి ధాన్యం, ప్రభుత్వ పంపిణీ బియ్యం,పశువుల రవాణా, మద్యం, ఇసుక, ఇతర నిషేధిత వస్తువుల అక్రమ రవాణా నిర్మూలించడంలో భాగంగా తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ముఖ ద్వారమైన సూర్యాపేట జిల్లా రామాపురం వద్ద అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ చెక్ పోస్ట్ నందు పోలీసు సిబ్బంది రెవెన్యూ ఇతర శాఖల సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారని అక్రమ రవాణా అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలించడంలో పటిష్టంగా పనిచేస్తున్నామని ఎస్పీ తెలిపారు. చెక్ పోస్ట్ వద్ద ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి కావలసిన సదుపాయాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. చెక్ పోస్ట్ నందు విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సామాన్య ప్రజానీకానికి సామాన్య ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తనిఖీలు క్షుణ్ణంగా నిర్వహించాలని సూచించారు. రెండు రాష్ట్రాల మధ్య ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా ఈ సరిహద్దు చెక్పోస్ట్ నందు పటిష్టమైన నిగా ఉంచామని అన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో పండిన వరి ధాన్యాన్ని తెలంగాణకు వచ్చి అమ్మకుండా గా ఉంచామని ఎవరైనా ఇలాంటి వాటికి పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఎస్పీ వెంట డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, అనంతగిరి ఎస్సై నవీన్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, చెక్ పోస్ట్ సిబ్బంది ఉన్నారు.

## ట్రాఫిక్ ఐలాండ్ వద్ద ఫాగింగ్ మిస్ట్ యంత్రాలను ప్రారంభించిన పోలీస్ కమిషనర్



**నిజామాబాద్ క్రైం, మే 7 (జనం సాక్షి) :** గురువారం నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య వేసవికాలంలో తీవ్ర ఎండల ప్రభావంతో ట్రాఫిక్ సిబ్బంది ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నగరంలో పలు కూడళ్ల వద్ద ఎండ తీవ్రతను తగ్గించడానికి ఫాగింగ్ మిస్ట్ యంత్రాలను ఏర్పాటు చేయించి కోర్ట్ సర్కిల్ వద్ద పోలీస్ కమిషనర్ ప్రారంభించారు. కమిషనర్ ఏర్పాటు చేసినటువంటి మిస్ట్ యంత్రాల పనితీరును ట్రాఫిక్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ సుమారుగా మూడు నుంచి నాలుగు డిగ్రీల వరకు మిస్టి యంత్రాల ద్వారా ఉష్ణోగ్రతను తగ్గించుకోవచ్చని వేసవి నుంచి కాస్త ఉపశమనం లభిస్తుందని తెలిపినారు అదేవిధంగా ట్రాఫిక్ సిబ్బందికి ఎల్లవేళలా ఆరోగ్య రీత్య ఎదురయ్యే ఇవబందులను రాబోయే రోజులలో తగు చర్యలు తీసుకొని సంక్షేమం కోసం కృషి చేస్తారని తెలిపినారు.మిస్ట్ యంత్రాలను ఏర్పాటు చేయడానికి సహకరించిన వాసవి క్లబ్ వారికి ధన్యవాదాలు తెలిపినారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రసాద్, అశోక్ సిబ్బంది అనిల్, రహీం, నరేష్ షాకీర్, గాంధీ మరియు శంకర్లు పాల్గొన్నారు.

## గిరిజనుల హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అల్లూరి

**నిజామాబాద్ సిటీ, మే 7 (జనం సాక్షి) :** గిరిజనుల హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకొని నగరంలోని కోట గల్లీ ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన్యం వీరుడి త్యాగం చిరస్మరణీయమన్నారు. బ్రిటిష్ పాలన వ్యతిరేకంగా స్వాతంత్రం కోసం అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. సమాజంలో అణగారిన వర్గాల కొరకు జీవించిన మహా నాయకుడన్నారు. యువతలో దేశభక్తి ధైర్యం సేవా భావం పెంపొందించాల్సిన అవసరాన్ని అల్లూరి జీవితం నేర్పుతోందని స్పష్టం చేశారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఆదేశాలతో నగరానికి చెందిన అడ్వకేట్ దేశపతి సుదర్శన్ రావు 1987లో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి సంవత్సరం జయంతి తో పాటు వర్ధంతిని నిర్విరామంగా చేస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు చింతకాయల రాజేందర్, మఠం పవన్, జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, మాజీ మేయర్ ఆకుల సుజాత శ్రీశైలం, దేవా తదితరులు పాల్గొన్నారు.



## యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**నిజామాబాద్ సిటీ, మే 7 (జనం సాక్షి) :** నిరుద్యోగ యువత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నగరంలోని శ్రీరామ గార్డెన్ లో నిర్వహించిన జాబ్ మేళాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలు అందరికీ రావడం కష్టమని, కావున అందిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కష్టపడి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వం ఏర్పాటు చేసిన మేళాలో ఎక్కువగా ఐటీ కంపెనీలు ఉండేలా చూడాలన్నారు. చాలామంది యువత రిజిస్ట్రేషన్ చేసుకుని ఉద్యోగాలు చేరడం లేదని, అలాకాకుండా అనుభవం వచ్చేవరకు ఉద్యోగం చేయాలని తెలిపారు. లి ధన్ పాల్ లక్ష్మీబాయి విట్టల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తొందర్లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎక్కువ శాతం ఐటి కంపెనీలు ఉండేలా చూస్తామన్నారు. అనంతరం ఉద్యోగాలు పొందిన పలువురికి పత్రాలను అందజేశారు కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు స్రవంతి రెడ్డి మఠం పవన్, వైష్ణవి సుధా, మురళి జ్యోతి, అర్చన చిరంజీవి జిల్లా యువజన క్రీడల అధికారి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులపై అక్రమ కేసులు 4 రోజుల్లో ఎత్తివేయకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం




**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే 7 (జనం సాక్షి) :** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ ప్రతినిధులపై రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా పోలీసులు అక్రమంగా నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని టీయూడబ్ల్యుజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ డిమాండ్ చేశారు. గురువారం మహబూబ్ నగర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేవలం సోషల్ మీడియా పోస్టులను సాకుగా చూపి జర్నలిస్టుల గొంతు నొక్కే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. రాజకీయ నాయకులు, జర్నలిస్టుల మధ్య ఉండాల్సిన ఆరోగ్యకరమైన సంబంధాలను ఇలాంటి కేసులు దెబ్బతీస్తాయని, జర్నలిస్టుల స్వేచ్ఛకు భంగం కలిగిస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కేసులను వచ్చే నాలుగు రోజుల్లోగా ప్రభుత్వం మరియు పోలీస్ యంత్రాంగం ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి పిలుపునిస్తామని విరాహత్ అలీ అల్టిమేటం జారీ చేశారు. ఈ అంశాన్ని రాష్ట్ర డీజీపీ, ముఖ్యమంత్రి మరియు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లి పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామన్నారు. మహబూబ్ నగర్ జిల్లా ప్రజాప్రతినిధు ఈ అక్రమ కేసుల వ్యవహారం పట్ల స్పందించాలని లేని పక్షంలో ప్రజాప్రతినిధుల ఇన్వాల్ మెంట్ ఉంది అని భావించాల్సి వస్తుందని అని అన్నారు. జిల్లా ఎస్పీ తక్షణమే స్పందించి అక్రమ కేసులను రద్దు చేయాలని, లేకపోతే యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందించే ప్రక్రియ యుద్ధప్రాతిపదికన కొనసాగుతోందని, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందించామని ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో జర్నలిస్టులపై దాడులు, వేధింపులు జరిగితే యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి,కల్వారి రాములు,హైమద్ పాష జిల్లా అధ్యక్ష్య ,కార్యదర్శులు కాటం నాగరాజు గౌడ్,సతీష్ రేడ్డి, తదితరులు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# ప్రభుత్వమే రైతులకు గన్నీ బ్యాగులను అందించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి జబ్బార్



**రేవల్లి, మే 7 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లాలో మొక్కజొన్న పంట పండించిన రైతులందరికీ ప్రభుత్వమే గన్నీ బ్యాగులను అందించి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.డి జబ్బార్ డిమాండ్ చేశారు. మొక్కల కొనుగోలు కేంద్రాల్లో నెల రోజులకు పైగా పడిగాపులు కాస్తున్న రైతుల ఇబ్బందులను తెలుసుకొని మొక్క జొన్న పంట కొనుగోలు కేంద్రాన్ని సిపిఎం బృందంతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రానికి వచ్చిన ఉమ్మడి గోపాల్ పేట మండలానికి చెందిన రైతులందరితో వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యలను జిల్లా వ్యవసాయ, మార్క్ ఫెడ్ శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో దాదాపు 2000 ఎకరాలకు పైగా రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారని తెలిపారు. అత్యధికంగా గోపాల్ పేట, రేవల్లి, ఏదుల మండలాలకు చెందిన రైతులు మొక్కజొన్న పంటను ఈ ఏడాది అత్యధికంగా సాగు చేశారని తెలిపారు. వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను పండించాలని చెబుతున్న వ్యవసాయ శాఖ అధికారులు రైతులు పండించిన మొక్కజొన్న పంట కొనుగోలు విషయంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో ఎకరాకు దాదాపు 30 నుంచి 40 వేల పెట్టుబడి పెట్టి 30 నుంచి 50 క్వింటాళ్ల వరకు దిగుబడిని రైతులు సాధించారని, అది రైతుల కష్టానికి నిదర్శనమని తెలిపారు. రైతులు కష్టపడి పండించిన పంటనంతా కొనుగోలు చేయాల్సిన మార్క్ ఫెడ్ అధికారులు ప్రభుత్వ నిర్ణయం అంటూ ఎకరాకు 25 క్వింటాలే కొనుగోలు చేస్తామని చెప్పడం దారుణమని చెప్పారు. మిగతా పంటనంతా రైతులు ఎలా విక్రయించుకోవాలని ప్రశ్నించారు. అలాగే కొంతమంది రైతులు పంట విత్తనం విత్తినపుడు ఆయా మండలాలు, గ్రామాల పరిధిలోని ఏఈవోల దగ్గర పంట నమోదు చేసుకోకపోవడం కారణంగా ఎంతో మంది రైతులు నేడు ధాన్యం అమ్మడానికి ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. జిల్లాకు సంబంధించిన వ్యవసాయ, మార్క్ షెడ్ శాఖల అధికారులు సమన్వయం చేసుకొని రైతులు పండించిన మొక్కజొన్న పంటనంతా రెండు మూడు రోజుల్లో కొనుగోలు చేసి కొనుగోలు కేంద్రాల దగ్గర రైతులకు ఇబ్బందులు లేకుండా లారీలకు ఎత్తి పంపించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు దాదాపు 35 వేల పైచిలుకు బ్యాగులను కొనుగోలు చేశామని అధికారులు చెబుతున్నారని చెప్పారు. మరో 10 వేల బ్యాగులను కాంటాలు వేసి కొనుగోలు కేంద్రంలోని ఉంచడంతో రైతులు వాటి దగ్గరే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. కాంటాలు వేసిన వెంటనే లారీలను రప్పించి ధాన్యాన్ని తరలించేందుకు మార్క్ ఫెడ్ అధికారులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఇంకా కొనుగోలు కేంద్రానికి 10, 15 రోజులపాటు దాదాపు 15వేల సంచులకు పైగా మొక్కజొన్న పంట రానుందని చుట్టుపక్కల గ్రామాల రైతులు చెబుతున్నారని తెలిపారు. రైతుల అవసరాల రీత్యా కొనుగోలు కేంద్రాల్లో మంచినీరు, నిలువ నీడ కోసం టెంట్లు, మధ్యాహ్నం కొనుగోలు కేంద్రాల దగ్గర ఉండే రైతులందరికీ భోజనం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏ రోజు వచ్చిన రైతుధాన్యాన్ని ఆరోజు వరుస ప్రకారమే రిజిస్టర్లో నమోదు చేసి మొక్కజొన్న పంట కొనుగోళ్లలో రైతులకు కలిగే ఇబ్బందులను తొలగించాలని సూచించారు. సీరియల్ ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ టోకెన్లను పంపిణీ చేయడం సరైన పద్ధతి కాదని, కొనుగోలు కేంద్రంలో పనిచేసే రికార్డ్ అసిస్టెంట్, పిఎసిఎస్ సీఈవో అధికారి రామ్ మోహన్ లు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. రైతులను అడిగాపులు కాయించకుండా వెనువెంటనే ధాన్యాన్ని కాంటాలు వేసి ఇబ్బందులను తొలగించాలని, లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట రైతులతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన వారిలో సిపిఎం నాయకులు, రేమద్దుల గ్రామ సర్పంచ్ నిరంజన్, వెంకటయ్య, మహేష్, రైతులు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలి



**చేర్యాల, మే 7 (జనంసాక్షి) :** ప్రభుత్వం నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కష్టపడి పనిచేస్తూ ధాన్యం బస్తాలను కాంటా నిర్వహిస్తూ లారీల్లోకి లోడు చేస్తున్న హమాలీ కార్మికులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆకునూరు గ్రామంలో కోపరేటివ్ సొసైటీ నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కొంగరి వెంకట మావో హమాలీ కార్మికుల తో కలిసి మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి హమాలీ కార్మికులు అత్యంత కష్టతరమైన పని చేస్తూ ప్రభుత్వానికి తోడ్పాటు నందించినప్పటికీ ప్రభుత్వం హమాలీ కార్మికుల్ని గుర్తించటం లేదని దేశ అభివృద్ధిలో వీరి పాత్ర గణనీయమైనప్పటికీ వీరిని గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీ కార్మికులకు ప్రభుత్వం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు అందించి ప్రతి హమాలీ కార్మికునికి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వీరి కుటుంబానికి ఉచిత వైద్య ఆరోగ్య సౌకర్యాలు, పిల్లల చదువులలో తోడ్పాటు కల్పించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో హమాలీ కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కడారి నరేష్, జక్కు కనకయ్య, చిగుళ్ల నరసయ్య, కడారి మల్లయ్య, భూమయ్య, ఆల్ద మల్లయ్య, మండే పల్లి కిషన్, తాటికొండ సంపత్, బైకని బీరయ్య, అయ్యాలం, కోమినేని రవి తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష



**మహబూబ్‌నగర్ క్రైమ్, మే 7 (జనం సాక్షి) :** మహబూబ్నగర్ స్పెషల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి తమన్ రాజరాజేశ్వరి గురువారం నాడు మిడ్జిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2020 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడైన కుర్రావత్ రమేష్ (25), మిడ్జిల్ మండలానికి చెందిన వ్యక్తిపై నేరం రుజువుకావడంతో లి20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానాలి విధిస్తూ తీర్పు వెలువరించారు. 2020 నవంబర్ 22వ తేదీన బాధిత బాలికపై నిందితుడు అఘాయిత్యానికి పాల్పడిన ఘటనపై మిడ్జిల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడింది. అప్పటి ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేయగా, అప్పటి జడ్చర్ల రూరల్ సీఐ శివకుమార్ దర్యాప్తు నిర్వహించి నిందితుడిపై చార్జ్ షీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.జాన్ కోర్టులో 15 మంది సాక్షులను ప్రవేశపెట్టి బలమైన వాదనలు వినిపించారు. మిడ్జిల్ ఎస్‌హెచ్‌ఓ పర్యవేక్షణలో సీడీఓలు రమేష్, ,ాజ 3229 మరియు శంకర్,,ాజ 2194, అలాగే కోర్టు లైజనింగ్ ఏఎస్ఐ బాలకృష్ణ సాక్షులను క్రమపద్ధతిలో కోర్టులో ప్రవేశపెట్టి కేసు విచారణ సాఫీగా జరిగేలా కృషి చేయడంతో కోర్టు నిందితుడికి శిక్ష విధించింది. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేందుకు సమర్థవంతంగా పనిచేసిన పోలీసు అధికారులు, ప్రజా అభియోజకులను జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ అభినందించారు.

## ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పంపిణీలో ఉద్రిక్తత

- అధికారుల తీరుపై ఆగ్రహించిన ఎమ్మెల్యే సునితా రెడ్డి
- రైతు వేదిక ముందు బైఠాయించి నిరసన వ్యక్తం



**హత్నూర, మే 7 (జనం సాక్షి) :** మండల కేంద్రమైన హత్నూర రైతు వేదికలో గురువారం నిర్వహించిన వివిధ సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పత్రాలు పంపిణీ చేయడాన్ని తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు అధికారులు ప్రకటించడంతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ఒక ప్రజా ప్రతినిధిగా ప్రజలకు అందించకూడదా అంటూ ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికారులు వారి కర్తవ్యాన్ని మరచి అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాస్తున్నారని ఆమె మండి పడ్డారు.అధికారుల తీరును తప్పుబడుతూ రైతు వేదిక ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ వావిలాల నర్సింలు తదితరులు ఉన్నారు.

## అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలి



**అమీన్‌పూర్, మే 7 (జనం సాక్షి) :** అమీన్పూర్ డివిజన్ పరిధిలోని ఐలాపూర్ గ్రామంలో అక్రమ నిర్మాణాలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐలాపూర్ లో అక్రమంగా జరుగుతున్న నిర్మాణాలపై గురువారం హైకోర్టు న్యాయమూర్తి విజయసేన్ రెడ్డి మున్సిపల్ రెవెన్యూ అధికారులకు అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఐలాపూర్ ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేయొద్దు అని గతంలో ఉత్తర్వులు జారీ చేసినట్లు గుర్తు చేశారు. యధా స్థితిలో ఉండాల్సిన భూముల్లో నిర్మాణాలు జరగడం అధికారుల నిర్లక్ష్యాన్ని సూచిస్తుందన్నారు. ఈ నిర్మాణాలను హైకోర్టు తీవ్రంగా పరిగణిస్తుంది అన్నారు.

# మతసామరస్యంతో బక్రీద్ నిర్వహించాలి

- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



**మెదక్, మే 7 (జనం సాక్షి) :** మెదక్ జిల్లాలో బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో, మతసామరస్యాన్ని కాపాడేలా నిర్వహించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఖురేషి కులస్తులు, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్, హిందూ వాహిని, శ్రీరామ్ సేన, హిందూ యువవాహిని సభ్యులతో వేర్వేరుగా అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సరైన అధికారిక అనుమతులు, పత్రాలు ఉన్న పశువులను మాత్రమే సంహరించాలని ఖురేషి కులస్తులకు సూచించారు. ఆవులను ఎట్టి పరిస్థితుల్లోనూ సంహరించవద్దని స్పష్టం చేశారు. పశువుల కొనుగోలు సమయంలో సంబంధిత పత్రాలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. మాంసం నిల్వ చేసే ప్రదేశాల్లో పరిశుభ్రత పాటించాలని, పక్షులు, కుక్కలు, కోతుల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆవులు, దూడల అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, వ్యక్తులపై దాడులకు పాల్పడడం నేరమని హెచ్చరించారు. అక్రమంగా పశువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి రాత్రింబవళ్లు వాహనాల తనిఖీలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ అనుమానాస్పద వాహనాలపై నిఘా ఉంచుతున్నామని చెప్పారు. పశువుల అక్రమ రవాణా శిక్షార్హమైన నేరమని, మూగజీవాలపై క్రూరత్వానికి దారితీస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పశువుల రవాణా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్ యాక్ట్, కౌ స్లాటర్ యాక్ట్, భారతీయ న్యాయ సంహిత చట్టాల కింద కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. గోరక్షణ పేరుతో దాడులు, వాహనాల ధ్వంసం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, వాస్తవాలు నిర్ధారించకుండా వాటిని షేర్ చేయవద్దని ప్రజలకు సూచించారు. పశువుల అక్రమ రవాణాపై సమాచారం తెలిసిన వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ డియస్పి ప్రసన్న కుమార్, సీఐ లు జర్జ్, సందీప్ రెడ్డి, వెటర్నరీ డాక్టర్ లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది, మత పెద్దలు, పాల్గొన్నారు.

## ధాన్యం సరఫరాకు లారీలను అందుబాటులో ఉంచాలి




**సిద్దిపేట, మే 7 (జనంసాక్షి) :** సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హల్ లో జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయడం కోసం సివిల్ సప్లై, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏఎంసి మరియు గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాల్లో దాన్యం కొనుగోలు వేగవంతం చేసేందుకు సెంటర్లో అవసర నిమిత్తం లారీలను అందుబాటులో పెట్టాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఏఎంసీలలో వరి ధాన్యం తో పాటు మక్కలు సైతం కొనుగోలుతో చేస్తున్నాం కాబట్టి ఎక్కువ మొత్తంలో లారీలను పెట్టాలని ఆదేశించారు.అన్ని కొనుగోలు కేంద్రాల్లో ప్రాధాన్యత ప్రకారం ఉదయం 7 గంటలకు అన్ని సెంటర్ లలో లారీలను ఉండాలని లేనియెడల జరిమానా విధించబడుతుందని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు.మిల్లులకు తరలించిన ధాన్యాన్ని 6 గంటల లోపు దిగుమతి చేసుకోవాలని లేనియెడల ఆయా మిల్లర్ యజమానులను జరిమానా విధించాలని సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్కెటింగ్ జెనరల్ మేనేజర్ అభిషేక్ సింగ్, ఆర్డీఓ రామ్మూర్తి, జిల్లా సివిల్ సప్లై అధికారి తనూజ, డిఎం సివిల్ సప్లై గోపి కృష్ణ, జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా చేయాలి

- మంత్రి పొంగులేటికి ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వినతి



**జడ్చర్ల, మే 7 (జనంసాక్షి) :** జడ్చర్లను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి హైదరాబాద్‌లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. హైదరాబాదులో గురువారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఈ మేరకు వినతి పత్రాలను రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డికి సమర్పించారు. జడ్చర్లకు డివిజన్ కేంద్రంగా అన్ని అర్హతలు ఉన్నాయని, ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చాలని కోరారు. దీంతో పాటు జడ్చర్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి, రాజాపూర్, ఊర్కొండ తహసీల్దార్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కావేరమ్మపేటలోని సర్వే నంబర్ 434లో గల 2000 గజాల స్థలాన్ని మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్ నిర్వహణ కోసం కేటాయించాలని కోరారు. విన్నపాలపై స్పందించిన మంత్రి, సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## .మెదక్ పట్టణ సమగ్రాభివృద్ధి ప్రభుత్వం లక్ష్యం

- ఎమ్మెల్యే రోహిత్ రావు



**మెదక్, మే 7 (జనం సాక్షి) :** మెదక్ పట్టణ సమగ్రాభివృద్ధి ద్యేయంగా ధ్యేయంగా ముందుకు పోతున్నామని జర్నలిస్టుల కాలనీకి అన్ని వసతులు కల్పిస్తామని మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. గురువారం మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో సుమారు 37.01 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన పలు పనులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెదక్ పట్టణ అభివృద్ధికి చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు.మెదక్ పట్టణాభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంగా ముందుకు పోతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు చేపట్టిన పనులు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉన్నాయన్నారు. మెదక్ ప్రాంత ప్రజల అభివృద్ధి చేయాలని ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. మెదక్ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు నిధులు మంజూరు చేస్తూ పనులు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో అన్ని మండలాలు గ్రామాలు మున్సిపాలిటీలో అంచెలంచెలుగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. పట్టణ ప్రాంత అవసరాలను గుర్తించి వారి కి మౌలిక వసతులు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని ఆయన అన్నారు. మెదక్ పట్టణంలోని ఆయా వార్డుల్లో రూ.37.01 కోట్లతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రోహిత్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులందరకీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి



**సిద్దిపేట బ్యూరో, మే 7 (జనంసాక్షి) :** జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడం కోసం ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో 252ను సవరించి అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ సిద్దిపేట జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ హైమవతి కి వినతి పత్రం సమర్పించారు. జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం సందర్భంగా ఈ మేరకు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు, TUWJ (IJU) జిల్లా అధ్యక్షులు కె. రంగాచార్య, కమిటీ సభ్యుడు, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిపల్లి అరుణ్ కుమార్, కమిటీ సభ్యుడు,యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూతురు రాజిరెడ్డి, కమిటీ సభ్యులు, సిద్దిపేట ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఐత శ్రీనివాస్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు, యూనియన్ ప్రతినిధులు ముంజ గిరి, సతీష్, వంశీధర్,కమిటీ సభ్యులు, మహిపాల్ రెడ్డి, పంగ రాజు లు కలిసి వినతి పత్రం అందజేశారు. జీవో 252లో పొందుపరిచిన కొన్ని నిబంధనల వల్ల కొన్ని పెద్ద పత్రికలు, మీడియం పత్రికల్లో పనిచేస్తున్న అర్హులైన జర్నలస్టులకు చిన్నపత్రికల్లోని కొందరికి అక్రిడిటేషన్ కార్డులు వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని పేర్కొన్నారు. పెద్ద పట్టణాల్లో పనిచేస్తున్న వారికి ఒకే కార్డు వచ్చే పరిస్థితి ఉందని దానివల్ల సీనియర్ జర్నలిస్టులకు నష్టంకలుగుతున్నదని తెలిపారు.. అన్ని పత్రికలకు ప్రతి మండలానికి 150 కి పైగా సర్క్యులేషన్ ఉండాలనే నిబంధన వల్ల మండలాల్లో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డు జారీ అయ్యే అవకాశం లేకుండా పోతున్నదని తెలిపారు.PRGI సర్టిఫికెట్‌తో పాటు జూా సర్టిఫికెట్ కూడా ఇవ్వాలని సమాచార శాఖ అధికారులు అడుగుతున్నారని ఈ నిబంధన వల్ల పెద్ద పత్రికలకు కూడా అక్రిడీటేషన్ కార్డులు వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని తెలిపారు. ఫ్రీలాన్స్ జర్నలిస్టులుగా అప్లై చేసుకున్నవారు తమ పేరుతో రాసిఉన్న 60 ఆర్టికల్స్ అందజేయాలని.. పత్రికాయాజమాన్యం నుండి తమ పత్రికకు ఆర్టికల్స్ రాస్తున్నట్టుగా లేఖ తీసుకురావాలని కూడా సమాచార శాఖ అధికారులు అడుగుతున్నారని దానివల్ల ఫ్రీలాన్స్ జర్నలిస్టులుగా పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్టులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.. ఏ సంస్థ కూడా లేఖలు ఇచ్చే పరిస్థితి లేదని తెలిపారు. పత్రికలకు కొన్ని మండలాల్లో ఎక్కువ.. కొన్ని మండలాల్లో తక్కువ సరక్యులేషన్ ఉండే పరిస్థితి ఉంటుందని దానివల్ల మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డు రాకుండా పోతుందని అన్నారు..ఇలా కొన్ని నిబంధనల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని అర్హులైన.. ఫీల్డ్ లో నిజంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు న్యాయం జరిగేవిధంగా జీవోను సవరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.. రాష్ట్ర సమాచార కమీషనర్, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి చొరవ తీసుకొని జీవో ను కొంత సరళతరం చేసి జిల్లాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు న్యాయం జరిగేవిధంగా చూడాలని వినతిపత్రం లో పేర్కొన్నారు.. సిద్దిపేట జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల అభ్యర్థనను రాష్ట్ర సమాచార కమిషర్ దృష్టికి తీసుకు వెళ్తామని, ఈ మేరకు రాష్ట్ర కమిషనర్ కు లేఖ రాయాలని డిపిఆర్ఓ రవికుమార్ ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# సేల్ విత్‌ఔట్ పొజిషన్‌తో మోసం



- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మహిళ ఫిర్యాదు

**బెల్లంపల్లి, మే 7( జనం సాక్షి) :** భూమి రిజిస్ట్రేషన్ విషయంలో "సేల్ విత్‌ఔట్ పొజిషన్" పేరుతో మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ముక్కెర స్రవంతి గురువారం నెన్నెల తహసీల్దార్ పిప్పరి శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తన తల్లిదండ్రుల కష్టార్జితంతో నెన్నెల శివారులోని సర్వే నంబర్ 332/1లో ఉన్న 1.01 ఎకరాల భూమిని పూర్తి హక్కులతో కొనుగోలు చేశానని తెలిపింది. భూమి పట్టా రిజిస్ట్రేషన్ కోసం నెన్నెల గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని సంప్రదించగా, సేల్ డీడ్‌కు భూమి విలువలో 9 శాతం ఖర్చు అవుతుందని చెప్పి తన వద్ద నుంచి రూ.28,500 వసూలు చేశాడని ఆరోపించింది.అయితే తనకు మాత్రం "సేల్ విత్‌ఔట్ పొజిషన్" కింద రూ.9,350 మాత్రమే చలాన్ కట్టి, 341/2025 డాక్యుమెంట్ ఇచ్చాడని వివరించింది. ఈ కారణంగా రైతు భరోసా, బ్యాంకు మార్టిగేజ్ రుణం వంటి ప్రభుత్వ, బ్యాంకు ప్రయోజనాలు పొందలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేసింది. తాను కొనుగోలు చేసిన భూమిపై పూర్తి హక్కులు కోల్పోయానని, నెన్నెల మండలంలో ఇలాంటి రిజిస్ట్రేషన్ల కారణంగా పలువురు రైతులు కూడా నష్టపోయారని పేర్కొంది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేసింది.

# నకిలీ పత్రాల ముఠా గుట్టురట్టు

- ఆరుగురు పై కేసు, ఒకరు పరార్
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మరోసారి ఓ ముఠాను గుట్టురట్టు చేశారు.ఐతే ఈసారి నకిలీ పత్రాల ముఠాను గుట్టు రట్టు చేసి వారి ఆట కట్టించారు. ఈమేరకు మావల మండలంలో పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశం నిర్వహించి విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణం లోని దస్నాపూర్ రోడ్డులో యూనియన్ బ్యాంక్ సమీపంలో నకిలీ జనన ధృవీకరణ పత్రాలు జారీ చేస్తున్నారనే సమాచారంపై మావల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని తెలిపారు. వెంటనే మున్సిపల్ కౌన్సిల్ కమిషనర్ ఎ. జగదీశ్వర్ గౌడ్ ఫిర్యాదు మేరకు విచారణ ప్రారంభించగా, ఒక వ్యక్తి సమర్పించిన జనన ధృవీకరణ పత్రం మున్సిపల్ కార్యాలయ రికార్డుల్లో లేకపోవడంతో మోసం వెలుగులోకి వచ్చింది.ఈ క్రమంలో మావల ఇన్స్పెక్టర్ కె. స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టి మే 7న ఐదుగురు నిందితులను అరెస్ట్ చేయడం జరిగింది.నిందితులు మొబైల్ ఫోన్లు మరియుగ్రాణఖీ ఎడిటింగ్ యాప్స్ ఉపయోగించి నకిలీ జనన ధృవీకరణ పత్రాలు, ఓటర్ ఐడీ కార్డులు, ఆధార్ కార్డుల్లో మార్పులు చేసి అమాయక ప్రజలను మోసం చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది అని అన్నారు. ప్రభుత్వ పథకాలు పొందేలా చేస్తామని నమ్మబలికి ఒక్కో పత్రానికి రూ.1500 నుండి రూ.3000 వరకు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుండి 280కు పైగా డిజిటల్ పత్రాలు ఉన్న మొబైల్ ఫోన్లు, నకిలీ ఓటర్ కార్డులు, నకిలీ జనన ధృవీకరణ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ప్రజలకు ఎస్పీ పలు సూచనలు చేశారు. పలు సూచనలు చేశారు. జనన ధృవీకరణ పత్రాలు వంటి ప్రభుత్వ పత్రాలను కేవలం మున్సిపల్ కార్యాలయం లేదా అధికారిక మీ సేవా కేంద్రాల ద్వారానే పొందాలని సూచించారు. అధిక మొత్తంలో డబ్బులు తీసుకొని త్వరగా పత్రాలు తయారు చేస్తామని చెప్పే వ్యక్తులను నమ్మవద్దని తెలిపారు. నకిలీ పత్రాలను వినియోగించడం కూడా చట్టరీత్యా నేరమని, అటువంటి పత్రాలు భవిష్యత్తులో ధృవీకరణ సమయంలో తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. అనుమానాస్పదంగా పత్రాలు తయారు చేస్తున్న వ్యక్తులపై వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా సమీప ప్రభుత్వ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, మావల ఎస్ హెచ్ ఓ రాహుల్ కాంత్ ఐపిఎస్, సిఐ కర్ర స్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతల మొక్కజొన్నల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

- మహమ్మదాపురం సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఊరటి మహిపాల్ రెడ్డి...
- వెంకటాపురం గిర్నిబావి మక్కల కొనుగోలు కేంద్రాల సందర్శన..
- పిఏసిఎస్ చైర్మన్ ఊరటి మహిపాల్ రెడ్డి..



**వరంగల్ ప్రతినిధి మే 7 (జనం సాక్షి)** : కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వఉన్న మక్కలు కొనుగోళ్ళు వేగవంతం చేయాలని మహమ్మదాపురం పిఏసిఎస్ చైర్మన్ ఊరటి మహిపాల్ రెడ్డి అన్నారు. తాజాగా వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్ లుగా కొనసాగిన వారే మరల బాధ్యతలు నిర్వర్తించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు మహమ్మదాపురం సొసైటీ చైర్మన్ గా ఊరటి మహిపాల్ రెడ్డి గురువారం మరోసారి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సొసైటీ పరిధిలో వెంకటాపురం గిర్నిబావిలలో ఏర్పాటు చేసిన మొక్కల కొనుగోలు కేంద్రాలను మైపాల్ రెడ్డి సందర్శించారు. గత కొన్ని రోజులుగా రైతులు అమ్మకాల కోసం అక్కడే ఉంచిన మొక్కలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ తో కొనుగోళ్ళు వేగవంతం చేయాలని కోరారు.అలాగే ట్రాన్స్ పోర్ట్ ఇంచార్జీ విష్ణుతో మాట్లాడి వెంకటాపురం, గిర్నిబావి కేంద్రాలకు మూడు లారీల చొప్పున తెప్పించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ట్రాన్స్ పోర్ట్ పట్ల అశ్రద్ధ చేయవద్దని సంబంధిత అధికారులకు సూచించారు.కొనుగోల కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కల్గించవద్దని నిర్వాహకులకు ఆదేశించారు.పూర్తి మక్కలు కొనుగోలు చేయించే బాధ్యతగా ఉంటామని రైతులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమాల్లో సొసైటీ సీఈవో రమేష్ డైరెక్టర్లు నాంపల్లి సుధాకర్,జరుపుల శ్రీను,జంగిలి రవి,రైతు నాయకులు ఎడాకుల ఉమా మహేశ్వర్ రెడ్డి, సిబ్బంది చింత సాంబయ్య రైతులు పాల్గొన్నారు.

# వరదల సమయంలో అన్ని శాఖల సమన్వయం అవసరం

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ రూరల్, మే7 (జనంసాక్షి) :** వరదల సమయంలో సమర్థవంతమైన స్పందనకు అన్ని శాఖల సమన్వయం అవసరమని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరదల నివారణ,విపత్తు నిర్వహణ చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లు,పోలీస్ అధికారులు,సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో రాష్ట్ర స్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించింది.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లాలో వర్షాకాలానికి ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలు,వరదల సమయంలో తక్షణ స్పందన ప్రజల రక్షణ,సహాయక చర్యలు, అత్యవసర సేవల సమన్వయంపై విస్తృతంగా సమీక్షించారు. జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న గ్రామాలు, చెరువులు, వాగులు, కాలువలు,రహదారుల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.వర్షాకాల సన్నద్ధతలో భాగంగా నిర్మల్ జిల్లాలో జిల్లా స్థాయి ఫ్లడ్ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ మాక్ ఎక్సర్‌సైజ్ ద్వారా వరదల సమయంలో తీసుకోవాల్సిన అత్యవసర చర్యలను ప్రాయోగికంగా అమలు చేసి శాఖల మధ్య సమన్వయాన్ని పరీక్షించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మున్సిపల్ పరిపాలన, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా శాఖలతో పాటు ఇతర అత్యవసర సేవల విభాగాలు పాల్గొంటాయని తెలిపారు. ప్రజల తరలింపు ప్రక్రియ,సహాయక శిబిరాల ఏర్పాటు, రక్షణ చర్యలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందన విధానాలను సమగ్రంగా పరిశీలించనున్నట్లు వెల్లడించారు. విపత్తుల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన యంత్రాంగం, సిబ్బంది, పరికరాలను సిద్ధంగా ఉంచాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు అందించాల న్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు బి వెంకటేశ్వర్లు,కిషోర్ కుమార్,సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్,ఆర్ డి ఓ రత్న కళ్యాణి,సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# వర్షానికి కూలిన ఇంటిగోడ

**పెంచికల్‌పేట్, మే 7 (జనంసాక్షి) :** రెండురోజుల క్రితం వడగాళ్ల వర్షానికి ఎల్లూర్ గ్రామపంచాయతీ లోని కోయాచిచ్చల లో నైతం. శ్రీనివాస్ ఇంటి గోడ, కూలిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఆ కుటుంబం ఉండడంతో సర్పంచ్ చెప్పిడే. రవీందర్ సమాచారం తెలవగానే వెంటనే రెవెన్యూ సిబ్బందితో పరిశీలించడం జరిగిందని,ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం కోసం ఉన్నంతధికారులకు పంపిస్తాని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేష్, జీపీఓ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షంతో అన్నదాతలకు నష్టం

**కడెం, మే 7(జనం సాక్షి) :** కడెం మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం రోజున బీభత్సమైన గాలితో కూడిన వర్షం కురవడంతో అన్నదాతలకు తీరని నష్టం వాటిల్లింది. అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించినటువంటి మొక్కజొన్న, వరి నేలకొరిగింది. అలాగే మార్కెట్లో పోసిన మక్కలు తడిసి ముద్దయ్యాయి. మామిడి చెట్ల రైతులు గాలికి మామిడి కాయలు నేలకొరవడంతో ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

## 16న గిరిజన గురుకుల కళాశాలల్లో అడ్మిషన్లు

**పాలకుర్తి, మే 07(జనంసాక్షి) :** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గిరిజన గురుకుల కళాశాలల్లో ఈ నెల 16న స్పాట్ అడ్మిషన్లకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఆ కళాశాలల వరంగల్, కరీంనగర్ రీజినల్ కోఆర్డినేటర్ డీ.ఎస్. వెంకన్న తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హన్మకొండ జిల్లాలోని దేవన్నపేట, జనగాం జిల్లా గూడూరు, వరంగల్ జిల్లా పర్వతగిరి, మూడు చక్కలపల్లి గిరిజన గురుకుల కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సంలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బీపీసీలో చేరేందుకు గిరిజన, గిరిజనేతర విద్యార్థులు ఈ నెల 16న వరంగల్ లోని యాకూబ్ పుర లో నిర్వహించే అడ్మిషన్ల కౌన్సిలింగు విద్యార్థులు తమ టీసీ, మెమో. స్టడీ పర్టిఫికెట్లతో పాటు ఒక పాస్ ఫోటో, ఆదాయం, కుల దృ వీకరణ పత్రాలతో పాటు రెండు జతల జిరాక్స్ పత్రాలను తీసుకొని రావాలని కోరారు.

# కేటీఆర్‌కు మతిభ్రమించింది..

- డ్రగ్స్ వాడడం వల్ల ఏం మాట్లాడుతున్నాడో తెలియడం లేదు
- వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్



**వరంగల్ బ్యూరో, మే 07 (జనం సాక్షి) :** భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మతిభ్రమించిందని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ అన్నారు. బుధవారం వరంగల్ లో రైతు సభ ఏర్పాటు చేసి రాష్ట్ర ముఖ్యమంత్రిని పరుష పదజాలంతో అన్ పార్లమెంటరీ లాంగ్వేజ్ తో దూషించిన కేటీఆర్ ను హెచ్చరిస్తూ గురువారం వరంగల్ లోని అబ్బూస్ ఫంక్షన్ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అధికారం పేరుతో అడ్డంగా దోచుకుని బలిసి ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని పట్టుకొని హౌలే గాడు అనడం కేటీఆర్ అవివేకత నానికి నిదర్శనం అన్నారు. డ్రగ్స్ వాడడం వల్ల ఏం మాట్లాడుతున్నాడో తెలియక అవాకులు చవాకులు పెట్టిన కేటీఆర్ నిజాలు తెలుసుకోవాలని, అసలు రైతు సభ పెట్టే నైతిక కూడా లేని సిగ్గులేని వీరికి రైతులకు గత ప్రభుత్వంలో వరేసుకుంటే వరి అని మీ అయ్య చెప్పలేదా దళితులకు మూడెకరాలను ఇస్తానని మోసం చేసి దళిత ముఖ్యమంత్రి అని చెప్పి మోసం చేసి కేజీ టు పీజీ ఉచిత విద్యను మోసం చేసి రైతులకు బేడీలు వేసిన నీచమైన చరిత్ర మీదే కదా అని గుర్తు చేశారు. అదే విధంగా 2014 నుంచి 2023 వరకు తెలంగాణ రాష్ట్రంలో 641 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నది వాస్తవం కాదా ఇలాంటి నీచమైన పరిపాలన చేసిన మీరు కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిని హౌలే అనడం సిగ్గుచేటు. ఇలాంటి మాటలు మరొకసారి మాట్లాడితే బిడ్డ నిన్ను బట్టలిప్పదీసి వరంగల్ పోచం మైదానంలో రాణి రుద్రమదేవికి కట్టేస్తాం అని చెప్పి హెచ్చరించడం జరుగుతోంది.వరంగల్ జిల్లా చరిత్ర తెలుసుకో ఇంకొకసారి ఈ గడ్డమీదకి వచ్చి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే బిడ్డ ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట అధ్యక్షులు ఎద్దు సత్యం , తూల రవి గీసుకొండ మండల అధ్యక్షుడు శ్రీనివాసు దాడి శివ సంఘ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి ఇండ్ల రవి మరియు ఈగ దామోదర్ నాంపల్లి యాదగిరి జన్ను అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

# సాగు నీటిని ఆదా చేసి భావితరాలకు అందిద్దాం



- వ్యవసాయ శాస్త్రవేత్త విద్యాధర్

**శాయంపేట ,మే 7 ( జనం సాక్షి) :** శాయంపేట మండలంలోని నేరెడుపల్లి గ్రామంలో వరంగల్ జిల్లా వ్యవసాయ శాఖ సహకారంతో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించి రైతులకు శాస్త్రీయ సాగు విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమము సాగు నీటిని ఆదా చేద్దాం భావి తరాలకు అందిద్దాం అనే నినాదంతో నిర్వహించబడింది. వ్యవసాయంలో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచడం, భూగర్భ జలాల పరిరక్షణ మరియు వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా. బి. విద్యాధర్ వ్యవసాయంలో ప్రతి నీటి బొట్టును సమర్థవంతంగా వినియోగించాల్సిన అవసరాన్ని వివరించారు. సూక్ష్మ సాగు పద్ధతులు, డ్రిప్, స్ప్రింక్లర్ వ్యవస్థలు వంటి నీటి పొదుపు సాంకేతికతలను రైతులకు వివరించారు. అదేవిధంగా భూగర్భ జలాల స్థాయి క్షీణతను తగ్గించేందుకు వర్షపు నీటి సంరక్షణ, చెక్‌డ్యామ్‌లు, ఫార్మ్‌పాండ్‌లు మరియు నేల తేమ సంరక్షణ పద్ధతుల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో వ్యవసాయ శాస్త్రవేత్త లు సిద్ధార్థ నాయక్, శ్రీ విజయ, వంశీకృష్ణ,వ్యవసాయ అధికారి ప్రియదర్శిని, వ్యవసాయ విస్తరణ అధికారి సానియా , ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఎన్‌జీఓ ప్రతినిధి తిరుపతి, నేరేడుపల్లె సర్పంచ్ మడికొండ ఇందిరా రాజు, కళాశాల విద్యార్థులు తేజస్విని, నవ్యశ్రీ రైతులు పాల్గొన్నారు.

# విత్తన కంపెనీ నుంచి రైతులకు నష్టపరిహారం

- డీసీఐసీ చొరవతో రూ.15 లక్షల పరిహారం అందజేత



**తొర్రూరు, మే 7( జనం సాక్షి):** ఓ విత్తన కంపెనీ అంటగట్టిన ఆడ మగ రకం మొక్కజొన్న విత్తనాలు వేసి నష్టపోయిన రైతులు వినియోగదారుల సమాచార కేంద్రం సహాయంతో పోరాటం చేయగా వారికి ఫలితం దక్కింది. ఆశించిన దిగుబడి రాక నష్టం వాటిల్లడంతో బాధిత రైతులు ఇటీవల వినియోగదారుల సమాచార కేంద్రం జిల్లా చైర్మన్ వింజమూరి సుధాకర్ ను కలిసి విత్తన కంపెనీ పై ఫిర్యాదు చేశారు. రైతులకు జరిగిన మోసంపై డీసీఐసీ జిల్లా చైర్మన్ విత్తన కంపెనీకి నోటీసులు పంపగా వారు దిగివచ్చి రైతులకు పరిహారం అందజేశారు. సదరు వివరాలను గురువారం తొర్రూరులోని ఆయన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. నరసింహుల పేట మండలం చెందిన లోక్యా తండా, పెద్ద నాగారం గ్రామాలకు చెందిన భూక్యా సూక్యా, చావ కిరణ్ కుమార్, గుగులోతు లచ్చు, బానోతు యాకూబు, బానోతు సోమ్లా, రేఖ ఐలయ్య, రేఖ యాకయ్య అనే రైతులు నూజివీడు సీడ్స్ కంపెనీకి చెందిన ఆడ మగ రకం మొక్కజొన్న విత్తనాలను సాగు చేశారని, 24 ఎకరాల్లో సుమారు రూ. 14.40 లక్షల పెట్టుబడితో పంట సాగు చేయగా ఆశించిన రీతిలో దిగుబడి రాలేదన్నారు. 24 ఎకరాల గాను రూ.26 లక్షల ఆదాయం రావాల్సి ఉండగా రూ.11 లక్షలు మాత్రమే వచ్చాయని, రూ.15 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. బాధిత రైతులు సదరు కంపెనీ ఏజెంట్ ను ప్రశ్నిస్తే తమకేమి తెలియదని, నాణ్యమైన విత్తనాలే అందించామని, మీ అలసత్వం వల్లనే పంట దిగుబడిపోయిందని నిర్లక్ష్యంగా రైతులకు సమాధానమిచ్చారని తెలిపారు.నాసిరకం విత్తనాలు అందించిన విత్తన కంపెనీపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు ఇటీవల తనకు ఫిర్యాదు చేశారన్నారు. విత్తన కంపెనీకి నోటీసులు పంపగా దిగివచ్చిన కంపెనీ ప్రతినిధులు నష్టాన్ని అంచనా వేసి రూ.15 లక్షలు పరిహారం కింద రైతులకు అందజేసినట్లు తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ సమక్షంలో చెక్కులు, రైతులకు అందించినట్లు పేర్కొన్నారు.

# గృహ సముదాయాలను వ్యవసాయ పట్టా చేసుకున్న బీఆర్ఎస్ రైతు కోఆర్డినేటర్ నేరెళ్ల బస్వారెడ్డి రమ

- 10 సంవత్సరాలుగా రైతుబంధు, పీఎం కిసాన్ నిధుల దోపిడీ
- వెంటనే కలెక్టర్ పట్టా పాస్ బుక్కు రద్దుచేసి రైతుబంధు రికవరీ చేయాలని గృహస్తుల డిమాండ్


తెలంగాణ ప్రభుత్వం

**ఆత్మకూర్, మే 7 (జనం సాక్షి):** 50 సంవత్సరాలుగా ఇండ్లు కట్టుకుని నివసిస్తున్నటువంటి ఇళ్ల స్థలాలను గ్రామ బి ఆర్ ఎస్ రైతు కోఆర్డినేటర్ నేరెళ్ల రమ బస్వారెడ్డి 2017 సంవత్సరం సాదా బైనామాలో అక్రమంగా పట్టా పాసుబుక్కు చేసుకొని 10 సంవత్సరాలుగా రైతుబంధు పీఎం కిసాన్ నిధుల వంటి ప్రభుత్వాన్ని నిధులను దోపిడీ చేశాడని ఇండ్ల వాసులు ఆరోపించారు. గురువారం ఆత్మకూరు మండలం నాగయపల్లి గ్రామంలో వారు సమావేశమై మాట్లాడారు. గ్రామ టిఆర్ఎస్ రైతు కోఆర్డినేటర్ నేరెళ్ల రమ బస్వారెడ్డి టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సర్వేనెంబర్ 898/సి లో పది గుంటల ఇంటి గృహ సముదాయాలను అప్పుడు టిఆర్ఎస్ ప్రభుత్వ అండదండలతో అక్రమంగా పట్టా చేసుకొని పది సంవత్సరాలుగా రైతుబంధు,పీఎం రైతునిధులను ప్రభుత్వ నిధులను దోపిడీ చేశారని వారు ఆరోపించారు. ఇవేకాక అసలు పెద్దాపురం రెవెన్యూ పరిధిలో నేరెళ్ల బస్వారెడ్డికి గుంట భూమి లేకున్నా కూడా దొంగ పాసుబుక్కులతో పలు సర్వేనెంబర్ లో అక్రమంగా భూములను పట్టా చేసుకొని సామాన్య ప్రజలను ఇబ్బంది పెడుతున్నాడని వారు తెలిపారు. వెంటనే జిల్లా కలెక్టర్,కూడా అధికారులు,ఆర్డీవో, ఎమ్మార్వో కలుగజేసుకొని 10 సంవత్సరాలుగా రైతుబంధు ప్రభుత్వ నిధులను దోపిడీ చేసినటువంటి బసవరెడ్డి పైన చట్టపరమైన చర్యలు తీసుకుని పట్టా పాస్బుక్కును రద్దు ప్రభుత్వనిధులను రికవరీ చేయవలసిందిగా పురం కుమారస్వామి సునీత, మాదాసి సాంబయ్య, కొన్నే భద్రయ్య, కొన్నే కృష్ణారెడ్డి,సర్పంచ్ గుండాల క్రాంతి, గుండాల శశి కుమార్, తదితరులు మనవి చేశారు.

# వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



**వరంగల్ ఎంజీఎం,మే 7(జనంసాక్షి):** వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ గురువారం ఉదయం బల్దియా ప్రధాన కార్యాలయం లో బాధ్యతలు చేపట్టారు.మే 6 వ తేదీ తో పాలక వర్గ సభ్యుల పదవి కాలం ముగియడం తో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు హన్మకొండ జిల్లా కలెక్టర్ జిడబ్ల్యుఎంసి ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.అనంతరం వివిధ విభాగాల ఉన్నతాధికారుల తో ఏర్పాటు చేసిన సమావేశం లో కలెక్టర్ పాల్గొని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించి పలు ముఖ్యమైన ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, త్వరితంగా టెండర్ ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభించాలని తెలిపారు.పనుల అమలులో జాప్యం లేకుండా వేగవంతమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట వెంటనే స్పందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. టెండర్లు, ప్రాజెక్టు ప్రతిపాదనలు, మంజూరైన నిధుల వినియోగం వంటి అంశాల్లో పారదర్శకతతో పాటు సమర్థవంతమైన అమలు ఉండాలని సూచించారు.పెద్ద ఎత్తున అభివృద్ధి ప్రాజెక్టులు త్వరలో ప్రారంభం కానున్నాయని, వాటి ద్వారా నగరానికి మరింత మౌలిక సదుపాయాలు అందుతాయని తెలిపారు. ముఖ్యంగా రహదారులు, పారిశుద్ధ్యం మౌలిక వసతుల అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం లో ప్రజా ఫిర్యాదులకు తక్షణం స్పందించి పరిష్కరించాలని, ఫైళ్లు ఎక్కడా నిలిచిపోకుండా వేగంగా పరిష్కరించాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. టాక్స్ కలెక్షన్ నిర్వహణ వ్యవస్థలను క్రమబద్ధీకరించాలని, సుమారు రూ. 100 కోట్ల విలువైన పెద్ద ప్రాజెక్టులు వేగంగా అమలు అయ్యేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, సమ్మయ్య, ఎం హెచ్ ఓ డా.రాజేష్, ఈ ఈ లు రవి కుమార్, సంతోష్ బాబు,మహేందర్, మాధవి లత తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల టార్గెట్లను పూర్తి చేయాలి



**తెలకపల్లి, మే 9 (జనం సాక్షి) :** గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఇచ్చిన పనుల టార్గెట్లను వేగవంతంగా పూర్తి చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా డి ఆర్ డి ఓ చిన్న ఓబులేష్ అన్నారు గురువారం మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామంలో జరుగుతున్న ఫీడర్ ఛానల్, నర్సరీ, పశు వుల పాక నిర్మాణం, ఈత ప్లాంటేషన్ వంటి ఉపాధి హామీ పనులను వారు పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడి పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు తీసుకున్న పనులకు తొందరగా వచ్చి టార్గెట్ ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనులపై మండల అధికారులకు సిబ్బందికి ఉపాధి పిల్లలకు తగు సూచనలు చేశారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ బుగ్గ స్వామి, ఏపీవో మల్లేష్, టి ఏ సత్యనారాయణ,పంచాయతీ కార్యదర్శి రాజు,ఫీల్డ్ అసిస్టెంట్, మేట్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## ఘట్‌కేసర్‌లో తాగునీటి సమస్య తీవ్రం



**ఘట్‌కేసర్, మే 7 (జనం సాక్షి) :** ఘట్‌కేసర్ పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యపై బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు కొమ్మిడి మహిపాల్ రెడ్డి అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం పట్టణంలోని పలు డివిజన్లలో నీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. వినతి పత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం, మున్సిపల్ పరిధిలోని కొన్ని ప్రాంతాలకు నాలుగు నుంచి ఐదు రోజులకోసారి మాత్రమే నీటి సరఫరా జరుగుతోందని తెలిపారు. ముఖ్యంగా వేసవి కాలంలో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రెండు రోజులకోసారి నీటి సరఫరా జరుగుతున్న ప్రాంతాల్లో సరఫరా సమయాన్ని పెంచాలని, అలాగే 6, 7 డివిజన్లలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని వినతిలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కొమ్మిడి మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల ప్రాథమిక అవసరమైన తాగునీటిని అందించడంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో నీటి సరఫరాపై తక్షణ చర్యలు అవసరమని తెలిపారు.

## మోడీ సభ విజయవంతం చేయాలి



**రాజేంద్రనగర్, మే 7 (జనం సాక్షి) :** మణికొండ డివిజన్ పరిధిలోని నేక్నాపూర్‌లో భాజపా ఆధ్వర్యంలో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం భాజపా అధ్యక్షుడు రవికాంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగగా, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్ కుమార్ గౌడ్ హాజరై మాట్లాడారు. ఈనెల 10వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ప్రధాని మోదీ మధ్యాహ్నం 3 గంటలకు సభా ప్రాంగణానికి విచ్చేస్తున్న నేపథ్యంలో మణికొండ డివిజన్ నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, పార్టీ కార్యకర్తలు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు సభా ఏర్పాట్లు, కార్యకర్తల సమన్వయం, ర్యాలీలు, ప్రజా భాగస్వామ్యంపై సమావేశంలో చర్చించారు.నాయకులు మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రధాని మోదీ చేస్తున్న సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీరప్ప, యువ మోర్చా నాయకులు, మహిళా నాయకురాళ్ళు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కిషోర బాలికల సంఘాలు ఏర్పాటు చేయాలి




**నంగునూర్, మే 7 (జనం సాక్షి) :** ప్రతి గ్రామంలో కిషోర్ బాలికల సంఘాలు ఏర్పాటు చేయాలని ఏపీఎం శ్రీనివాస్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రమైన నంగునూరులోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో ఎంపీడీవో మహబూబ్ అలీ అధ్యక్షతన కన్వర్జెన్సీ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ ఏపీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ 14 నుండి 18 సంవత్సరాల బాలికలను 10మంది సభ్యులతో సంఘాలుగా ఏర్పాటు చేయాలని సూచించారు. బాలికలను సంఘాలుగా చేయడం వల్ల వారికి నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. సంఘాల్లో చేరిన సభ్యులకు ఆరోగ్యం పైన పోషకాహార లోపంపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. విద్య వృత్తి నైపుణ్యాల పైన శిక్షణ ఇవ్వడంతో పాటు సైబర్ క్రైమ్ బాల్య వివాహాలు మారకద్రవ్యాల పైన అవగాహన కల్పిస్తామని అన్నారు. ప్రభుత్వ పథకాలు, సదుపాయాలు, ఆర్థిక నిర్వహన, శారీరకు వ్యాయామం, బాలిక సాధికారత గురించి అవగాహన కల్పిస్తామని అన్నారు. సమాజంలో ఎదుర్కొనే వ్యక్తిగత సవాళ్ల కోసం అవగాహన కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. ప్రభుత్వం చేపట్టిన స్నేహ సమ్మర్ క్యాలెండర్ ను పంచాయతీ సెక్రటరీ గ్రామాల్లోని వివిధ శాఖల గ్రామ స్థాయి అధికారులు వివోఏలు విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లోని కిశోర బాలికలంతా సంఘాల్లో చేరాలన్నారు ఈ కన్వర్జేన్సీ మీటింగ్లో డాక్టర్ శివకుమార్ డాక్టర్ ఉదయ్ కుమార్ హెడ్ కానిస్టేబుల్ సంపత్ ఐసిడిఎస్ రజిత విద్యాశాఖ నుండి బాల మల్లు సేర్ప్ సీసీలు మండల సమైక్య అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సీఎంసీ పరిధిలో మెరుగైన సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి

- **ఉప కమిషనర్ శశిరేక**

**శేరిలింగంపల్లి, మే 7 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మియాపూర్ సర్కిల్ పరిధిలో ప్రజా సంక్షేమం కోరుతూ సమగ్ర పరిపాలన అందించడంలో భాగంగా మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకై తాము నిరంతరం ముందుకు సాగుతుంటామని మియాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ శశిరేఖ పేర్కొన్నారు. ఈ మేరకు హెచ్ సిటి ప్రాంతంలో గురువారం కార్పొరేషన్ పరిధి వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హెచ్ సిటి ప్రాంతంలో మౌలిక సదుపాయాలు, మెరుగైన రవాణా సౌకర్యాన్ని పునరుద్ధరించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆ దిశగా అధికారులతో పలు విషయాలను సమీక్షించి తదనుగుణంగా పలు నిర్ణయాలను తీసుకోవడం జరిగిందన్నారు. ప్రధానంగా హెచ్ సిటి పరిధిలో ఎస్ఎన్డిపి పథకం క్రింద



చేపడుతున్న పనుల పురోగతిని సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించడం జరిగిందని, వీలైనంత త్వరగా తగిన కార్యాచరణతో ఎస్ఎన్డిపి పథకం కింద కొనసాగుతున్న పనులను పూర్తి చేయడానికి అధికారులు ప్రత్యేక దృష్టిని సారించాలని ఆదేశించడం జరిగిందని కమిషనర్ వివరించారు. ఈ ప్రాంతంలో అక్కడక్కడ ఉన్న ఖాళీ ప్రదేశాలను పరిశీలించి వాటిని పరిరక్షించడానికి నిర్దిష్టమైన ప్రణాళికలను అమలు చేయడంతో పాటు ఆయా ఖాళీ ప్రదేశాలలో ఇంకుడు గుంతలను, సేంద్రీయ ఎరువుల తయారీ కోసం వినియోగించాల్సిందిగా ఆయా అధికారులకు సూచించడం జరిగిందని కమిషనర్ తెలియజేశారు. సర్కిల్ పరిధిలో నీటి నిల్వ ప్రదేశాలను ప్రత్యేకంగా గుర్తించి వాటర్ లాగింగ్ నిర్మూలనకు పటిష్టమైన చర్యలు చేపట్టాల్సిందిగా ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగం అధికారులను ఆదేశించడం జరిగిందని ఆమె మీడియాకు తెలిపారు. మియాపూర్ సర్కిల్ పరిధిలో వీధి కుక్కల ఇబ్బందులను, ఫుడ్ సేఫ్టీ నియమాలను కచ్చితంగా అమలు జరపాలని, అధికారులు ఎలాంటి అలసత్వాన్ని ప్రదర్శించిన పరిణామాలు మరోలా ఉంటాయని డిప్యూటీ కమిషనర్ హెచ్చరించారు.

# సౌర విద్యుత్‌తో రైతులకు చాలా మేలు

- **నంగునూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి**

**నంగునూర్, మే 7 (జనం సాక్షి) :** సౌర విద్యుత్ తో రైతులకు చాలా మేలు జరుగుతుందని నంగునూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతుల వారోత్సవాలలో భాగంగా విద్యుత్ మండలం అధికారుల ఆధ్వర్యంలో ఈ రోజు పాలమకుల గ్రామం లో సోలార్ వాడుక లాభాల గురించి ఏర్పాటు చెసిన అవగాహన సదస్సు లో ముఖ్య అతిధి గా పాల్గొన్న మాట్లాడారు. ప్రతి రైతు భావికి, ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్ అమరుచుకుంటే రైతులకు, ప్రజలకు చాలా లాభదయకం అని అన్నారు. తెలంగాణలో రైతుల కోసం సౌర విద్యుత్‌కు సంబంధించి 3 ప్రధాన పథకాలు ఉన్నాయి. పీఎం కుసుమం సోలార్ పవర్ ప్లాంట్లు రైతుకు లాభం బంజరు భూమిలో ప్లాంట్ పెట్టి విద్యుత్ అమ్ముకుని ఆదాయం పొందాలని పిలుపునిచ్చారు. ఇందిర సౌర గిరి జల వికాసం – సోలార్ పంపు సెట్లు గిరిజన రైతుల కోసంలబ్ధిదారులు2.10 లక్షల మంది గిరిజన రైతులకు సబ్సిడీ100% సబ్సిడీతో సోలార్ పంపు సెట్లను 6 లక్షల ఎకరాల పోడు భూముల్లో తోటల పెంపకానికి ప్రత్యేకంగా కరెంటు లేని అటవీ ప్రాంతాల్లో సౌరశక్తితో



సాగునీరుఆదర్శనంగా అచ్చంపేటలో మొదలు అయ్యింది త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడం కొరకు రైతులకు ప్రతేకంగా ప్రజా ప్రభుత్వం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గారు ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి డాక్టర్ వివేక్ వెంకట స్వామి గారు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమం లో విద్యుత్ డివిజన్ అధికారి మరియు మండల విద్యుత్ అధికారి, ఖుశీ శ్రీ చైతన్య ,సర్పంచ్ ఓజాలు, మండలం లో సర్పంచ్ లు, ముక్కెర లింగం యాదవ్, చేర్యాల వాణి రాధకృష్ణ, మహిపాల్ రెడ్డి, ఘనపూర్ సాయిలు,మరియు కాంగ్రెస్ నాయకులు భాస్వరాజు రాములు,పాక్స్ డైరెక్టర్ గంగుల రవి, వార్డ్ సభ్యులు స్వామి,మాజీ సర్పంచ్, ఎంపీటీసీ లు ఏళ్ళ రవీందర్ రెడ్డి, తులసి, రాజు కృష్ణ లు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**యాలాల, మే 7 (జనంసాక్షి) :** వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని తాండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు పేర్కొన్నారుఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం యాలాల మండల్ కేద్రం ఐకేపీ సెంటర్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని తాండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు ప్రాభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారీ బారిన పడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివయ్య,వికారాబాద్ జిల్లా మాజీ కో-అప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబ ,గ్రామ ఉప సర్పంచ్ మల్కిరెడ్డి శోభ రాజు రెడ్డి ,యాలాల మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైపాల్,డైరెక్టర్ ఉదయ్ భాస్కర్ రెడ్డి, డైరెక్టర్ మొగులాప్ప,హన్మంతు,కార్యదర్శి హైమద్, మాజీ ఎంపీటీసీ మలాప్ప, వడ్ల శ్రీనివాస్, అధికారులు,డ్వాక్రా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాప్య పింఛన్లు రాక వృద్ధులు ఆందోళన



**మల్దకల్, మే 7 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఉలిగేపల్లి గ్రామంలో వృద్ధాప్య పింఛన్లు రాక పింఛన్దారులు ఆందోళన చెందుతున్నారు.గురువారం ఉలిగేపల్లి గ్రామంలో ప్రతి నెల పంపిణీ చేయాల్సిన వికలాంగులు,ఒంటరి మహిళలు, వృద్యాప్య, వితంతువు పింఛన్లు ఆలస్యం కావడంతో మహిళ వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.బిజ్వారం సబ్ పోస్ట్ ఆఫీస్ నుండి గ్రామ పరిధిలోని దాసరిపల్లి, మేకల్ సోంపల్లి,ఉలిగేపల్లి గ్రామాల చెందిన పింఛన్దారులు దాదాపు 7 రోజులు కావస్తున్న నేటి వరకు అందకపోవడంతో వారు చేసిన అప్పులు ఖర్చులకు డబ్బులు లేకపోవడంతో వయోవృద్ధులు తీవ్ర ఇబ్బందులకు అష్ట కష్టాలు పడుతున్నారు.గత నెల పంపిణీ చేయాల్సిన పింఛన్లు ఇంతవరకు పంపిణీ చేయకపోవడంతో డబ్బు కొరత ఉండడంతో పంపిణీ చేయలేకపోయామని అధికారులు అంటున్నారు. ఉలిగేపల్లి గ్రామంలో పూర్తిస్థాయిలో పింఛన్లు పంచలేదు. పింఛన్దారులకు ఇచ్చే 2016 రూపాయలు, వికలాంగులకు 4016 రూపాయలు పైన ఉన్న చిల్లర పైసలు ఇవ్వకుండా మిగతా డబ్బులు ఇస్తున్నారని వయోవృద్ధులు ఆరోపిస్తున్నారు.ఇది గత కొంతకాలంగా కొనసాగుతున్నప్పటికీ అధికారులకు తెలిసిన వారు ఏమి పట్టించుకోవడంలేదని, కొన్ని గ్రామాల్లో పది రూపాయలు మరికొన్ని గ్రామాల్లో ఆరు రూపాయలు చొప్పున మరికొన్ని గ్రామాల్లో 16 రూపాయలు పూర్తిగా నొక్కేస్తున్నారు. ఈ విషయాన్ని పింఛదారలు పింఛన్దారులు పోస్ట్ ఆఫీస్ సిబ్బందిని అడిగితే తమ దగ్గర చిల్లర లేదని ఎవరు చెప్పుకుంటారు చెప్పుకోండి అంటూ దాబాయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే గ్రామాలలో పింఛన్దారులకు ప్రతినెల ఒకటో తేదీన ఇవ్వాలని, డబ్బులు కోత కోస్తున్న తిరిగి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## రైతులకు రాజకీయాన్ని రుద్దొద్దు

- **కొనుగోలు కేంద్రం ఏర్పాటులో సర్పంచిది నిర్లక్ష్య ధోరణి**
- **వరి ధాన్యం కల్లాలను సందర్శించిన రైతు సంఘం నాయకులు**



**హత్నూర, మే 7 (జనం సాక్షి) :** కొనుగోలు కేంద్రం ఏర్పాటులో గ్రామ సర్పంచి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతు సంఘం నాయకులు ఆరోపించారు.మండలంలోని రొయ్యపల్లి గ్రామంలో గల రైతులను గురువారం వారు సంప్రదించి వరి ధాన్యం కల్లాలను సందర్శించారు.కొనుగోలు కేంద్రాన్ని వీలైనంత త్వరగా ఏర్పాటు చేసి ధాన్యం సేకరించని యెడల రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశాముందని వారన్నారు.గ్రామంలోని గత పాలకుల తప్పిదం వల్లే కొనుగోలు కేంద్రం లేకుండా పోయిందని ప్రస్తుత సర్పంచి మీన మేషాలు లెక్కించడం మానుకోవాలని వారు హితవు పలికారు.వీలైనంత త్వరగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని వారు సూచించారు.ఈ విషయం ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వారం రోజుల్లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కొందుర్గులో ఐపీఎల్ బెట్టింగ్ గుట్టురట్టు

- **ఆరుగురిపై కేసు నమోదు**
- **రూ. 5.5 లక్షల లావాదేవీలు గుర్తింపు**
- **ముగ్గురి ఫోన్లు స్వాధీనం**

**కొందుర్గు, మే 7 (జనంసాక్షి) :** ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని కొందుర్గు మండల కేంద్రంలో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఒక ముఠా గుట్టును షాద్‌నగర్ ఎస్వోటీ మరియు స్థానిక పోలీసులు రట్టు చేశారు. పక్కా సమాచారంతో యాప్ ల ద్వారా బెట్టింగ్ నిర్వహింస్తున్న ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.ఎస్సై రవీందర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం:కొందుర్గు గ్రామానికి చెందిన జాల నరసింహ అనే యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు మధ్యవర్తిత్వం వహిస్తు బెట్టింగ్ వేసే వారికి, యాప్‌లకు మధ్య ఏజెంట్‌గా వ్యవహరిస్తూ.. వచ్చే లాభాల్లో కొంత శాతం



కమిషన్‌గా తీసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు.నరసింహ ద్వారా ఈరపురం రఘునాథ్ గౌడ్, కోమరబండ శ్రీశైలం, యారం జోసఫ్ రెడ్డి, కుమ్మరి రమేష్, ఎండీ రషీద్ అనే వ్యక్తులు ఫోన్ పే ద్వారా డబ్బులు పంపిస్తూ గోల్డ్ 365, జియో ప్లే యాప్‌లలో బెట్టింగ్‌లు పెడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలిందని. వీరి ఖాతాలను పరిశీలించగా సుమారు 5,52,911 లక్షల రూపాయల మేర అక్రమ బెట్టింగ్ లావాదేవీలు జరిగినట్లు వెల్లడైందని నిందితుల వద్ద నుంచి మూడు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కొందుర్గు ఎస్ఐ రవీందర్ నాయక్ తెలిపారు.

# చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

**గట్టు, మే 7 (జనం సాక్షి) :** గద్వాల నియోజకవర్గం గట్టు మండల పరిధిలోని మిట్టదొడ్డి గ్రామంలో జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం లిమిటెడ్ఆధ్వర్యంలో రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో గద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు గట్టు పిఎసిఎస్ అధ్యక్షులు క్యామ వెంకటేష్,మండల మాజీ ఎంపీపీ జె. విజయ్ కుమార్ ఇక్కడ ఏర్పాటు చేసిన వరి ధాన్యము కొనుగోలు కేంద్రంను ప్రారంభించారు. గతంలో ఈ ప్రాంతంలో కరువు కాటకా లకు నిలయంగా ఉండేది కానీ గత పది సంవత్సరాల నుండి ఇప్పుడిప్పుడే రైతులు అభివృద్ధి చెందడం జరుగుతుంది. గతంలో కూడా రైతులు పండించిన వరి ధాన్యమును ప్రభుత్వమే కొనుగోలు చేసేది. ఈ ప్రభుత్వాలు వచ్చిన రైతుల సంక్షేమమే కోసంమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంలోనే మద్దతు ధర 2389/- రూపాయలు



కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. గట్టు మండల జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం లిమిటెడ్, మిట్టదొడ్డి ద్వారా వరి కొనుగోలు కేంద్రంలో ఏర్పాటు చేశారు. కొనుగోలు చేసిన వెంటనే రెండు మూడు రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులు నమోదు కావడం జరుగుతుంది. రైతులకు వరి కొనుగోలు కేంద్రంలో వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా గన్ని బ్యాగుల కొరత లేకుండా అన్ని విధాలుగా ఏర్పాటు చేశామని తెలిపారు.వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిదానంగా తమ పండించిన పంటను ధాన్యము కొనుగోలు కేంద్రంలో అమ్మి కొనుగోలు కేంద్రానికి సహకరించాలని కోరారు. రైతులకు ఎమ్మెల్యే సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిట్టదొడ్డి సర్పంచ్ పార్వతమ్మ, చాగదోన సర్పంచ్ విరేష్ స్వామి, ముచోనిపల్లి సర్పంచ్ గోవిందమ్మ వీరాంజనేయులు, సింగిల్ విండో డైరెక్టర్లు మహేశ్వర్ రెడ్డి, తిమ్మప్ప, మాజీ సర్పంచులు నర్సింలు షడ్రిక్, అంతంపల్లి సర్పంచ్ శంకరమ్మ, దానప్ప తుమ్మలపల్లి రవి నాయుడు, మాజీ ఎంపీటీసీలు కే నాగరాజు ,సునందు నాయకులు సోమశేఖర్, శివప్ప, రంగన్న, పోతుల తిమ్మప్ప, లింగన్న, నర్సింలు తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.




స్వచ్ఛందంగా వైదొలిగే వారికి

# మైక్రోసాఫ్ట్ ఆఫర్

### హెల్త్‌కేర్, స్టాక్ బెనిఫిట్స్..

**వాషింగ్టన్:**కృత్రిమ మేధపై విస్తృతంగా దృష్టిసారిస్తోన్న టెక్ కంపెనీలు ఈ ఏడాది కూడా ఉద్యోగుల కోతలను కొనసాగిస్తున్నాయి. ఈ క్రమంలోనే అమెరికా టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ సంస్థలో సుదీర్ఘకాలంగా ఉన్న ఉద్యోగుల కోసం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ అవకాశాన్ని తీసుకొచ్చింది. ఈ ఆఫర్‌ను ఎంచుకునేవారికి మంచి ప్యాకేజీని కూడా ప్రకటించింది. ఇందులో హెల్త్‌కేర్ కవరేజీతో పాటు నగదు చెల్లింపులు, స్టాక్ ప్రయోజనాలను కల్పిస్తోంది.మైక్రోసాఫ్ట్ 50 ఏళ్ల చరిత్రలో స్వచ్ఛంద ఉద్యోగవిరమణ ప్రోగ్రామ్‌ను తీసుకురావడం ఇదే తొలిసారి. ఈ ప్రణాళిక గురించి కంపెనీ గత నెలలోనే వెల్లడించగా.. అందుకు సంబంధించిన పూర్తి వివరాలు తాజాగా బయటికొచ్చాయి. ఉద్యోగి వయసు, సర్వీసు కలిపి 70 ఏళ్లు దాటినవారు ఈ ఆఫర్‌ను వినియోగించుకోవచ్చు. అంటే.. ఉదాహరణకు ఉద్యోగి వయసు 50 ఏళ్లు ఉండి.. 20 ఏళ్లుగా కంపెనీలో పనిచేస్తున్నట్లయితే ఈ ఆఫర్‌కు అర్హులు. ఇలాంటివారు తమ కంపెనీలో 7శాతం మంది ఉన్నట్లు మైక్రోసాఫ్ట్ గతంలో వెల్లడించింది. 2025 జూన్ నాటికి అమెరికాలో సంస్థకు 1,25,000 మంది ఉద్యోగులున్నారు. అంటే 8,750 మందికి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ అర్హత ఉన్నట్లు లెక్క. ఈ ఆఫర్‌ను ఉపయోగించుకునే వారికి పలు ప్రయోజనాలు లభించనున్నాయి. స్వచ్ఛంద పదవీవిరమణకు అంగీకరించే ఉద్యోగులకు ఐదేళ్ల పాటు కంపెనీ ఆరోగ్య సంరక్షణ అందివ్వనుంది. ఉద్యోగి సీనియార్టీ, ఎంతకాలం కంపెనీలో కొనసాగుతున్నారు? అనే అంశాలను ఆధారంగా చేసుకొని ఏకమొత్తంలో స్వచ్ఛంద ఉద్యోగవిరమణ భత్యాన్ని ఇవ్వనుంది. వీటితో పాటు స్టాక్ సంబంధిత ప్రయోజనాలను కూడా కల్పించనుంది. అర్హత కలిగిన ఉద్యోగులు 30 రోజుల్లోగా తమ నిర్ణయాన్ని వెల్లడించాలని కంపెనీ సూచించింది. ఈ ప్రోగ్రామ్ కోసం మైక్రోసాఫ్ట్ దాదాపు 900 మిలియన్ డాలర్లను కేటాయించింది.ఇక, మైక్రోసాఫ్ట్ త్వరలోనే లేఆఫ్‌లను కూడా ప్రకటించే అవకాశం ఉంది. రానున్న నెలల్లో ఉద్యోగుల కోతలు ఉండొచ్చని ఇటీవల సంకేతాలిచ్చింది. కొత్త నియామకాల విషయంలోనూ నెమ్మదిగానే ముందుకెళ్లే యోచనలో ఉన్నట్లు తెలిపింది. ఏఐ (కృత్రిమమేధ) పెట్టుబడులు, వ్యయనియంత్రణపై మరింతగా దృష్టిసారిస్తుండటం వల్లే.. కంపెనీ ఈ తొలగింపులు చేపట్టనున్నట్లు సమాచారం.




# స్వల్ప నష్టాల్లో సూచీలు



**ముంబై:**దేశీయ మార్కెట్లు గురువారం స్వల్ప నష్టాల్లో ముగిశాయి పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ముడి చమురు ధరలు పెరగడం, విదేశీ సంస్థాగత మదుపర్లు అమ్మకాలు కొనసాగించడం వంటి కారణాలతో సూచీలు ఊగిసలాటకు గురయ్యాయి. అంతర్జాతీయ పరిణామాలతో అప్రమత్తత పాటించిన మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడమూ ఓ కారణమైంది.నేటి ట్రేడింగ్ ఆరంభంలో సెన్సెక్స్ 78,339 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,958 పాయింట్లు) ప్రారంభమైంది. ఒక దశలో 78,384 గరిష్ఠానికి.. 77,713 కనిష్ఠానికి చేరింది. చివరకు 114 పాయింట్ల నష్టంతో 77,844 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 24,326 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 25 పైసల మేర కోలుకొని, 94.24కు చేరింది. నిఫ్టీ సూచీలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, బజాజ్ ఆటో, ఎంఅండ్‌ఎం, గ్రాసిమ్, ఎన్టీపీసీ షేర్లు రాణించగా.. హెచ్‌యూఎల్, టీసీఎస్, టెక్ మహీంద్రా, టైటాన్ కంపెనీ, ఐటీసీ షేర్లు నష్టపోయాయి. ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయన్న అంచనాలతో బ్రెంట్ ముడి చమురు ధర తగ్గడం కలిసొచ్చింది. దీంతో ఉదయం లాభ నష్టాల మధ్య ఊగిసలాడిన సూచీలు.. చివరి గంటలో దూసుకెళ్లాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 69 పైసలు లాభపడి 94.49 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 101.3 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, షాంఘై, హాంకాంగ్, జపాన్ సూచీలు రాణించాయి. ఐరోపా మార్కెట్లూ సానుకూలంగా కదలాడాయి.బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.5.99 లక్షల కోట్లు పెరిగి, రూ.472.80 లక్షల కోట్ల (4.97 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 77,424.36 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,017.79 పాయింట్లు) సానుకూలంగా ప్రారంభమైంది. ఒక దశలో 76,773.25 పాయింట్ల కనిష్ఠాన్ని నమోదు చేసిన సూచీ, చివరి గంటలో లభించిన కొనుగోళ్లతో 78,022.78 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 940.73 పాయింట్ల లాభంతో 77,958.52 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 298.15 పాయింట్లు పెరిగి 24,330.95 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,356.50–23,997.90 పాయింట్ల మధ్య కదలాడింది.సెన్సెక్స్ 30 షేర్లలో 21 లాభపడ్డాయి. ఇండిగో 6.60%, ట్రెంట్ 3.91%, ఏషియన్ పెయింట్స్ 3.56%, ఎస్‌బీఐ 3.38%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3.11%, ఎటర్నల్ 2.98%, యాక్సిస్ బ్యాంక్ 2.89%, ఎం అండ్ ఎం 2.75%, బజాజ్ ఫైనాన్స్ 2.32%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.31%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.24%, మారుతీ 2.19%, టాటా స్టీల్ 2.01% చొప్పున పెరిగాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.80%, ఎల్ అండ్ టీ 1.18%, పవర్‌గ్రిడ్ 1.11%, ఎన్‌టీపీసీ 1%, హెచ్‌సీఎల్ టెక్ 0.97%, ఇన్ఫోసిస్ 0.88% మేర నష్టపోయాయి. రంగాల వారీ సూచీలకొస్తే టెలికాం 2.94%, సేవలు 2.89%, పీఎస్‌యూ బ్యాంక్ 2.81%, స్థిరాస్తి 2.76%, బ్యాంకెక్స్ 2.64%, ప్రైవేట్ బ్యాంక్స్ 2.51%, ఆర్థిక సేవలు 2.47%, ఆరోగ్య సంరక్షణ 1.99% చొప్పున రాణించాయి. ఇంధన, ఎఫ్‌ఎంసీజీ, యుటిలిటీస్, విద్యుత్ రంగాలు డీలా పడ్డాయి.

## టీవీఎస్ ఐక్యూబ్‌లో కొత్త వేరియంట్

**దిల్లీ:** టీవీఎస్ మోటార్ కంపెనీ తమ విద్యుత్ స్కూటర్ ఐక్యూబ్‌లో కొత్త వేరియంట్‌ను విడుదల చేసింది. ఇప్పటివరకు ఉన్న 3.5 కిలోవాట్ అవర్ మోడల్ స్థానంలో టీవీఎస్ ఐక్యూబ్ ఎస్ 4.7 కిలోవాట్ అవర్ రానుంది. ఈ స్కూటర్ ధర రూ.1,37,142 (ఎక్స్–షోరూమ్). ఇందులో అమర్చిన 4.7 కిలోవాట్ అవర్ బ్యాటరీ ప్యాక్.. 5.9 హెచ్‌పీ శక్తిని, 33 ఎన్‌ఎం టార్క్‌ను అందిస్తుంది. ఒకసారి ఛార్జింగ్‌తో 175 కి.మీ. ప్రయాణించొచ్చని కంపెనీ తెలిపింది. దీని గరిష్ఠ వేగం గంటకు 82 కి.మీ.. కేవలం 4.3 సెకన్లలోనే 0–40 కి.మీ. వేగాన్ని అందుకోగలదు. పోర్టబుల్ ఛార్జర్‌తో 0 నుంచి 80% ఛార్జింగ్ కావడానికి సుమారు 4 గంటల సమయం పడుతుంది.



**గుడ్ల ధరలు**

హైదరాబాద్ ₹ 5.25 | వరంగల్ ₹ 5.27

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

₹ 1,38,700 (22 క్యారెట్లు) | ₹ 1,51,310 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,70,000

## పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ రద్దు

కాంగ్రెస్ 63 స్థానాలను గెలుచుకోగా, దాని మిత్రపక్షమైన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) 22 స్థానాల్లో విజయం సాధించింది. కేరళం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో తన మొదటి శాసనసభ పక్ష సమావేశాన్ని తిరువనంతపురంలో గురువారం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి అభ్యర్థిపై చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వి.డి. సతీసన్, కె. సురేష్, దీప్‌దాస్ మున్షీ సహా పలువురు సీనియర్ నేతలు కాంగ్రెస్ పార్టీ పరిశీలకులైన ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్‌లను కలిసేందుకు తిరువనంతపురం లోని తాజ్ హోటల్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపి కె.సురేష్ మీడియాతో మాట్లాడారు. ఈ చర్చలు కాంగ్రెస్ హైకమాండ్ ప్రక్రియలో ఒక భాగమని అన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కాంగ్రెస్‌కు మెజారిటీ వచ్చినా, రాకపోయినా సిఎల్ పి నేతను ఎంపికే చేసేందుకు కాంగ్రెస్ హైకమాండ్ పరిశీలకులను పంపుతుందని అన్నారు. ఇదే ప్రక్రియ కేరళలోనూ చేపట్టనున్నారని అన్నారు. హైకమాండ్ ఇద్దరు అత్యంత సీనియర్ నాయకులను, వర్కింగ్ కమిటీ సభ్యులను పరిశీలకులుగా నియమించిందని అ న్నారు. గతంలో కేరళ బాధ్యతలు చేపట్టిన, రాష్ట్ర రాజకీయాలపై అవగాహన ఉన్న సీనియర్ నేత ముకుల్ వాస్నిక్, ప్రస్తుతం ఏఐసీసీ కోశాధికారిగా ఉన్న అజయ్ మాకెన్లను పరిశీలకులుగా నియమించిందని అన్నారు. వారు ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, ఎమ్మెల్యేలు, ఇతర సీనియర్ నేతలతో చర్చలు జరపనున్నారని అన్నారు. చర్చల అనంతరం హైకమాండ్‌కు ఒక నివేదికను పంపనున్నాని చెప్పారు. ఆ నివేదిక ఆధారంగా, హైకమాండ్ సీనియర్ నాయకులతో చర్చించిన తర్వాత, ముఖ్యమంత్రి అభ్యర్థిపై తగిన నిర్ణయం తీసుకుంటారని అన్నారు.

**12న అసోంలో ప్రభుత్వ ఏర్పాటు**

అస్సాంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ ఘన విజయం సాధించింది. దీంతో అక్కడ వరుసగా మూడోసారి ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి రానుంది. మే 12న బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కొలువుదీరనుందని అస్సాం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి కోటా వెల్లడించారు. ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీతోపాటు, పలువురు కేంద్ర మంత్రులు, బిజెపి పాలిత ముఖ్యమంత్రులు, డిప్యూటీ సిఎంలు హాజరుకానున్నారు.

# జీడీపీ వృద్ధి అంతంతే

**2026-27లో నెమ్మదించొచ్చు**
**వికసిత్ భారత్ లక్ష్యానికి సంస్కరణలే కీలకం**
**ఎస్ అండ్ పీ గ్లోబల్ నివేదిక**




దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026–27)లో భారత జీడీపీ వృద్ధి రేటు 6.6 శాతానికి నెమ్మదించొచ్చని ఎస్ అండ్ పీ గ్లోబల్ పేర్కొంది. ఇంతకు ముందు జీడీపీ వృద్ధిని 7.1 శాతంగా సంస్థ అంచనా వేసింది. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇంధన, ఆహార భద్రత రంగాల్లో సంస్కరణలు అత్యంత కీలకమని తెలిపింది. 'ఇండియా ఫార్వర్డ్' పేరిట ఎస్ అండ్ పీ గ్లోబల్, క్రిసిల్ సంయుక్త నివేదికను వెలువరించాయి. ఇంధన సరఫరాలో అంతరాయాలు, పెరుగుతున్న చమురు–గ్యాస్ ధరలు, రూపాయి విలువలో హెచ్చుతగ్గుల వల్ల భారత్ తీవ్రమైన ఆర్థిక ఒత్తిళ్లను ఎదుర్కొంటోందని క్రిసిల్ ముఖ్య ఆర్థికవేత్త ధర్మకీర్తి జోషి తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభం ఇదే విధంగా కొనసాగితే శీతాకాలపు పంటలకు ఎరువుల కొరత ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇటీవల కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (ఎఫ్‌టీఏలు) ప్రయోజనాలను పొందాలంటే, భారత్ తన పోటీతత్వాన్ని పెంచుకోవడానికి మరిన్ని సంస్కరణలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను స్థిరంగా ఉంచడం వల్ల వినియోగదారులపై నేరుగా ప్రభావం పడనప్పటికీ, దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు పెరగడం వల్ల టోకు ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉంది. ఇంధన సరఫరాలో ఆటంకాలు ఎదురైనప్పుడు వాడుకోవడానికి వీలుగా ఒక సమగ్రమైన 'ఎనర్జీ స్టోరేజ్ పాలసీ'ని రూపొందించుకోవాలని సూచించింది. ప్రస్తు త పరిస్థితుల్లో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, భారత వృద్ధిపై కొంత ప్రభావం చూపుతోంది. అయినప్ప టికీ దీర్ఘకాలిక లక్ష్యాల కోసం అంతర్గత సంస్కరణలు కొనసాగించాలని నివేదిక స్పష్టం చేసింది.

**2026-27లో 0.6% తగ్గొచ్చు: ఏడీబీ**

పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026–27)లో భారత జీడీపీ వృద్ధి 0.6 శాతం మేర తగ్గి 6.3 శాతానికి పరిమితమయ్యే అవకాశం ఉందని ఏడీబీ ముఖ్య ఆర్థికవేత్త ఆల్బర్ట్ పార్క్ అంచనా వేశారు. చమురు, గ్యాస్ దిగుమతులపై భారత్ అధికంగా ఆధారపడినందున.. ద్రవ్యోల్బణం గణనీయంగా పెరగొచ్చని తెలిపారు. 2026–27లో ద్రవ్యోల్బణం 2.4 శాతం మేర పెరిగి 6.9 శాతానికి చేరుతుందని పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పార్క్ చెప్పారు. అయితే వచ్చే ఏడాది వృద్ధిపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడబోదని, ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకుంటుందని తెలిపారు. 2020 నుంచి అత్యంత వేగంగా పుంజుకుంటున్న దిగ్గజ వర్ధమాన ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతోందని మూడీస్ రేటింగ్స్ తెలిపింది. విదేశీ మారకపు నిల్వలు గణనీయ స్థాయిలో ఉండటంతో... కరెన్సీ ఒడుదొడుకులు, అంతర్జాతీయ అనిశ్చితులను తట్టుకునేందుకు తోడ్పడుతున్నాయని పేర్కొంది. పరపతి విధాన నిర్ణయాలపై స్పష్టత, ద్రవ్యోల్బణ అంచనాలు స్థిరంగా ఉండటం, అవసరమైనప్పుడల్లా మారకపు రేట్లను సర్దుబాటు చేసుకోగలగడం వంటి కారణాల వల్ల భవిష్యత్ కుదుపులను సమర్థంగా ఎదుర్కొనే స్థితిలో భారత్ ఉందని పేర్కొంది. అయితే అధిక రుణ భారం, ద్రవ్యలోటు వల్ల వెంటవెంటనే కుదుపులు ఎదురైనప్పుడు ప్రతిస్పందించే అవకాశాలు పరిమితంగా ఉంటాయని వివరించింది.



# హంటర్ హర్రర్

**బెంబేలెత్తిస్తున్న వైరస్**
**విహార నౌకలో కలకలం..**

కేప్ వెర్దె: అంటార్కిటికా ఖండం, అట్లాంటిక్ మహా సముద్రంలోని మారుమూల దీవులను సందర్శించడానికి 'ఎంవీ హోండియస్' క్రూయిజ్ నౌకలో బయల్దేరిన పర్యాటకులను 'హంటర్ వైరస్' బెంబేలెత్తిస్తోంది. నౌకలో 88 మంది పర్యాటకులు, 55 మంది సిబ్బంది ఉన్నారు. 22 దేశాలకు చెందిన వీరంతా గత నెల 1న దక్షిణ అమెరికాలోని అర్జెంటీనా నుంచి బయల్దేరారు. హంటర్ వైరస్ సోకడంతో ఇప్పటికే ముగ్గురు మరణించారు. మరి కొంత మందికి ఈ వైరస్ సోకిందని అనుమానిస్తున్నారు. ప్రస్తుతం అట్లాంటిక్ మహా సముద్రంలో ప్రయాణిస్తున్న ఈ నౌకలోని వారంతా క్వారంటైన్‌లో ఉన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా రంగంలోకి దిగింది. నౌకలోనే పరీక్షలు నిర్వహిస్తోంది. హంటర్ వైరస్ సోకిందన్న అనుమానంతో బుధవారం ముగ్గురు రోగులను అధికారులు నెదర్లాండ్స్‌కు తరలించారు. ఈ వైరస్‌కు వ్యాక్సిన్లు, మందులు లేవు. త్వరగా గుర్తించకపోతే ప్రాణాలు కోల్పోయే అవకాశం ఎక్కువ.

## డ్రగ్స్ కట్టడి చేయడమే తొలి ప్రాధాన్యం

ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక నుంచి యూనివర్సిటీలతోపాటు విద్యాసంస్థల్లో డ్రగ్స్ దొరికితే ఆ బాధ్యత యజమాన్యాలదేనని డీజీపీ సీవీ ఆనంద్ కుండబద్దలు కొట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జిల్లాల్లో అధికారులు డ్రగ్స్ కేసుల దర్యాప్తు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమైందన్నారు. జిల్లాల్లో డ్రగ్స్ కేసుల విచారణపై అధికారులకు ఈగల్ ఫోర్స్ ద్వారా శిక్షణ ఇస్తామని డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు.

## విహారయాత్ర కోసం వ్యక్తిగత రుణం..
# లాభమా, నష్టమా?

**హైదరాబాద్:**క్రెడిట్ స్కోరు మెరుగ్గా ఉన్నవారికి వ్యక్తిగత రుణాలు చాలా సులభంగా లభిస్తాయి. అనేక ఖర్చులకు నిధుల కొరత ఉన్నప్పుడు ఇవి ఎంత గానో ఉపయోగపడతాయి. ఉదాహరణకు విద్య, వివాహ ఖర్చులు, వైద్య ఖర్చులు, ఇంటి పునరుద్ధరణ, మరెన్నో ముఖ్యమైన విషయాలకు ఈ రుణాలు అండగా ఉంటాయి. కానీ, వ్యక్తిగత రుణం తీసుకోవడానికి ఇవి మాత్రమే కారణాలు కావు. వినోదం, ప్రయాణం వంటి ఇతర కారణాల కోసం కూడా వ్యక్తిగత రుణాలు తీసుకోవచ్చు.ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితం నుంచి కాస్త విరామం తీసుకుని, ప్రయాణాల ద్వారా స్వదేశం/విదేశంలో ప్రయాణించి పర్యటన అనుభవాలను ఆస్వాదించడానికి అర్హులే. ఒక అద్భుతమైన విహారయాత్రను ప్లాన్ చేసేటప్పుడు ఖర్చు అధికంగానే అవుతుంది. అటువంటి సందర్భాల్లో వ్యక్తిగత రుణం మీకు ఉపయోగపడుతుంది. చాలా మంది ఖర్చులు చాలా ఎక్కువగా ఉండే అంతర్జాతీయ పర్యటనకు వెళ్లినప్పుడు వ్యక్తిగత రుణాన్ని ప్రత్యేకంగా తీసుకుంటారు. అయితే, ప్రయాణ ఖర్చుల కోసం వ్యక్తిగత రుణాలను ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలు, నష్టాలతో పాటు, మీ ప్రయాణ ప్రణాళికలకు ఆర్థిక సాయం



పొందే ప్రత్యామ్నాయ మార్గాల గురించి తెలుసుకుందాం..ఖర్చులు: విహారయాత్రను ప్లాన్ చేస్తున్నప్పుడు, మీకు వివిధ ఖర్చులు ఎక్కువగానే ఉంటాయి. వీటిలో విమాన టికెట్లు, హోటల్ వసతి కీలకమైనవి. పర్యాటక ప్రాంతాల్లో ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి వెళ్లేటప్పుడు రవాణా ఖర్చులూ అధికంగానే ఉంటాయి. పర్యాటకులు.. సందర్శక స్థలాలను చూడటం, సాహస క్రీడలు, భోజనం, షాపింగ్ మొదలైన కార్యకలాపాల కోసం ఖర్చులు చెల్లించాల్సి ఉంటుంది. విహారయాత్ర కోసం వ్యక్తిగత రుణాన్ని తీసుకుని మీరు ఈ ఖర్చులన్నింటినీ ఎలాంటి ఇబ్బందులూ లేకుండా నిర్వహించవచ్చు.సులభంగా రుణం: వ్యక్తిగత రుణాలకు పూచీకత్తు అవసరం లేదు. అనేక రుణ సంస్థలు.. వ్యక్తిగత రుణాలు ఇచ్చేటప్పుడు వృత్తి, ఆదాయం, వయసును పరిగణనలోకి తీసుకుంటాయి. ఈ రుణం కోసం దరఖాస్తు చేసుకోవడం సులభమే. కేవలం కొన్ని ముఖ్యమైన పత్రాలు సమర్పిస్తే సరిపోతుంది. రుణ ఆమోదం కూడా వేగంగానే జరుగుతుంది. దీనివల్ల మీ కలల విహారయాత్రను ప్లాన్ చేయడానికి మీరు ఎక్కువ కాలం వేచి ఉండాల్సిన అవసరం ఉండదు. వ్యక్తిగత రుణానికి వడ్డీ రేట్లు.. క్రెడిట్ స్కోరుపై ఆధారపడి ఉంటాయి. మీరు రుణాన్ని తీసుకున్న తర్వాత, దాన్ని సమాన నెలవారీ వాయిదాలలో తిరిగి చెల్లించొచ్చు. అనేక ఔఃఈఅలు ఈ రుణాన్ని అనువైన తిరిగి చెల్లింపుల కాలపరిమితితో అందిస్తున్నాయి. ఇది మీ ఆర్థిక సౌకర్యానికి అనుగుణంగా రుణాన్ని తిరిగి చెల్లించడానికి వీలు కలుగుతుంది. మీ ఆర్థిక వ్యవహారాలపై ఒత్తిడి లేకుండా కలల విహారయాత్రను ఆస్వాదించడానికి వీలు కల్పిస్తుంది. అయితే, ఇలాంటి ఖర్చుల కోసం ఈఎంఐలు నెలవారీ ఆదాయంలో 5–10 శాతం దాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

**రుణాలు:** కొన్ని ఖర్చులకు రుణాలు అవసరమయినప్పటికీ, ప్రయాణాల కోసం రుణాలు తీసుకోవద్దని ఆర్థిక విశ్లేషకులు సలహా ఇస్తున్నారు. రుణాలు ఆశించేవారు జాగ్రత్త వహించాలని, కేవలం తప్పనిసరి ఖర్చులకే రుణాలు తీసుకోవాలని, విచక్షణతో కూడిన లేదా జీవనశైలి విలాసాల కోసం రుణాలు వద్దని వారు సూచిస్తున్నారు. మీరు ఇంటి పునరుద్ధరణకు లేదా అత్యవసర పరిస్థితికి డబ్బు అవసరమైనా, బ్యాంకు నుంచి లేదా ఫిన్‌టెక్ ప్లాట్‌ఫాం నుంచి గృహ రుణం పొందొచ్చు. అలాగని ప్రతిదానికీ రుణంపై ఆధారపడకూడదు. విహారయాత్ర లేదా విలాసవంతమైన వస్తువుల కొనుగోలు వంటి విచక్షణతో కూడిన ఖర్చుల కోసం వ్యక్తిగత రుణాలు తీసుకోవడం మంచిది కాదని ఆర్థిక విశ్లేషకుల మాట.పైగా ప్రయాణాలకు వ్యక్తిగత రుణం తేలికగా లభిస్తుండడంతో, ఒకేసారి పెద్ద మొత్తంలో రుణం తీసుకోవడానికి దారితీయవచ్చు. ఇది అనవసరంగా అనేక ఆర్థిక ఇబ్బందులకు కారణమవుతుంది. వ్యక్తిగత రుణం కోసం దరఖాస్తు చేయడం వల్ల మీ క్రెడిట్ రిపోర్ట్‌పై ఒక హార్డ్ ఎంక్వైరీ నమోదు అవుతుంది. రుణ ఆమోదం లభించకపోయినా లేదా అధికంగా రుణం తీసుకున్న అది మీ క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుంది. పైగా వ్యక్తిగత రుణాలపై వడ్డీ రేట్లు అన్ని బ్యాంకుల్లో ఒకేలా ఉండవు. కొన్ని ఆర్థిక సంస్థలు చాలా ఎక్కువ వడ్డీని వసూలుజేస్తాయి. ప్రాసెసింగ్ ఫీజు, ప్రీ–క్లోజర్ ఛార్జీలు ఉంటాయి.

**ప్రత్యామ్నాయాలు**

పొదుపు: ప్రయాణాలకు నిధులు సమకూర్చుకోవడానికి, మీ పొదుపును ఉపయోగించడమనేది అత్యంత బాధ్యతాయుతమైన మార్గాల్లో ఒకటి. రుణ ఊబిలో కూరుకుపోకుండా ఉండేందుకు, ముందుగానే ప్రణాళిక వేసుకుని, ప్రత్యేకంగా మీ ప్రయాణం కోసమే పొదుపు చేయడం ప్రారంభించడం మేలు. దానికి అనుగుణంగా బడ్జెట్ వేసుకోవడం, సరైన సమయంలో పెట్టుబడి పెట్టడం మిమ్మల్ని సరైన మార్గంలో ఉంచుతుంది. ప్రయాణం కోసం రుణం తీసుకోవడానికి బదులుగా, ముందుగానే చక్కగా ప్రణాళిక వేసుకుని, రికరింగ్ డిపాజిట్ ఖాతాలో 3, 5 ఏళ్లు పొదుపు చేయడం ద్వారా ఆ నిధులను పర్యటన ఖర్చులకు ఉపయోగించొచ్చు.

# బీజేపీ గూండాగిరిని ఖండిస్తున్నాం

- బిఆర్ఎస్ జోలికి వస్తే చూస్తూ ఊరుకోం
- బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలి
- బిఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్



**సిరిసిల్ల టౌన్ మే 7 (జనంసాక్షి) :** కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై జరిగిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని బిఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ అన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సిరిసిల్ల పర్యటన పేరుతో అక్రమ అరెస్టులు చేయించడం పూర్తిగా నియంతృత్వ ధోరణికి నిదర్శనమని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతులను పోలీసులతో అణచివేయాలని చూడడం దారుణమన్నారు. బుధవారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కె.టి. ఆర్ పై బండి సంజయ్ చేసిన అవమానకర వ్యాఖ్యలు, వ్యక్తిగత దూషణలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రాజకీయాల్లో సంస్కారం మరిచి వ్యక్తిగత దాడులకు దిగడం ఆయన అసలు స్వరూపాన్ని బయటపెడుతోందన్నారు. వెంటనే బండి సంజయ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈరోజు కరీంనగర్‌లో బీజేపీ గూండాలు గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయం పై దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని రవి గౌడ్ మండిపడ్డారు. కార్యాలయం పై దాడి చేయడమే కాకుండా అక్కడి వాహనాలను ధ్వంసం చేయడం వెనుక ఎవరి ప్రోద్బలం ఉందో ప్రజలకు స్పష్టంగా తెలుసన్నారు. బండి సంజయ్ ప్రోద్బలంతో శాంతియుతంగా ఉన్న కరీంనగర్‌ను గుండాగిరి కేంద్రంగా మార్చాలని చూస్తున్న బీజేపీ నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్యకర్తల జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని, ప్రాణాలు అడ్డుపెట్టి అయినా నాయకులను, కార్యకర్తలను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. బెదిరింపులకు భయపడేది బీఆర్ఎస్ కాదని, కబర్దార్ అంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టి శ్రీనివాస్ ఆరెల్లి వినయ్ కుమార్, సదుల శేఖర్, మల్యాలప్రవీణ్, సిరిమల్లె హరీష్, శశి,నారాయణ, రాజు, నరేష్, రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దళితులకు ఆలయ ప్రవేశం.. నిరాకరణ

- దుర్గమ్మ ఆలయానికి దూరంగా ఉంచిన దళితుల బోనాలు
- గ్రామంలో పోచమ్మ, పెద్దమ్మ, దుర్గమ్మ పండుగలు
- నేటికి గ్రామాలలో దళితుల పట్ల కొనసాగుతున్న కులవివక్ష
- సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం అనంతసాగర్‌లో వెలుగులోకి





**సిద్దిపేట బ్యూరో (జనంసాక్షి ) :** సమాజం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తున్నా గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా కులవివక్ష వెంటాడుతూనే ఉంది. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం అనంతసాగర్‌లో జరిగిన ఘటన మరోసారి స్పష్టం చేసింది. గ్రామంలో గత మూడు రోజుల క్రితం నిర్వహించిన పోచమ్మ, పెద్దమ్మ, దుర్గమ్మ పండుగల సందర్భంగా దళితుల పట్ల వివక్ష చూపిన ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. గ్రామంలోని దుర్గమ్మ ఆలయానికి దళితులు తీసుకు వచ్చిన బోనాలను ఆలయం వద్దకు తీసుకువచ్చిన తర్వాత చుట్టూ ప్రదక్షిణలు చేసిన తర్వాత ఆలయ ప్రాంగణంలో అనుమతించకుండా గ్రామ పెద్దలు అడ్డుకున్నారని దళిత సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించనీయకుండా దూర ప్రాంతంలోనే బోనాలు ఉంచాలని చెప్పడంతో దళిత కుటుంబాలు తీవ్ర మనస్తాపానికి గురయ్యాయి. దేవుడి ముందు అందరూ సమానమేనని చెప్పే కాలంలో ఇప్పటికీ తమను తక్కువచేసి చూడడం బాధాకరమని వారు వాపోయారు. గ్రామంలో జరిగే పండుగల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొంటున్నప్పటికీ, దళితులకు మాత్రం పూర్తి స్థాయిలో ఆలయ ప్రవేశం కల్పించకపోవడం వివాదానికి దారితీసింది. కొందరు గ్రామ పెద్దలు సంప్రదాయాల పేరుతో ఈ నిర్ణయం తీసుకున్నారని సమాచారం. అయితే ఇది రాజ్యాంగ విరుద్ధమని, మానవ హక్కుల ఉల్లంఘన అని దళిత సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఈ ఘటనపై స్థానిక అధికార యంత్రాంగం స్పందించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గ్రామాల్లో ఇంకా కొనసాగుతున్న కులవివక్షను నిర్మూలించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు కోరుతున్నారు.

## రైతుల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతా

**ఎడపల్లి సహకార సంఘం చైర్మన్ పోల మల్కారెడ్డి**

**ఎడపల్లి, మే 7 (జనంసాక్షి) :** రైతుల అభ్యున్నతి కోసం నిరతరం పాటు పడుతానని ఎడపల్లి సహకార సంఘం చైర్మన్ పోల మల్కారెడ్డి స్పష్టం చేశారు. గురువారం కోర్టు ఉత్తర్వుల మేరకు ఎడపల్లి సహకార సంఘం చైర్మన్‌గా పోల మల్కా రెడ్డి తిరిగి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల కోసం నిరంతరం కృషి చేయడంతో పాటు వారి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. నష్టాల బాటలో ఉన్న ఎడపల్లి సహకార సంఘాన్ని లాభాల బాటలో పయనించేందుకు పాలకవర్గ సభ్యులు పూర్తి సహకారాన్ని అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శి రాజారాం, సహకార సంఘం వైస్ చైర్మన్ అనిల్ రెడ్డి, డైరెక్టర్లు కృష్ణారెడ్డి, బర్ధిపూర్ ప్రవీణ్, పరిగె సుమన్, నగేష్, జోగ్గరి సుదర్శన్, రాంరెడ్డి, సాయిలు, పాల్గొన్నారు.

# ఎక్మామిడి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభం

- బడుగు బలహీన వర్గాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- ఆరు గ్యారంటీల అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే కాలే యాదయ్య



**నవాబుపేట, మే 07 (జనంసాక్షి):** చేవెళ్ల నియోజకవర్గం నవాబుపేట మండలం పరిధిలోని ఎక్మామిడి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ, తెలంగాణలో బడుగు బలహీన వర్గాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని, ఆరు గ్యారంటీలను సత్వరం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందించడం ద్వారా ప్రభుత్వం తన మాట నిలబెడుతోందన్నారు. గ్రామ సర్పంచ్ చిట్టిప్పు నర్మద మల్లారెడ్డి మాట్లాడుతూ, గ్రామంలోని పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, రెండవ విడతలో మరిన్ని ఇండ్లు అందజేస్తామని చెప్పారు. వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లారెడ్డి మాట్లాడుతూ, ఎక్మామిడి గ్రామంలోని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు ప్రయత్నాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహమ్మద్ రఫీక్, మాజీ పీఏస్ చైర్మన్ రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాథోడ్ గీతా సింగ్, ఈశ్వర్, దేవయ్య, అంగన్వాడీ టీచర్లు, మాజీ ఎంపీటీసీలు, యువజన సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**సైదాపూర్ మే 7 (జనం సాక్షి) :** సైదాపూర్ మండలం దుద్దెనపల్లి, వెన్నంపల్లి, రాయికల్ లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సెంటర్ ఇంచార్జిలు, రెవిన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులతో మాట్లాడి కొనుగోళ్ళ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాలు, తరుగు పేరుతో కోతలు పెట్టవద్దన్నారు. ముఖ్యంగా కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హమాలీ సమస్యను అదిగమించాలని, ఇతర ప్రాంతాల నుండి రప్పించాలని అన్నారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున సెంటర్ ఇంచార్జిలు, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. లోకల్ ట్రాక్టర్స్ ఓనర్లతో మాట్లాడి రవాణా సమస్య లేకుండా చూడాలని అన్నారు. ఎక్కువ మొత్తంలో కొనుగోళ్లు చేయాల్సి వస్తే అదనపు స్టోరేజ్ కోసం ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రజనీకాంత్,ఆర్డిఓ రమేష్ బాబు, తహసిల్దార్ గుర్రం శ్రీనివాస్ గౌడ్,ఎల్ ఎస్ సి ఎస్ పరిసరించార్జి కొత్త తిరుపతిరెడ్డి,డిటి విజయ్ కుమార్, ఫుడ్ ఇన్స్పెక్టర్ అన్వార్, సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.

# నిరుద్యోగులను నిండా ముంచారు

**అంబర్పేట్ మే 7 (జనం సాక్షి) :** యునైటెడ్ కింగ్‌డమ్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి 35.50 లక్షల రూపాయలు మోసం చేసిన ఇద్దరు నిందితులను అంబర్పేట్ పోలీస్ లు అరెస్టు చేశారు. పోలీస్ వివరాల ప్రకారం కొడాలి సాయి అలియాస్ కార్తీక్ (28 )సంవత్సరాలు ,మరియు కొడాలి రవికుమార్ (65 )సంవత్సరాలు ,అబ్దుల్లా పూర్ మెట్, నివాసులు వీరిద్దరూ నిరుద్యోగుల నుండి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసేవారు. ప్రధాన నిందితుడు కొడాలి సాయి అలియాస్ కార్తీక్ తనకు తాను ఆర్మీ మేజర్ గా పరిచయం చేసుకొని యూకే లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి బాధితుడు అనుమకొండ చంద్రశేఖర్ ను నమ్మించి దశలవారీగా ఫోన్ పే ద్వారా డబ్బులు వసూలు చేశాడు. అనంతరం ఉద్యోగం వీసా టికెట్లు ఇవ్వకుండా కాలయాపన చేశాడు తను మోస పోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.పోలీసుల దర్యాప్తులో నిందితుడు వివిధ శాఖల నుంచి తనకు మంచి సంబంధాలు ఉన్నాయని నమ్మబలికి ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేశానని ఒప్పుకున్నారు. నిందితుల నుండి సెల్ ఫోన్లు సిమ్ములు స్వాధీనం చేసుకుని న్యాయస్థానం ముందు హాజరు పరిచారు. తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. వీరిద్దరూ తండ్రి కొడుకులు కావడం విశేషం.



## రైతు సంక్షేమానికి కృషి చేస్తాం

- పిఏసిఎస్ చైర్మన్ ఎం.చంద్రారెడ్డి
- బాధ్యతలు చేపట్టిన చైర్మన్, డైరెక్టర్లు

**మొయినాబాద్, మే 07, జనంసాక్షి:** రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం ద్వారా కృషి చేస్తామని మొయినాబాద్ పిఏసిఎస్ చైర్మన్ ఎం.చంద్రారెడ్డి అన్నారు. హైకోర్టు తీర్పుతో గురువారం తిరిగి చైర్మన్గా బాధ్యతలు స్వీకరించారు. గత సంవత్సరం డిసెంబర్ 19న పిఏసిఎస్ చైర్మన్ పదవులు, పాలకవర్గం ముగియడంతో దాదాపు నాలుగు నెలల కాలం పాటు చైర్మన్, పాలకవర్గం లేకపోయింది. చైర్మన్ల పదవులు ముగియడంతో అప్పట్లోనే చైర్మన్లు అంతా ఎన్నికలు జరిగేంత వరకు కొనసాగించాలని కోర్టుకు వెళ్లడంతో హైకోర్టు తీర్పు ఇవ్వడం మూలానా తిరిగి నాలుగు నెలల తరువాత మళ్లి పిఏసిఎస్ చైర్మన్, డైరెక్టర్లుగా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ దర్గ మహేందర్లు మాట్లాడుతూ రైతులకు సేవ చేసే భాగ్యం మళ్లి లభించిందన్నారు. రైతుల అభివృద్ధే తమ ముఖ్య లక్ష్యమన్నారు. అన్నదాతలు దేశానికి వెన్నముక లాంటి వారని వారు వండిస్తున్న వంటలు ప్రజలకు ఎంతో ఆహారంగా అందుతున్నాయన్నారు. ప్రభుత్వ పరంగా వారికి అన్ని విధాలుగా సేవలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. మొయినాబాద్ పిఏసిఎస్ భవనం కోసం ప్రభుత్వానికి నివేధిక ఇవ్వడం జరిగిందని ప్రభుత్వం సహకరించి కృషి చేయాలని కొత్త భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ వైస్ చైర్మన్ దర్గ మహేందర్తో పాటు సీఈవో, డైరెక్టర్లు రాంరెడ్డి, రాఘవేందర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, పొద్దుటూరి యాదయ్య, ఎన్. గంగమ్మ, సోసైటీ అధికారులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లుల యజమానుల గుప్పిట్లో
# కొనుగోలు కేంద్రాలు

*రైతులను నిలువు దోపిడీ చేస్తున్న పట్టించుకోని అధికారులు*

**40 కేజీ బస్తాకు 3-4 కేజీల తరుగు**



**మక్తల్, మే 07 (జనంసాక్షి):** రైస్ మిల్లుల యజమానులు కొనుగోలు కేంద్రాలను తమ గుప్పిట్లో ఉంచుకుని రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సి.ఆర్. గోవింద్ రాజ్ విమర్శించారు. గురు వారం మక్తల్ మున్సిపల్ పరిధిలోని చందాపూర్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడిన ఆయన, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సిపిఎం దృష్టికి తీసుకెళ్లారు. 40 కేజీల బస్తా నుంచి 3 నుంచి 4 కేజీల వరకు తరుగు తీస్తున్నారని, నిబంధనల ప్రకారం 600 గ్రాములు మాత్రమే తీసుకోవాల్సిన నిర్వాహకు లు రైస్ మిల్లు యజమానులతో కుమ్మక్కై అదనపు ధాన్యం దోచుకుంటున్నారని ఆరోపించారు.

రైతులు ధాన్యం తెచ్చినా వారం రోజుల పాటు పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడిందని, గన్నీ బ్యాగుల కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గత సంవత్సరం లేవీ బకాయి పడ్డ రైస్ మిల్లుల యజమానులపై చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం కదలి రైతులను ఆదుకోవాలని, గన్నీ బ్యాగులు వెంటనే పంపిణీ చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని అధికారులను కోరారు. మే 11న నారాయణపేట్ జిల్లా కలెక్టరేట్ ముందు నిర్వహించే ధర్నాలో రైతులంతా అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ రోడ్డు ఎక్కిన కామ్రేడ్లు, రైతన్నలు

**వడ్లు, మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలి**



చేర్యాల (జనంసాక్షి) మే 07 : వడ్లు మొక్కజొన్నలను కొనుగోలు చేయడంలో రైతులను అధికారులు ఇబ్బందులకు గురి చేయడాన్ని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో గురువారం చేర్యాల వ్యవసాయ మార్కెట్ ఎదుట జాతీయ రహదారిపై రైతులతో కలిసి గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. కిలో మీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. చేర్యాల సీఐ బానోతు రమేష్ నాయక్ అక్కడికి చేరుకొని తహసీల్దార్ దిలీప్ నాయక్ తో మాట్లాడి త్వరితగతిన కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని నచ్చ చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ మాట్లాడుతూ.. రైతులు లక్షల్లో పెట్టుబడులు పెట్టి ఆరుగాలం కష్టపడి పండించిన వడ్లు, మక్కలు అమ్మకానికి చేర్యాల మార్కెట్ యార్డుకు తీసుకొచ్చి 20 రోజుల నుంచి నెల వరకు రాత్రింబవళ్లు కష్టపడి ఆరబోసి ఎండబెట్టిన ధాన్యానికి గన్ని సంచులు, తాలు పట్టె మిషన్లు అందుబాటులో లేవని రైతులను గత నెల రోజులుగా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ తాలు మిషన్లను ఆశ్రయించి గంటకు రూ. 1000 ఇవ్వాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. గన్ని సంచులు అందుబాటులో లేకపోవడంతో బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. మార్కెట్ లో జల్లి మిషన్లు, త్రాగునీరు, విద్యుత్ దీపాలు, పరదలు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ చెబుతున్నప్పటికీ కింది స్థాయి అధికారులు మాత్రం అందుకు విరుద్ధంగా పని చేస్తున్నారని మండిపడ్డారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రైతులను ఇబ్బందులు పెట్టకుండా తక్షణమే కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, మండల కోశాధికారి నంగి కనకయ్య, మండల కార్యవర్గ సభ్యులు సుంకోజు రజిత, పోనుగోటి శ్రీనివాస్ రెడ్డి, గూడెపు సుదర్శన్, తిగుళ్ల కనకయ్య, బింగి పోషయ్య, కర్రె పరమేష్, రైతులు ఉన్నారు.



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సిరిసిల్ల పర్యటన నేపథ్యంలో భాగంగా సిరిసిల్లలోని బి ఆర్ ఎస్ పార్టీ నాయకులతోపాటు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లను పోలీసులు ఈరోజు ఉదయం అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# కరీంనగర్‌ను రణరంగంగా మారుస్తున్నారా..?

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడి
- దాడి నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి: సర్దార్ రవీందర్ సింగ్
- ప్రజాస్వామ్యంపై దాడి అంటూ తీవ్ర ఆగ్రహం



**కరీంనగర్ టౌన్, మే 07 (జనంసాక్షి):** కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై జరిగిన దాడిని మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ తీవ్రంగా ఖండించారు. రాజకీయ విభేదాలు ఉండవచ్చని, కానీ కార్యాలయాలపై దాడులు చేసి వాహనాలను ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యానికి ముప్పు అని ఆయన అన్నారు. ఘటన అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన సర్దార్ రవీందర్ సింగ్, దాడి నిందితులను వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. "తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా ఇలాంటి ఘటనలు జరగలేదు. ఇప్పుడు కరీంనగర్‌లో గుండాయిజం, రౌడీయిజం పెరుగుతోంది" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయాలపై దాడులు చేసి ప్రజలను భయభ్రాంతులను చేస్తే పోలీసులు చూస్తూ ఊరుకోవడం సరికాదని, సాధా రణ ప్రజలకు రక్షణ ఎక్కడ ఉందని ప్రశ్నించారు.

దాడిలో గాయపడిన బీఆర్ఎస్ నాయకుడు, ఉద్యమకారుడు దూలం సంపత్‌ను రేనే హాస్పిటల్ లో పరామర్శించిన రవీందర్ సింగ్, ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలను దాడులతో భయపెట్టలేరని స్పష్టం చేశారు. ఇది కేవలం ఒక పార్టీపై దాడి కాదు, ప్రజాస్వామ్యంపై దాడి అని పేర్కొన్న ఆయన, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

# 'గుంట' నక్కల దందా

*సర్వే నం. 70లో యథేచ్ఛగా అక్రమ వెంచర్లు*

- పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్న రియల్టర్లు
- తక్కువ ధర అని నమ్మి కొంటే నిలువునా మునిగే ప్రమాదం




**కొందుర్గు మే 07 (జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలో అక్రమ వెంచర్ల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. నిబంధనలను తుంగలో తొక్కి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ కొందరు రియల్టర్లు సామాన్యులను నిలువునా మోసం చేస్తున్నారు. తాజాగా మండల తూర్పు శివారులోని సర్వే నంబర్ 70లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ వెంచర్ వెలుగులోకి వచ్చింది. నాలా (NALA) పన్ను చెల్లించకుండా, గ్రామ పంచాయతీ లేదా DTCP/HMDA అనుమతులు లేకుండానే ప్లాట్ల విక్రయాలు జరుగుతున్నాయి. నియమాల ప్రకారం వెంచర్ చేస్తే గ్రామ పంచాయతీకి భారీగా అభివృద్ధి రుసుము వసూలు అవుతుంది. కానీ ఈ అక్రమ వెంచర్ల వల్ల పంచాయతీకి రావాల్సిన లక్షలాది రూపాయల ఆదాయం నుంచి రియల్టర్లు తప్పించుకుంటున్నారు.

**అమాయకులకు ప్రమాదం**

తక్కువ ధర అని ఆశపడి ఈ 'గుంట' ప్లాట్లను కొనుగోలు చేస్తే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. అనుమతులు లేని ప్లాట్లలో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు రావు, ధరణిలో చిక్కులు ఎదురవుతాయి. స్థానికులు ఈ అక్రమ దందాపై జిల్లా అధికారులు తక్షణం స్పందించాలని, సర్వే నం. 70లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో మండల కేంద్రం చుట్టూ ఉన్న విలువైన వ్యవసాయ భూములు అక్రమ వెంచర్లుగా మారి, భవిష్యత్ అభివృద్ధికి ఆటంకం కలిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# మంత్రి కొండా సురేఖపై బోధన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



**బోధన్, మే 7 ( జనంసాక్షి ) :** భారతీయ జనతా పార్టీ బోధన్ పట్టణ శాఖ అధ్యక్షులు పసుపులేటి గోపి కిషన్ ఆధ్వర్యంలో బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్లో హిందువుల ఆరాధ్య దైవం రామచంద్రునిపై వ్యంగ్యంగా మాట్లాడిన తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పై బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గోపికిషన్ మాట్లాడుతూ, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అయినటువంటి కొండా సురేఖ హనుమకొండలో రాష్ట్ర మెగా రైతు మేళ కార్యక్రమంలో బిజెపి పార్టీపై హిందువుల ఆరాధ్య దైవమైన రాముడిపై వెంగ్య వాక్యాలు చేశారు జై శ్రీరామ్ అంటే డబ్బులు వస్తాయా పథకాలు వస్తాయా అంటూ మాట్లాడడం చాలా దురదృష్టకరం హిందూ దేవుళ్ళపై భక్తి, నమ్మకం లేనటువంటి వారు హిందూ దేవాదాయ శాఖ మంత్రిగా ఉండడం సిగ్గుచేటు మరి ఇతర ఏ దేవుళ్ళ పేరు తలుచుకుంటే డబ్బులు, పథకాలు వస్తాయో ఆమె చెప్పాలి ఇంత కూడా ఇంకిత జ్ఞానం లేని వాళ్లు ప్రజా ప్రతినిధులు ఎలా అవుతారు హిందువుల మనోభావాలను కించపరిచినందుకు కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న ఆమెను వెంటనే మంత్రి పదవి ఉండి తొలగించి హిందువుల భక్తి విశ్వాసాలను అవమానపరిచినందుకు ఆమెను కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేసి రాముడి గుడిలో ముక్కు నేలకు రాయించి క్షమాపణ కోరాలి ఇంకోసారి హిందూ దేవుళ్ల పై ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఆమెపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి బోధన్ భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు పసుపులేటి గోపి కిషన్ గారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు కోలిపాక బాలరాజు, సీనియర్ నాయకులు గుంత గంగాధర్, హనుమాన్లు చారి, మిర్జాపూర్ అరవింద్, పేర్కవెంకటేష్, బీజేవైఎం, పట్టణ అధ్యక్షుడు ఏనుగంటి గౌతమ్ గౌడ్ కార్యదర్శి స్వప్నిల్, కోశాధికారి పప్పుల వేణు, దుర్గాప్రసాద్, లో శ్రీ అనిల్, వినయ్, రాములు, రాజు,పడాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
8 మే 2026

# కరీంనగర్ నగర అభివృద్ధికి మహర్దశ

- మేయర్ అధ్యక్షతన ప్రశాంతంగా ముగిన అత్యవసర సర్వ సభ్య సమావేశం
- 1150 కోట్ల అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ప్రతిపాధనల ఎజెండా కు పాలకవర్గం ఏకగ్రీవ ఆమోదం




**కరీంనగర్ బ్యూరో, మే 7 (జనంసాక్షి) :** నగరాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దడమే లక్ష్యంగా కరీంనగర్ నగరపాలక సంస్థ అడుగులు వేస్తోంది. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అధ్యక్షతన కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ సమక్షంలో గురువారం రోజు నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో అత్యవసర సర్వ సభ్య సమావేశం జరిగింది. నగర అభివృద్ధే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాగస్వామ్యం తో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' పథకం కింద 1,150 కోట్ల నిధుల వినియోగంపై రూపొందించనున్న ప్రతిపాదనలకు పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతూ, తీర్మానం చేశారు. ఈ పథకం ద్వారా నగరంలో చేపట్టబోయే వివిధ ప్రాజెక్టుల ప్రతిపాదనల రూపకల్పన పై పాలకవర్గ సభ్యుల సలహాలు సూచనలు స్వీకరించి ప్రాజెక్టుల పై సుధీర్ఘంగా చర్చించి ప్రభుత్వానికి పంపె నివేదికలకు తీర్మాణం చేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వం నుండి భారీగా నిధులు సాధించి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ఈ పథకం ఒక గొప్ప అవకాశమని పేర్కొన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో ఈ నిధులను సాధించుకొని సమర్ధవంతంగా వినియోగించేలా చర్యలు తీస్కుంటామన్నారు. నగర ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద చేపట్టబోయే ప్రతి ప్రాజెక్టు పారదర్శకంగా, నాణ్యతతో సాగేలా చూస్తామని సమావేశంలో తెలిపారు. ప్రతిపాదిత ప్రాజెక్టుల మెరుగుదలకు పాలకవర్గ సభ్యులు ఇచ్చే సలహాలు, సూచనలను పరిగణన లోకి తీసుకుంటామని స్పష్టం చేశారు.

అర్బన్ చాలెంజ్ ఫండ్ పథకాన్ని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ త్వరలో ప్రకటించడంతో ఈ పథకం లో కరీంనగర్ నగరపాలక సంస్థ ను చేర్చేలా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. 1150 కోట్ల నిధులతో నగరాన్ని మరింత సుంధరంగా అభివృద్ధి చేసి విలీన గ్రామాల్లో మౌలిక వసతుల మెరుగుదలకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. కరీంనగర్ నగర అభివృద్ధి కి పాలకవర్గ సహకారం ఎంతో అవసరమని తెలిపారు. ఈ సమావేశంలో నగర కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, డిప్యూటీ కమీషనర్ ఖాధర్ మొహియుద్దీన్, వేణు మాధవ్, ఎస్.ఈ రాజకుమార్, ఈఈ సంజీవ్ కుమార్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# 102 ఏళ్ల వృద్ధురాలికి 'యశోద'లో అరుదైన శస్త్రచికిత్స

- మహిళా నడుం గాయానికి అరుదైన శస్త్రచికిత్స విజయవంతం
- యశోద హాస్పిటల్ ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స నిపుణుడు డా.వివేకానంద భీమిశెట్టి



**కరీంనగర్ బ్యూరో, మే 07 (జనంసాక్షి) :** వేములవాడకు చెందిన 102 ఏళ్ల వృద్ధురాలికి నడుము గాయానికి యశోద ఆసుపత్రుల ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స నిపుణుడు డా. వివేకానంద భీమిశెట్టి అరుదైన శస్త్రచికిత్స చేసి విజయాన్ని సాధించారు. గురువారం రోజు కరీంనగర్ యశోద హాస్పిటల్ లో విలేకరుల సమావేశంలో యశోద ఆసుపత్రుల ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స నిపుణుడు డా. వివేకానంద భీమిశెట్టి మాట్లాడుతూ... రోగికి కుడి నడుములో ఇంటర్ట్రోకాంటెరిక్ ఫ్రాక్చర్గా నిర్ధారణ అయింద ని, ఈ పరిస్థితి ముఖ్యంగా అధిక వయస్సు గల, శస్త్రచికిత్స ప్రమాదం ఎక్కువగా ఉన్న వ్యక్తులలో, గణనీయమై న సవాళ్లను కలిగిస్తుంద న్నారు. ఈ కేసును అత్యంత జాగ్రత్తగా, ఖచ్చితత్వంతో సమగ్ర ప్రణాళికతో నిర్వహించామని తెలిపారు. సమర్ధవంతమైన శస్త్రచికిత్స పద్ధతుల వలన, రోగిని శస్త్రచికిత్స తర్వాత మరుసటి రోజే నడవడానికి ప్రారంభించారు. రెండు వారాల్లోనే ఆమె రోజువారీ కార్యకలాపాలు చేసుకునేలా వేగంగా కోలుకుంది. శస్త్రచికిత్స అనంతరం రెండు నెలలకే రోగి అద్భుతమైన రికవరీ సాధించి, ప్రస్తుతం తన స్వగ్రామంలో స్వతంత్రంగా జీవిస్తోంది. ఇది శస్త్రచికిత్స సేవల సమర్థతతో పాటు ఆమె ధైర్యసాహసా లకు నిదర్శనం. ఈ కేసు అత్యంత ప్రమాదంలో ఉన్న వృద్ధి రోగులకైనా తొందరగా శస్త్రచికిత్స చేయడం నిపుణులైన ఆర్థోపెడిక్ సంరక్షణ అందించడం ఎంత ముఖ్యమో స్పష్టంగా చూపిస్తుంది. దీంతో వారు మళ్లీ సక్రమమైన స్వతంత్ర జీవితానికి చేరుకోగలుగుతారని ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స నిపుణుడు డా.వివేకానంద భీమిశెట్టి తెలిపారు.

## 12 లక్షల విలువైన బంగారం, వెండి స్వాధీనం

**వరుస దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు ఆటో డ్రైవర్లు అరెస్ట్ పోలీసులు పకడ్బందీ దర్యాప్తు**



**కరీంనగర్ టౌన్, మే 07 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లాలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి, సుమారు రూ.12 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులను స్వాధీనం చేసుకు న్నారు. పోలీసుల వివరాల ప్రకారం, తామ్మకల్ మరియు చింతకుంట ప్రాంతాలకు చెందిన ఎం.డి. మహమ్మద్ మరియు మహమ్మద్ మోయిన్ అనే ఇద్దరు ఆటో డ్రైవర్లు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గత సంవత్సరం (2025) జూలై నుంచి దొంగతనాలకు పాల్పడుతున్నారు. మొదట చొప్పదండి ప్రాంతంలో తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తించి తాళం పగులగొట్టి, బీరువాలో ఉన్న బంగారం, వెండి వస్తువులను అపహరించారు. అనంతరం విజయనగర్ కాలనీ, సిటీ ఫైన్ కాలనీ, బొమ్మకల్ ప్రాంతాల్లో మరో నాలుగు దొంగతనాలు చేశారు. దొంగిలించిన బంగారంలో కొంత భాగాన్ని కరీంనగర్‌లో గుర్తుతెలియని వ్యక్తులకు అమ్మి వచ్చిన డబ్బును జల్సాలకు ఖర్చు చేశారు. మిగిలిన బంగారం, వెండి, మొబైల్ ఫోన్లను అమ్మేందుకు నాందేడ్ వెళ్లాలని యోచించి రైల్వే స్టేషన్‌కు ఆటోలో చేరుకున్నారు.

వారి వద్ద నుంచి 7 తులాల 3 పాయింట్ల బంగారం, 90 తులాల వెండి, రెండు మొబైల్ ఫోన్లు, దొంగతనాలకు ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. వరుస దొంగతనాలను ఛేదించి ఆస్తులు స్వాధీనం చేసుకున్న పోలీసులను అధికారులు అభినందించారు.

### కరీంగర్ ప్రశాంత వాతావరణాన్ని

# చెడగొట్టాలని చూస్తే ఊరుకోం

- బీజేపీ-బీఆర్ఎస్ నాటకాలు, దాడులు ప్రజలను డైవర్ట్ చేస్తున్నాయి
- లా అండ్ ఆర్డర్ చేతిలోకి తీసుకుంటే కఠిన చర్యలు
- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్, మే 07 (జనంసాక్షి):** బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చీకట్లో రహస్య ఒప్పందాలు చేసుకుని ప్రజలను డైవర్ట్ చేస్తున్నాయని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. ఇటీవల జరిగిన మేయర్, కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికల్లో బీజేపీ-బీఆర్ఎస్ పరస్పరం సహకరించుకున్నాయని ఆరోపించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఒకరినొకరు తిట్టుకుంటూ, దాడులు చేసుకుంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనను బద్నాము చేసేందుకు నాటకాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టాలని చూస్తే ఊరుకోమని, లా అండ్ ఆర్డర్ చేతిలోకి తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేటీఆర్ అడ్డగోలు మాట్లాడుతున్నారని, ప్రభుత్వం మారినందుకు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. బీజేపీ-బీఆర్ఎస్ కలిసి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బద్నాము చేసే పనులు చేస్తున్నాయని తెలిపారు. జువెలరీ షాప్ రాబరీ కేసులో పోలీసులు పకడ్బందీగా దర్యాప్తు చేస్తున్నారని, కౌశిక్ రెడ్డి పోలీస్ వ్యవస్థను కించపరచడం మానాలని సూచించారు. కేటీఆర్ స్నేహితుల ఫామ్‌హౌస్‌లలో డ్రగ్స్ దొరికిన విషయాన్ని ప్రస్తావిస్తూ, కేటీఆర్‌ను కుటుంబ సభ్యులు ట్రీట్‌మెంట్ ఇప్పించాలని సూచించారు. కాంగ్రెస్ నేతలు తలుచుకుంటే బీజేపీ, బీఆర్ఎస్ నేతల వ్యవహారాలన్నీ బయటపెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, కార్పొరేటర్లు మల్లెపల్లి బుచ్చిరెడ్డి, సరిల్ల ప్రసాద్, టేల భూమయ్య, గంటా శ్రీనివాస్, జగన్ రెడ్డి, పర్వతాల మల్లేశం, వారాల నర్సింగం, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు తాజుద్దీన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి పోరాట స్ఫూర్తితో వనరుల దోపిడిని అడ్డుకుందాం

- కార్పొరేట్లకు దేశ సంపద దోచిపెడుతున్న ప్రభుత్వాలు
- అల్లూరి 102వ వర్ధంతి సందర్భంగా నివాళి
- రైతు-కూలీ సంఘం నాయకుల పిలుపు



**నిజామాబాద్ సిటీ, మే 07 (జనంసాక్షి):** మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు పోరాట స్ఫూర్తితో దేశంలో వనరులను ప్రభుత్వాలు కార్పొరేట్లకు దోచిపెడుతున్న దోపిడిని అడ్డుకోవాలని అఖిల భారత రైతు-కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వేల్పూర్ భూమయ్య పిలుపునిచ్చారు. మోపాల్ మండల కేంద్రంలో పి.వై.ఎల్ ఆధ్వర్యంలో కామ్రేడ్ అల్లూరి సీతారామరాజు 102వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ, బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తెల్లవారి పాలన మాకొద్దు అంటూ ప్రజా పోరాటం చేసిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు అయినా కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను విదేశీ, స్వదేశీ కార్పొరేట్లకు (ఆదానీ, అంబానీలు) దోచిపెడుతోందని తీవ్రంగా విమర్శించారు. పచ్చటి పొలాలు, భూములను కంపెనీ వ్యవసాయం పేరుతో అప్పగిస్తున్నారని, వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. అల్లూరి పోరాట స్ఫూర్తితో రైతాంగ, ప్రజా పోరాటాలు నిర్మించాలని, సామ్రాజ్యవాదం, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని యువతను, ప్రజలను పిలిచారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పి.వై.ఎల్ జిల్లా ఉపాధ్యక్షులు బి. నర్సయ్య మాట్లాడుతూ, ఆర్ఎస్ఎస్-బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల మధ్య చీలికలు సృష్టిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ద్యాప రవి, పి.వై.ఎల్ జిల్లా కార్యదర్శి బి. నర్సయ్య, అగ్గు చిన్నయ్య, కెంపు భూమయ్య, కెంపు గోవర్ధన్, కే. అశోక్, గంగమల్లు, కచ్చ గంగారాం, దండు మహేష్, తుంగపల్లి రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు

# దివ్యాంగులకు అండగా ఉంటాం

*అర్హులందరికీ త్వరలో ఉపకరణాలు అందిస్తాం*

- ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు సైకిల్ పంపిణీ చేస్తాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 7 (జనం సాక్షి) :** దివ్యాంగులకు అండగా ఉంటామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ భరోసా ఇచ్చారు.ఇండియన్ ఆయిల్ కంపెనీ లిమిటెడ్ సీఎస్ఆర్ కింద దివ్యాంగులకు రూ. 83 లక్షల విలువైన 813 ఉపకరణాలు అందించగా, జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం లోని సినారే కళామందిరంలో గురువారం నిర్వహించగా, ముఖ్య అతిథులుగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వినికిడి యంత్రాలు,బ్యాటరీ సైకిల్స్, సుగమ్య కేన్, స్మార్ట్ ఫోన్, ఇతర పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తుందని, దివ్యాంగుల కోసం రూ. 1600 కోట్లు వెచ్చిందని తెలిపారు. దివ్యాంగులకు ఇప్పటికే సహాయ పరికరాలు ఇచ్చామని, భవిష్యత్తులో అర్హులందరికీ ఇస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. ఎంతో మంది దివ్యాంగులు ఆత్మ స్థైర్యం, మనోధైర్యం తో ఎందరో జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. దివ్యాంగులకు అందరూ మద్దతుగా ఉండాలని, వారిలో స్ఫూర్తి నింపాలని పేర్కొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం ఇస్తున్నామని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలని, డ్రాప్ ఔట్ ఉండవద్దని తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈ మేరకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ ఏడాది కూడా సైకిల్‌లు ఇస్తామని, ఈ ఏడాది 15 వేలు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. దివ్యాంగులు సంక్షేమానికి కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులకు అభినందనలు తెలియజేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ..శిబిరంలో పంపిణీ చేసే ఉపకరణాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకొని మరింత ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ పిలుపు నిచ్చారు.సుగమ్య భారత్ స్వశక్త భారత్ లో భాగంగా దేశ నిర్మాణం, అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందించేందుకు జిల్లాలో ఆరు శిబిరాలు ఏర్పాటు చేశామని, వైద్య పరీక్షలు చేయించి అర్హులను గుర్తించామని తెలిపారు. ఈ ఉపకరణాలతో దివ్యాంగులకు ఎంతో మేలు చేకూరుతుందని వివరించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ లో 10 మంది దివ్యాంగులకు ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో యూడీఐడీ కేంద్రంలో అన్ని వసతులు కల్పించామని, వైకల్య నిర్ధారణ పరీక్షలు ప్రతి నెలా చేయిస్తున్నామని తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేములవాడలో మహా శివరాత్రి సందర్భంగా భక్తులకు హెల్ప్ డెస్క్, దివ్యాంగులకు వీల్ చైర్లు, సహాయం అందించామని గుర్తు చేశారు.సిరిసిల్లలోని డే కేర్ సెంటర్‌లో సేవలను దివ్యాంగులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారాణి, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ఐఓసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ వినీత్ కౌల్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సీఎస్ ఆర్ హెడ్ హైదరాబాద్ కైలాస్ కాంత్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జడ్పీ సీఈవో వినోద్ కుమార్ పాల్గొన్నారు.

# సభ వేదికపై సంబంధం లేని వ్యక్తులకు ప్రోటోకాల్?

## అధికారిక కార్యక్రమంలో భార్యకు బదులు భర్త.. తల్లికి బదులు కుమారుడు

- అధికారులు కుర్చీలు వేసి కూర్చోబెట్టడంపై పలువురు విమర్శలు
- నవాబ్ పేట మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈ ఘటన




**నవాబుపేట్ మే 7 (జనం సాక్షి) :** సభా వేదికపై (ప్రోటోకల్) సంబంధంలేని వ్యక్తులను అధికారులే కూర్చిలేసి కూర్చుండ పెట్టిన సంఘటన నవాబుపేట మండల కేంద్రంలో గురువారం రైతు వేడుకలో చోటుచేసుకుంది. ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా రైతు వారోత్సవాలను గురువారం నవాబ్‌పేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ అధ్యక్షులుగా స్థానిక సర్పంచ్ గాజులగూడెం నరసింహారెడ్డి ముఖ్య అతిథులుగా అత్తాపూర్ సర్పంచ్ సంతోష్ రెడ్డి, గుబ్బడిపత్తేపూర్ సర్పంచ్ తిమ్మారెడ్డిపల్లి సర్పంచ్ ప్రభాకర్ హాజరయ్యారు. అధికారికంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఎలాంటి పదవి లేకుండా తల్లి సర్పంచ్ అయితే కొడుకు, భార్య సర్పంచ్ అయితే భర్త హాజరు కావడం వారికి సభ వేదిక మీదే కుర్చీలు వేసి దర్జాగా అధికారులు కూర్చోబెట్టడం విమర్శలకు తావునీస్తోంది. చించల్‌పేట్ సర్పంచ్ భర్త అనంతరాములు, వట్టిమినపల్లి సర్పంచ్ కుమారుడు చంద్రశేఖర్ రెడ్డికి అధికారులు పిలిచి మరి సభ వేదికపై కుర్చీలు వేసి కూర్చోబెట్టడం ఇది చూసి రైతులు, పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యవసాయ అధికారి జ్యోతికి మండలంలో ఉన్న సర్పంచులు ఎవరు.. వాళ్ల పేరేమిటి. ఉన్నది మహిళల కాదా అనేది కూడా తెలియనట్లు తెలుస్తుంది. సభా వేదికపై సంబంధంలేని వ్యక్తులను కూర్చోబెట్టిన సంబంధిత అధికారులపై పైస్థాయి అధికారులు చర్యలు తీసుకుంటారా లేదా వదిలేస్తారా అనేది వేచి చూడాలి.

### ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఎంపీడీవోకు ఫిర్యాదు

**మంథని, ( జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని నాగపెల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న సమయంలో కూలీలను సమావేశానికి తరలించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యుడు బొమ్మ కంటి సతీష్ ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఉపాధి హామీ పనులు కొనసాగుతున్న సమయంలో 67 మంది కూలీలను పనులు నిలిపివేసి వ్యవసాయ శాఖ అధికారుల సమావేశానికి పంపించడం నిబంధ నలకు విరుద్ధమని ఆయన ఆరోపించారు. పని ప్రదేశంలో ఉండాల్సిన కూలీలను ఇతర కార్యక్ర మాలకు తరలించడం వల్ల పనులకు అంతరా యం కలిగిందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా అధికారులకు వినతిపత్రం అందజేసిన గ్రామ స్తులు, ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత పాటించాలని కోరారు.

# జనగణన నమోదులో అలసత్వం వద్దు : ఉప కమిషనర్ శశిరేఖ



**శేరిలింగంపల్లి మే 07 (జనంసాక్షి) :** ఈనెల 11 నుండి ప్రారంభం కానున్న నేషనల్ సెన్సస్ సర్వే కార్యక్రమం( జనగణన నమోదు ప్రక్రియ) విషయంలో ఇటు అధికారులు, అటు ఎన్యూ మరేటర్లు పకడ్బందీగా ముందుకు సాగాలని మియాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శశిరేఖ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం మియాపూర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమం లో భాగంగా ఆమె మాట్లాడుతూ.. ఈ సందర్భంగా ఈ మధ్యనే పలు దఫాలుగా ఎన్యూ మరేటర్లు, సూపర్వైజర్ గా శిక్షణను పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులతో కమిషనర్ ఇంటరాక్ట్ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనగణన నమోదు ప్రక్రియ మామూలు కార్యక్రమం కాదని, ఇది ఒక దేశం నిర్మాణం కోసం, మౌలిక సదుపాయాల కల్పన కోసం, అభివృద్ధి పరంగా చేపట్టాల్సిన చర్యలు, రచించాల్సిన ప్రణాళికల కోసం దేశవ్యాప్తంగా నిర్దేశించిన కార్యక్రమమని అభివర్ణించారు. ప్రతి ఉపాధ్యాయుడు జాతి నిర్మాణం, దేశ భవిష్యత్తులో క్రియాశీల పాత్ర పోషిస్తారని, అందుకే జనగణన నమోదు కార్యక్రమాన్ని సహజంగానే ఉపాధ్యాయులకు కేటాయిస్తుండడం జరుగుతుందన్నారు. ప్రతి ఎన్యూమరేటర్, సూపర్వైజర్ మూడు రోజులపాటు మంచి శిక్షణను తీసుకోవడం జరిగిందని, దానిని క్షేత్రస్థాయిలో అమలు పరచడం ద్వారా సెన్సెస్ ప్రక్రియను సమర్ధవంతంగా పూర్తి చేయవలసిందిగా కోరారు. ఇందులో భాగంగా శిక్షణ పొందిన ఎన్యూమరేటర్లకు, సూపర్వైజర్లకు సిఎంసి కమిషనర్ సంబంధిత ఉపకరణాల కిట్లను, గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఎంసి ఉన్నతాధికారులు, మియాపూర్ సర్కిల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలతో ఫీల్డ్ అసిస్టెంట్ సొంత పనులు

### వెలుగులోకి అక్రమాలు..?



**గన్నేరువరం, మే 7 (జనంసాక్షి):** ఉపాధి హామీ పనుల పేరుతో జరుగుతున్న అక్రమాలపై సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. గన్నేరువరం మండలంలోని ఖాసీంపేట గ్రామంకు చెందిన నలుగురు ఉపాధి హామీ కూలీలు.. ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీలతకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో మక్క కంకులు ట్రాక్టర్ లో లోడ్ చేస్తూ కనిపించారు. గురువారం ఉదయం ఉపాధి హామీ పనులకు హాజరైన ఈ కూలీలు.. ఉదయం ఏడు గంటలకు హాజరు నమోదు చేసిన అనంతరం, ప్రభుత్వ పనులకు బదులుగా ఫీల్డ్ అసిస్టెంట్ వ్యక్తిగత వ్యవసాయ పనుల్లో నిమగ్నమై నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పక్క సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న జనంసాక్షి రిపోర్టర్.. కూలీలు మక్క కంకులు లోడ్ చేస్తున్న దృశ్యాలను కెమెరాలో బంధించారు. వీడియో తీస్తున్నట్లు గమనించిన కూలీలు అక్కడికి నుంచి పరుగులు తీశారు. స్థానికుల ఆరోపణల ప్రకారం.. ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీలత ప్రతి సంవత్సరం ఉపాధి హామీ కూలీలను తన సొంత వ్యవసాయ పనులకు వినియోగిస్తున్నారని చెబుతున్నారు. అయితే అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నా యి. ఈ ఘటనపై గన్నేరువరం మండల అధికారులు ఎలా స్పందిస్తారు.. ఫీల్డ్ అసిస్టెంట్ పై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

# భారత రాజ్యాంగం సమాజ అభివృద్ధికి మార్గదర్శకం

- అంబేద్కర్ ఆశయాలతో సమాజ అభ్యున్నతి
- మహిళల సాధికారతకు అంబేద్కర్ చూపిన మార్గం ఆదర్శం : మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి




**హయత్‌నగర్, మే 07 (జనంసాక్షి):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం సమాజ అభివృద్ధికి మార్గదర్శకమని కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. నాగోల్‌లోని బండ్లగూడలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జిఎస్ఐ) సదర్న్ రీజియన్ కార్యాలయంలో జిఎస్ఐ సదర్న్ రీజియన్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు నిర్వహించారు. మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని, జిఎస్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని కొనియాడారు. ముఖ్యంగా మహిళల సాధికారతకు ప్రత్యేక అవకాశాలు కల్పించడంలో అంబేద్కర్ చూపిన దృక్పథం ఆదర్శమన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా రిజర్వేషన్లకు మార్గం సుగమం చేశారని తెలిపారు.

తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు మహిళా బిల్లుకు మద్దతు తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. తన సతీమణి కూడా మహిళల సాధికారత, సామాజిక చైతన్యం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. అంబేద్కర్ పేరుతో నిర్వహిస్తున్న విద్యా సంస్థల ద్వారా నిరుపేద కుటుంబాల పిల్లలకు విద్య అందిస్తున్నట్లు తెలిపారు. తన తండ్రి, మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి ప్రజల సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన విషయాన్ని గుర్తు చేస్తూ, అంబేద్కర్ ఆశయ సాధనకు తాను కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిఎస్ఐ సదర్న్ రీజియన్ డీడీజీ బి. అజయ్ కుమార్, ఏడీజీ విజయ్ విష్ణుపాంత్ మూగల్, డిక్కీ ఉమెన్స్ వింగ్ జాతీయ అధ్యక్షురాలు అరుణ దాసరి తదితరులు పాల్గొని అంబేద్కర్ సేవలను కొనియాడారు.

# చేపలవేటపై నిషేధంతో కొండెక్కిన ధరలు



**చెన్నై, మే7 (జనంసాక్షి) :** తమిళనాడు రాయపురం నియోజకవర్గంలోని కాశిమేడు ఫిషింగ్ హార్బర్‌లో చేపల ధరలు రెండింతలు పెరగడంపై మాంసాహారులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం చేపల వేట నిషేధం అమల్లో ఉన్నందు వల్ల సముద్ర గర్భంలోకి చేపల వేటకు మర పడవలు వెళ్లలేని పరిస్థితి. దీంతో రాయపురం, కాశిమేడు, పట్టిణంబాక్కం, కోవలం, నాగపట్టిణం, నాగూర్, పుదుకోట, రామనాథపురం, రామేశ్వరం తదితర సముద్రతీర జిల్లాల్లో వేల సంఖ్యలో మరపడవలు నిలిచిపోయాయి. అదే సమయంలో ఇంధనంతో పనిచేయని చిన్న నాటు పడవలు, ఫైబర్ బోట్లలో చేపల వేటలో పాల్గొనేందుకు అనుమతించారు. ఈ పడవల్లో సముద్రంలోకి వెళుతున్న మత్స్యకారులు తమ వలల్లో చిక్కిన చేపలు, రొయ్యలు, పీతలతో తీరానికి చేరుకుని వేలం ద్వారా విక్రయిస్తున్నారు. దీంతో చేపల మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతుంటాయి. సముద్రంలోకి వెళ్లి కాశిమేడు ఫిషింగ్ హార్బర్‌కు చెప్పుకోదగ్గ స్థాయిలో చేపలతో జాలర్లు తిరిగొచ్చారు. కిలో వంజరం రూ.1,500, బ్లాక్‌వవ్వాల్ రూ.1,200, వైట్‌వవ్వాల్ రూ.1,600, ఐవ్‌వవ్వాల్ రూ.1,900, పారై రూ.700, సంకర రూ.700, పీతలు రూ.600, రొయ్యలు రూ.500, టైగర్ రొయ్యలు రూ.1,400కు విక్రయించారు.

# మద్దతు లేఖలే అసలు సమస్య

- మెజార్టీ కోసం ప్రయత్నించని విజయ్
- గతంలోనూ అనేక రాష్ట్రాల్లో ఇదే సమస్య
- గవర్నర్ల విచక్షణ మేరకు నిర్ణయాలు



**చెన్నై, మే7 (జనంసాక్షి) :** తమిళనాట రాజకీయ అనిశ్చితి నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ.. స్పష్టమైన మెజార్టీ లేక తిప్పలు పడుతోంది. దీంతో ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. అయితే, గతంలోనూ పలు రాష్ట్రాల్లో హంగ్ వచ్చినప్పుడు. గవర్నర్ ఆదేశాలతో మైనార్టీ ప్రభుత్వాలు ఏర్పడిన సందర్భాలున్నాయి. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రిని నియమించే అధికారం గవర్నర్‌కు ఉంటుంది. ఒకవేళ హంగ్ ఏర్పడితే.. గవర్నర్ తన విచక్షణ మేరకు వ్యవహరించి సరైన అభ్యర్థిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తారు. అలా గత దశాబ్దంన్నర కాలంలో ఐదు రాష్ట్రాల్లో ఇలాంటి మైనార్టీ ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. ఇటీవలి కాలంలో ప్రభుత్వ ఏర్పాటులో అత్యంత నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నదంటే మహారాష్ట్రలోనే..! 2019లో దాదాపు 34 రోజుల పాటు అక్కడ హైడ్రామా నడిచింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ప్రభుత్వ ఏర్పాటుపై వచ్చిన విభేదాల కారణంగా దశాబ్దాల నాటి భాజపా-శివసేన కూటమి విచ్ఛిన్నమైంది. అనంతరం అప్పటి అవిభజిత నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత అజిత్ పవార్.. తన చిన్నాన్న శరద్ పవార్‌తో విభేదించి భాజపాతో చేతులు కలిపారు. అజిత్ వర్గం మద్దతు తీసుకుని ప్రభుత్వ ఏర్పాటుకు భాజపా నేత దేవేంద్ర ఫడణవీస్ ముందుకొచ్చారు. గవర్నర్ ఇందుకు సమ్మతించడంతో ఆ ఏడాది నవంబరు 23న ఫడణవీస్ సీఎంగా.. అజిత్ డిప్యూటీగా ప్రమాణం చేశారు. కానీ, ఈ ప్రభుత్వం మూడు రోజులకే కుప్పకూలింది. వ్యక్తిగత కారణాలతో భాజపాకు గుడ్‌బై చెప్పిన అజిత్ పవార్.. తిరిగి శరద్ పవార్ వద్దకు చేరుకున్నారు. అనంతరం అనూహ్యంగా కాంగ్రెస్, నాటి అవిభజిత శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ కలిసి 'మహా వికాస్ అఘాడీ'గా ఏర్పడ్డాయి. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలో ఈ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. 288 శాసనసభ స్థానాలున్న ఆ ఎన్నికల్లో భాజపాకు 105, శివసేనకు 56, ఎన్సీపీకి 54, కాంగ్రెస్‌కు 44 సీట్లు వచ్చాయి. 2018లో దక్షిణాది రాష్ట్రం కర్ణాటకలోనూ ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో మొత్తం 222 శాసనసభ స్థానాలుండగా.. ఆ ఎన్నికల్లో భాజపా 104 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్‌కు 80, జేడీఎస్‌కు 37 సీట్లు దక్కాయి. అయితే, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 113 సీట్ల మెజార్టీ మార్క్ ఎవరికీ రాలేదు. దీంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ నాటి గవర్నర్ వాజూభాయ్ వాలా.. భాజపా నేత యడియూరప్పను ఆహ్వానించారు. ఫలితంగా ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తర్వాత ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడంతో బలపరీక్ష అనివార్యమైంది. భాజపాకు సంఖ్యాబలం లేకపోవడంతో విశ్వాసపరీక్షకు వెళ్లకుండానే మూడు రోజులకే యడియూరప్ప ప్రభుత్వం కూలిపోయింది. అనంతరం కాంగ్రెస్, జేడీఎస్ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాయి. గోవాలో 40 శాసనసభ స్థానాలుండగా.. 2017లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ దక్కలేదు. కాంగ్రెస్ 17, భాజపా 13 సీట్లు గెలుచుకున్నాయి. అతిపెద్ద పార్టీగా అవతరించిన కాంగ్రెస్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానిస్తారని అంతా భావించారు. అయితే, అనూహ్యంగా నాటి గవర్నర్ మృదులా సిన్హా.. భాజపా నేత మనోహర్ పారికర్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు. అనంతరం అసెంబ్లీలో బలపరీక్ష నిర్వహించగా.. చిన్న పార్టీల మద్దతుతో నాడు భాజపా సర్కారు గట్టెక్కింది. అదే ఏడాది (2017) మణిపుర్‌లో ఇదే తరహా పరిస్థితులు చోటుచేసుకున్నాయి. నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ 28, భాజపా 22 సీట్లు గెలుచుకున్నాయి. ఆ సమయంలో చకచకా పావులు కదిపిన భాజపా.. చిన్న పార్టీలతో కలిసి కూటమిగా ఏర్పడింది. మెజార్టీ చూపించడంతో నాటి గవర్నర్ నజ్మా హెప్తుల్లా ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించారు.

# కొండా సురేఖ వ్యాఖ్యలు అభ్యంతరకరం

- ఎండోమెంట్ మంత్రిగా ఇలానేనా వ్యాఖ్యానించేది
- మండిపడ్డ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్



**హైదరాబాద్, మే7 (జనంసాక్షి) :** జై శ్రీ రామ్ అంటే పై నుంచి పైసలు పడతాయా అని మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండోమెంట్ మంత్రి అంటే దేవుడికి మినిస్టర్‌లాగా ఉండాలని.. కానీ కొండా సురేఖ ఏ శాఖకు మంత్రి..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. గురువారం హైదరాబాద్ లో రాజాసింగ్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి గతంలో ఏబీవీపీలో ఉన్నప్పుడు జై శ్రీరాం అన్నారని ప్రస్తావించారు. మరి ఇప్పుడు తన మంత్రికి జై శ్రీరాం గురించి నేర్పించలేదా..? అని నిలదీశారు. జై శ్రీరాం అంటే కొండంత బలం వస్తోందని...కానీ అనుచితంగా మాట్లాడితే మంత్రి పదవి పోతుందని ఆమెకు చెప్పాలని అన్నారు. తెలంగాణలో దేవుడి భూముల అమ్మకాలు, కబ్జాలు ఎలా జరుగుతున్నాయో చూస్తున్నామని అన్నారు. ఈ విషయంలో కొండా సురేఖ ఎలాంటి చర్యలు చేపట్టారు...? అని రాజాసింగ్ ప్రశ్నించారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీలో దేవుడి భూములను ఎంఐఎం నేతలు కబ్జా చేశారని ఆరోపించారు. దేవాదాయ శాఖ అధికారులు వారితో కుమ్మక్కై కమిషన్లు తీసుకుంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కి దేవాలయాల అభివృద్ధి మీద ధ్యాస లేదని ఆగ్రహించారు. ఎంఐఎం నేతలిచ్చే కమిషన్ల మీదనే ఈ మంత్రికి ధ్యాస ఉందని ఎద్దేవా చేశారు. రాముడి నామాన్ని ఎదిరించడానికి సాహసించేవారు.. ఎవరైనా గాల్లో కొట్టుకుపోతారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, దయచేసి మీ దేవాదాయ శాఖ మంత్రిని పిలిపించి రాజీనామా చేయించాలని హితవు పలికారు. లేకపోతే మీరు కూడా కేసీఆర్ లాగా మునిగిపోతారని రాజాసింగ్ విమర్శించారు.

# గోధుమ ధరల పతనం

- పిండి ధరలు మాత్రం పైపైకి



**న్యూఢిల్లీ, మే7 (జనంసాక్షి) :** గోధమ ధరల పతనం రైతులను ఆందోళన కలిగిస్తోంది. మద్దతు ధరలు ఉన్నా, ఉత్పత్తి పెరిగిన కారణంగా ధరలు పడిపోతున్నాయి. దీంతో పలు రాష్ట్రాల్లో గోధులమలు పండించే రైతులు ఆందోళన చెందుతున్నారు. గోధుమల ధరలు ఎందుకు తగ్గుతున్నాయనే ప్రశ్నకు ఓ వ్యాపారి సమాధాన మిస్తూ ఉత్పత్తి పెరుగుతుందన్న అంచనాలు, సరుకు పెద్ద ఎత్తున రావడం, ప్రభుత్వం వద్ద 2.2 కోట్ల టన్నుల నిల్వలు ఉండడం కారణమని చెప్పారు. 'మండీలలో గోధుమ పిండిని తక్కువ ధరకు అమ్ముతున్నారు. అదే మాల్స్‌లో దాని ఖరీదు ఎక్కువగా ఉంటోంది. ఇది కఠోర వాస్తవం. రైతు నష్టపోతుంటే అది వినియోగదారుడికి ఆదాగా మారడం లేదు. మధ్యవర్తులు, బ్రాండెడ్ కంపెనీలు లాభపడుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ప్రముఖ బ్రాండెడ్ సంస్థలు గోధుమ పిండి మార్కెట్‌ను తమ చెప్పుచేతల్లో పెట్టుకుంటున్నాయి. బ్రాండ్ విలువ, ప్యాకేజింగ్, పంపిణీ వ్యవస్థ వంటి అంశాలు ధరను ప్రభావితం చేస్తున్నాయి. అసంఘటిత రంగంలో పిండి మిల్లులు విద్యుత్ ఛార్జీలు, కార్మికులు, రవాణా వంటి స్థిర ఖర్చులను భరించాల్సి వస్తోంది. గోధుమల ధర పెరిగినప్పుడు ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంటుంది. నిల్వలపై పరిమితులు నిర్ణయిస్తుంది. ఎగుమతులపై ఆంక్షలు విధిస్తుంది. బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తుంది. ధర ఎంఎస్‌పీ కంటే తక్కువగా ఉన్నప్పుడు సేకరణను పెంచి రైతుల ప్రయోజనాలను కాపాడాలని ప్రయత్నిస్తుంది. అయితే ఈ మద్దతు అనేది రాష్ట్రాలన్నింటిలో ఒకేలా ఉండదు. ఫలితంగా అన్నదాతలు తమ పంటను తక్కువ ధరకే తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ధరలు తగ్గినా వినియోగదారునికి కలిగే ప్రయోజనం స్వల్పమే. సేకరణ బలహీనంగా ఉన్నప్పుడు రైతులు అయిన కాడికి తమ పంటను విక్రయించుకోవాల్సి వస్తోంది. అదే సమయంలో రొట్టెల తయారీకి ఉపయోగించే గోధుమ పిండి కోసం వినియోగదారులు గరిష్ట ధరలు చెల్లిస్తూనే ఉన్నారు.



# తమిళనాట మళ్లీ రిసార్ట్ రాజకీయాలు

- ఎమ్మెల్యేలను రిసార్టుకు తరలించిన ఎఐడిఎంకె
- అద్భుతం జరగోతోందన్న ఎఐడిఎంకె నేత అన్బళగన్

**చెన్నై, మే7 (జనంసాక్షి) :** తమిళనాడు రాజకీయ వేదికపై మళ్ళీ 'రిసార్టు రాజకీయాలు' వేడెక్కాయి. గత కొద్దిరోజులుగా నెలకొన్న అనిశ్చితికి తెరదించుతూ, ఎఐడిఎంకె త్వరలోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు అన్బళగన్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎవరూ ఊహించని విధంగా ఒక 'అద్భుతం' జరగబోతోందని ఆయన వ్యాఖ్యానించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అన్బళగన్ మీడియాతో మాట్లాడుతూ.. 'మాకు ప్రస్తుతం 118 మంది ఎమ్మెల్యేల మద్దతు లభిస్తోంది. రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్యబద్ధంగా మేమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. అందరినీ ఆశ్చర్యపరిచే విధంగా ఇతర పక్షాల మద్దతు కూడా మాకు లభించబోతోంది' అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఏర్పాటు దిశగా పావులు కదుపుతున్న ఎఐడిఎంకె, తమ ఎమ్మెల్యేలు చేజారిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇప్పటికే రాష్ట్రంలో క్యాంప్ రాజకీయాలు మొదలయ్యాయి. సీనియర్ నేతల పర్యవేక్షణలో సుమారు 27 మంది ఎమ్మెల్యేలు పుదుచ్చేరిలోని ఒక ప్రైవేట్ రిసార్టుకు చేరుకున్నారు. సీవీ షణ్ముగం నేతృత్వంలో మిగతా ఎమ్మెల్యేలను మరొక రహస్య ప్రాంతానికి తరలించినట్లు సమాచారం. తమ ఎమ్మెల్యేలపై ఒత్తిడి రాకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. అన్బళగన్ చెప్పిన ఆ 'అద్భుతం' ఏ రూపంలో ఉండబోతోంది? అనేది హాట్ టాపిక్‌గా ఉంది.

# నిధులు లేని కార్పోరేషన్లకు చైర్మన్ల నియామకం

బలోపేతం చేయకుండా నిర్వీర్యం చేయడం తగదు: వేముల



**నిజామాబాద్, మే 7 (జనంసాక్షి) :** సీఎం రేవంత్‌రెడ్డికి కార్పొరేషన్ పదవులు ఇవ్వడంపై ఉన్న శ్రద్ధ నిధులు విడుదల చేయడంపై లేదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు, విధులు లేకుండా కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన ఘనత రేవంత్‌రెడ్డికే దకుతుందని విమర్శించారు. మాల, మాదిగ, సంతు సేవాలాల్, కుమ్రంభీం, ఏకలవ్య, మైనార్టీ కార్పొరేషన్లకు ఒక రూపాయి కేటాయించకుండా నిర్లక్ష్యం ప్రదర్శించడం, వారి పట్ల చూపుతున్న వివక్షకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముదిరాజ్, యాదవ, మున్నూరు కాపు, కుమ్మరి, విశ్వబ్రాహ్మణ, మేదర, వాల్మీకి, బోయ తదితర కార్పొరేషన్లకు కేటాయించిన నిధుల్లో ఒక రూపాయి కూడా ఖర్చు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. కార్పొరేషన్లను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చి ఏం సాధిస్తారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సంక్షేమం కంటే అనుచరులను సంతృపిపరచడంపైనే ఎక్కువ దృష్టి పెట్టారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం 17 కార్పొరేషన్లకు చైర్‌పర్సన్లు ప్రకటించడం పట్ల తీవ్రంగా స్పందించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న 33 కార్పొరేషన్లకు నిధులు కేటాయించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు మరికొందరికి కార్పొరేషన్ పదవులు ఇవ్వడం హాస్యాస్పదమని ఆక్షేపించారు. నిధులు విడుదల చేయకపోవడంతో, మొదటి దఫాలో నియమితులైన చైర్మన్లు ప్రజలకు ఒక రూపాయి కూడా సాయం చేయకుండా వారి పదవీకాలాన్ని ముగించారని గుర్తు చేశారు. 33 కార్పొరేషన్లకుగాను 21 కార్పొరేషన్లకు ఒక రూపాయి కూడా ఇవ్వకుండా వాటి అసలు ఉద్దేశాన్ని నీరుగార్చారని మండిపడ్డారు. ఇదే విషయాన్ని అసెంబ్లీ లో నిలదీస్తే సరైన సమాధానం లేదని పేర్కొన్నారు. కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించి చేతులు దులుపుకోవడం మానేసి, ఆయా కులాల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

# గతానుభవాలను గవర్నర్ గుర్తించాలి

- విజయ్‌కు ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించాలి
- తమిళ నటుడు విశాల్ వ్యాఖ్యలు



**చెన్నై, మే7 (జనంసాక్షి) :** ప్రస్తుతం తమిళనాడులో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై నటుడు విశాల్ స్పందిస్తూ సోషల్ మీడియా వేదికగా చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అయ్యాయి. విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు గవర్నర్ ఎందుకు అవకాశం ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. 2017-18లో గోవా, మణిపూర్, మేఘాలయ, కర్ణాటకలో జరిగిన పరిణామాలను విశాల్ గుర్తు చేశారు. అప్పట్లో ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇచ్చి, తర్వాత అసెంబ్లీలో ఫ్లోర్ టెస్ట్ నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ఇప్పుడు తమిళనాడులో కూడా టీవీకే అధినేత విజయ్‌కు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలని విశాల్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం తమిళనాడులో 233 మంది ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేయాల్సి ఉందని, ఇలాంటి సమయంలో గవర్నర్ పాలన కాదని, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమే కావాలని విశాల్ ట్వీట్‌లో పేర్కొన్నారు. టీవీకే పార్టీకి దాదాపు మెజారిటీ వచ్చినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వడంలో గవర్నర్ ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని విశాల్ ప్రశ్నించారు. ప్రజల తీర్పుకు గౌరవం ఎక్కడ? అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ హక్కులు రాజకీయ నాయకులకు మాత్రమే కాదని, ప్రజలకు కూడా తెలుసని విశాల్ అన్నారు. విజయ్ తప్పకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తారని, తాను కూడా అదే కోరుకుంటున్నానంటూ విశాల్ తన మద్దతు ప్రకటించారు.

# తండాలున్న ప్రాంతాల్లో ఇళ్ల సంఖ్య పెంచాలి: కోమటిరెడ్డి



**హైదరాబాద్, మే7 (జనంసాక్షి) :** దేవరకొండ,ఆలేరు లాంటి ఎస్టీ జనాభా,తండాలు అధికంగా ఉన్న నియోజక వర్గాల్లో అదనపు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటిని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. హిమాయత్ నగర్ హౌసింగ్ కార్పోరేషన్ భవనంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇందిరమ్మ ఇండ్లు,రెవెన్యూ సంబంధిత అంశాలపై జరిగిన సమావేశంలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి , రెవెన్యూ,గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. వీరిఅధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రధాన అంశాలు ప్రస్తావించారు. మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి లేవనెత్తిన అంశాలపై పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించి,తగు చర్యలకు అంగీకారం తెలిపారు.

# ఫార్మా సిటీ రైతుల పక్షాన పోరాడతాం

- 'ఫార్మా సిటీ కోసం సేకరించిన భూములను రైతులకు తిరిగి ఇచ్చేయాలి
- ఫ్యూచర్ సిటీ పేరుతో బలవంతపు భూసేకరణ సరికాదు
- ఫార్మా సిటీ రైతులకు న్యాయం జరిగే వరకు ముందుండి పోరాడుతాం
- తెలంగాణ రక్షణ సేన (టీఆర్‌ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఫార్మా సిటీ రైతుల పక్షాన రణం చేస్తామని తెలంగాణ రక్షణ సేన (టీఆర్‌ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన భూములను వెంటనే రైతులకు తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో "ఫార్మా సిటీలో ఏం జరుగుతోంది" అంశంపై గురువారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫార్మా సిటీ భూసేకరణ కోసం తెచ్చిన జీవో 31 ను రద్దు చేయాలన్నారు. ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ పేరుతో రైతులను ఆగం చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఫార్మాసిటీ భూముల విషయంలో గత ప్రభుత్వం నిసిగ్గుగా అబద్దాలు చెబితే...అవే అబద్దాలను ఈ ప్రభుత్వం కొనసాగిస్తుందని మండిపడ్డారు. నిజం చెప్పే దమ్ము ఈ ప్రభుత్వాలకు లేదన్నారు. ఫార్మా సిటీ భూముల విషయంలో తెలంగాణ రక్షణ సేనయే ముందుండి బాధితుల తరఫున కొట్లాడుతుందని చెప్పారు. ప్రశ్నించటం, పోరాడటం, పరిష్కరించటం అనే విధానంతో తాము ముందుకు వెళ్తున్నామని... ఫార్మా సిటీ బాధిత రైతుల సమస్య పరిష్కరించే వరకు కొట్లాడుతామని స్పష్టం చేశారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను రైతులకు వెంటనే ఇచ్చేయాలని కవిత అన్నారు. రైతుల అంగీకారం లేకుండానే వారి భూములను సేకరించారని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఫార్మాసిటీ లో భూముల సేకరణ కోసం జీవో 31ను తీసుకొచ్చిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేస్తామని చెప్పి...అధికారంలోకి వచ్చాక రైతుల మోసం చేస్తుందన్నారు. జీవో 31 రద్దు చేయకపోగా ఫ్యూచర్ సిటీ పేరుతో భూ సేకరణను 13,500 ఎకరాల నుంచి 30 వేల ఎకరాలు చేశారన్నారు. గత ప్రభుత్వం నిసిగ్గుగా ఫార్మాసిటీ కోసం 13 వేల 5 వందల ఎకరాలు సేకరించినట్లు ప్రకటించిందని గుర్తు చేశారు. కానీ దాంట్లో కందుకూరు మండలంలో 3500 ఎకరాలు, యాచారం మండలంలో 6500 ఎకరాలు అసైన్డ్ భూమే ఉందని కవిత చెప్పారు. వాటికి సంబంధించి కోర్టులో స్టే ఉన్న సరే బీఆర్‌ఎస్ ప్రభుత్వం లెక్కచేయలేదని విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దాలు చెబుతూ కోర్టును, ప్రజలను మోసం చేస్తుందన్నారు. కోర్టులో ఫార్మా సిటీ కొనసాగిస్తామని చెబుతూ...బయట మాత్రం రేవంత్ సర్కార్ ఫ్యూచర్ సిటీ కోసం ఈ భూముల సేకరణ మొదలు పెట్టిందని విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులకు అన్యాయం జరగనిచ్చేది లేదని తేల్చిచెప్పారు. ఫ్యూచర్ సిటీ పేరుతో రేవంత్ సర్కార్ ప్రజలందరినీ మోసం చేస్తోందని కవిత అన్నారు. బుల్లెట్ ట్రైన్ వస్తోందని, 6 లక్షల కోట్ల ఎంఓయూలు, డేటా సెంటర్లు అంటూ అబద్దాల పునాదుల మీద ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేయాలనుకుంటున్నారని చెప్పారు. డేటా సెంటర్ల పేరుతో ప్రజలను కాలుష్యం కోరల్లోకి నెట్టేస్తారా అని ప్రశ్నించారు. డేటా సెంటర్ల ద్వారా వచ్చే శబ్దానికి పక్షులు బతికే పరిస్థితి ఉండదని, అమెరికా లాంటి దేశాలు డేటా సెంటర్లు పెట్టటం లేదని చెప్పారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370